www.andhrajyothy.com
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
గుంటూరు సిటీ

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 124

గురువారం | 10-7-2025

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, తిథి: పౌర్ణమి రా.2:07 తదుపరి పాడ్యమి, నక్షత్రం: పూర్వాషాఢ పూర్తి, వర్జ్యం: మ.2:52-4:32, దుర్ముహూర్తం: ఉ.10:10-11:02, మ.3:22-4:14, అమృతఘడియలు: రా.12:54-2:35, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 5:51, సూర్యాస్తమయం: 6:50

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మీకేం పట్టదా?

చేసిన మంచినీ చెప్పరా.. దుష్ప్రచారం అడ్డుకోలేరా?

మంత్రులపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసహనం



బుధవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పక్కన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి అచ్చెన్నాయుడు, సీఎస్ విజయానంద్

- తోతాపురి మామిడికి కిలోకు రూ.4 అదనంగా ఇచ్చి కొనిపించాం
- 80% కొనేశాక జగన్ హడావుడి
- రైతుల వద్దకు వెళ్లి తలకాయలు రప్పా రప్పా నరుకుతామంటారా?
- ఎక్కడా లేని విధంగా పొగాకును 275 కోట్లు వెచ్చించి కొనిపించాం
- నిత్యావసరాల ధరలు తగ్గించాం
- మహిళా ఎమ్మెల్యేను దూషించినా మీరు స్పందించరా?
- మంత్రులు, ఎమ్మెల్యేల్లో ఉదాసీనత
- దీంతో ప్రజల్లో వైసీపీ దుష్ప్రచారం
- క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులకు చంద్రబాబు క్లాసు

"జరుగుతున్న పరిణామాల పట్ల మంత్రులు పూర్తి అప్రమత్తంగా ఉండాలి. వాటిపై ఎప్పటికప్పుడు స్పందించాలి. లేకుంటే రాజకీయంగా చాలా నష్టపోతాం. - చంద్రబాబు"

తోతాపురి రైతులకు రూ.260 కోట్లు

- ఈ సీజన్‌లో 6.50 లక్షల టన్నుల మామిడి సేకరణ
- అమరావతిలో ఎమ్మెల్యేల క్వార్టర్స్‌కు 524 కోట్లు
- వాహనాలపై గ్రీన్ ట్యాక్సు తగ్గింపుపై ఆర్డినెన్స్
- 'కోకో' మద్దతు ధర కింద 14.88 కోట్లు
- క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి కొలుసు

ఆడవాళ్లంటే వైసీపీ నేతలకు చులకన. మహిళలు ఇళ్లలో నుంచి బయటికి రాకుండా వారి ఆత్మస్థైర్యం దెబ్బతీసేందుకు వారిని కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తున్నారు. అమరావతిని వేశ్యల రాజధాని అనడం, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై ప్రసన్న వ్యాఖ్యలు దీనికి నిదర్శనం. - సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మంత్రుల పనితీరు సంతృప్తికరంగా లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేను ఉద్దేశించి వైసీపీ నేతలు నీచంగా మాట్లాడితే వెంటనే ఎందుకు స్పందించలేదని బుధవారం మంత్రివర్గ సమావేశంలో నిలదీశారు. ఈ భేటీ మూడున్నర గంటలపాటు జరిగింది. ఎజెండా అంశాలను చర్చించాక.. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై ముఖ్యమంత్రి తన సహచరులతో మాట్లాడారు. నెల్లూరు జిల్లా కోవూరు టీడీపీ ఎమ్మెల్యే

మిగతా 12వ పేజీలో...

71 సాగునీటి ప్రాజెక్టులకు ఊపిరి! 12

పనుల పూర్తికి రూ.27,941.34 కోట్లు.. క్యాబినెట్‌లో తీర్మానం

నేటి నుంచి రైతుల ఖాతాల్లో ధాన్యం బకాయిలు

బంగారుపాళ్యంలో దండుపాళ్యం

మరో దండయాత్ర



రైతుల పరామర్శ పేరిట అదే అరాచకం


● 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి



'మేమింతే...' అని వైసీపీ నేతలు మరోసారి నిరూపించుకున్నారు. బంగారుపాళ్యంలో జగన్ పర్యటన కవరేజీకి వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి చేసి గాయపరిచారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి సైగ చేయగానే ఇలా విరుచుకుపడ్డారు.

- దండయాత్రలా మామిడి యార్డుకు జగన్
- 'ఎంపిక'చేసిన రైతులకు అరగంటే పరామర్శ
- ఎక్కడా రూల్స్‌ను పాటించని వైసీపీ బ్యాచ్
- యార్డులోకి దౌర్జన్యంగా చొచ్చుకెళ్లి రచ్చ రచ్చ
- పోలీసులను నెట్టేస్తూ..కవ్విస్తూ నానా బీభత్సం
- 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి
- హైవేపై జనం లేకపోవడంతో ప్లాన్ మార్పు
- బంగారుపాళ్యం గ్రామంలోకి వెళ్లే యత్నం
- అడ్డుపడిన చిత్తూరు ఎస్పీపైకి వాహనం..
- బంగారుపాళ్యం స్టేషన్‌లో 3 కేసులు నమోదు

● జనం లేక దారిమళ్లి...



నిరసన పేరుతో అరాచకం! పరామర్శ పేరుతో దౌర్జన్యం! నిబంధనలంటే లెక్కలేదు. ఆంక్షలకు విలువలేదు. పోలీసు అధికారులకే 'రప్పా రప్పా' బెదిరింపులు! 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి! అనుమతించిన దారిలోకాకుండా... ఊరిలోంచి వెళ్లే దూకుడు ప్రయత్నాలు! ప్రశాంతమైన బంగారుపాళ్యంలో 'దండుపాళ్యం' బ్యాచ్ తరహా దౌర్జన్యకాండ! ఇదీ... 'మామిడి రైతులకు పరామర్శ' పేరుతో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన దండయాత్ర! ఇంతాచేస్తే... ఆయనవల్ల రైతులకు మేలు జరగలేదు సరికదా, కీడే జరిగింది! మండీలో అమ్ముకుందామని ఓ రైతు తెచ్చుకున్న తోతాపురి కాయలను వైసీపీ నేతలు దౌర్జన్యంగా రోడ్డుపై పడేసి, ట్రాక్టర్లతో తొక్కించారు. అటు... ముందస్తు వ్యూహం ప్రకారం స్థానిక వైసీపీ నేత తోటలోని కాయలను రోడ్డుపై పడేసి 'నిరసన' తెలిపారు. తోతాపురి మామిడిపై జగన్ వచ్చి అబద్ధాలు, అర్ధసత్యాలు చెప్పారు. ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రయత్నించారు. మరోవైపు... జగన్ పర్యటన కారణంగా బుధవారం మామిడి మండీ మూత పడింది. సీజన్ చివర్లో ఒకరోజు ఇలా వృథా కావడంతో తమకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. తమను ఆదుకునేందుకు ప్రభుత్వం తీసుకున్న, తీసుకుంటున్న చర్యలపట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. జగన్‌ది స్వార్థపూరిత రాజకీయ యాత్రే తప్ప... తమకు మేలు చేసే యాత్ర కాదని మండిపడ్డారు!

బంగారుపాళ్యం, చిత్తూరు (అర్బన్), జూలై 9 (ఆంధ్రజ్యోతి): మళ్లీ అదే అరాచకం! నిండు ప్రాణాలను తన పర్యటనలు బలి తీసుకుంటున్నా, పోలీసులు ఎన్ని సూచనలు చేస్తున్నా...ఏ మార్పులేని తన నైజాన్ని వైసీపీ అధినేత జగన్ మరోసారి బయటపెట్టుకున్నారు. మామిడి రైతులకు పరామర్శ పేరిట బుధవారం చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంపై దండయాత్ర సాగించారు. సీఎంగా పనిచేసినా, జడ్‌ప్లస్

మిగతా 13వ పేజీలో...

మామిడి రైతులకు పరామర్శ పేరుతో వైఎస్ జగన్ చేసిన రోడ్ 'షో'.. ఇలా జనంలేక వెలవెలబోయింది. దీంతో.. అనుమతించిన దారిలో కాకుండా బంగారుపాళ్యం గ్రామంలోంచి వెళ్లేందుకు ప్రయత్నించారు. హైడ్రామా సృష్టించారు.

నేడు మెగా పీటీఎం 2.0

- 61 వేల బడులు, జూనియర్ కాలేజీల్లో నిర్వహణ
- మొత్తం 2.28 కోట్ల మంది పాల్గొంటారని అంచనా
- 'పుట్టపర్తి'లో పాల్గొననున్న సీఎం చంద్రబాబు, లోకేశ్
- గిన్నిస్ రికార్డు నెలకొల్పే దిశగా అధికారుల ఏర్పాట్లు



అమరావతి/పుట్టపర్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో గురువారం మెగా పేరెంట్- టీచర్స్ సమావేశాలు (పీటీఎం 2.0) జరగనున్నాయి. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లూ చేసింది. గత విద్యా సంవత్సరంలో తొలిసారిగా నిర్వహించిన మెగా పీటీఎం విజయవంతం కావడంతో ఇప్పుడు రెండోసారి నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ సమావేశాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉద్యోగులు, అధికారులు, దాతలు, పూర్వ విద్యార్థులు పాల్గొంటారు. ఈ మేరకు వారికి పాఠశాల విద్యాశాఖ ఆహ్వానాలు పంపింది. 61 వేల ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్

మిగతా 12వ పేజీలో...



2

జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన

- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తీర్మానం ప్రవేశపెట్టే యోచనలో కేంద్రం
- ప్రధాన పార్టీలతో సంప్రదింపులు
- ఇప్పటికే మొదలైన సంతకాల సేకరణ

హెల్మెట్ ధరించక 4,276 మంది మృతి

- గత ఏడాది ప్రమాదాలపై హైకోర్టు ఆందోళన
- బెజవాడ పోలీసులకు అభినందనలు 9
- అవగాహన కొనసాగించాలని నిర్దేశం
- పత్రికలు, టీవీల్లోనూ ప్రకటనలివ్వాలని సూచన
- అందుకు నిధులు ఇవ్వాలని సీఎస్‌కు ఆదేశం

లిక్కర్ స్కాంలో రజత్ భార్గవ!



- సీనియర్ ఐఏఎస్ పేరు వెలుగులోకి
- పాలసీ రూపకల్పన నుంచి కమీషన్ల వసూలు వరకూ..
- రాజ్ కసిరెడ్డికి పెత్తనం.. ముడుపులతో మౌనం
- కీలక ఆధారాలు సేకరించిన 'సిట్'
- రేపు విచారణకు రావాలని నోటీసు అందజేత
- అనంతరం చర్యలకు ఉపక్రమించే అవకాశం

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన 3,500 కోట్ల రూపాయల మద్యం కుంభకోణంలో సీనియర్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవ పేరు వెలుగులోకి వచ్చింది. మద్యం పాలసీ రూపకల్పన నుంచి కమీషన్లు తీసుకోవడం వరకూ ఆయన అడుగడుగునా ఉల్లంఘనలకు పాల్పడినట్లు తెలుస్తోంది. మద్యం మాఫియా విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడుతూ రాష్ట్ర ప్రజల్ని దోచుకొంటుంటే ఆయన చోద్యం చూశారు. దేశంలోనే అతిపెద్ద లిక్కర్ స్కాంలో ప్రధాన నిందితుడైన రాజ్ కసిరెడ్డి(ఏ-1) మొత్తం అబ్కారీ శాఖను శాసిస్తుంటే సీనియర్ ఐఏఎస్ అధికారి కనీసం అభ్యంతరం చెప్పలేదు. అందుకు కారణాలు

మిగతా 9వ పేజీలో...



మాజీ ఎమ్మెల్యే ప్రసన్నపై కేసు

- ప్రశాంతిరెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యలు 11
- 4 సెక్షన్లపై కోవూరు స్టేషన్‌లో నమోదు



వంతెన కూలి.. నదిలో పడ్డ వాహనాలు

- 13 మంది దుర్మరణం.. గుజరాత్‌లో ఘటన
- వంతెన 40 ఏళ్ల నాటిది 2
- దృఢత్వంపై గతంలోనే స్థానికుల ఫిర్యాదులు
- పట్టించుకోని అధికారులు



2

కూలిన 'జాగ్వార్' జెట్

- ఇద్దరు వాయుసేన పైలట్ల మృతి
- రాజస్థాన్‌లోని చురు జిల్లాలో దుర్ఘటన
- గత 5 నెలల్లో కూలిన మూడో జాగ్వార్



నమీబియా కళాకారులతో కలిసి డోలు వాయిస్తున్న మోదీ

కాలపరీక్షను తట్టుకొని నిలిచిన స్నేహబంధం

- నమీబియా పార్లమెంటులో ప్రధాని ప్రసంగం
- మోదీకి ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం
- ఇంధనం, ఆరోగ్యం తదితర రంగాల్లో ఇరు దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు 2

మళ్లీ సబ్‌ప్లాన్

చట్టప్రకారం ఎస్సీ, ఎస్టీ నిధుల వినియోగం

- దళిత, గిరిజన కాలనీల్లో మౌలిక వసతులు
- సిమెంట్ రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణం
- అన్ని శాఖల నుంచి సబ్‌ప్లాన్ అమలుకు నోడల్ ఏజెన్సీ సన్నాహాలు
- గత వైసీపీ హయాంలో సబ్‌ప్లాన్ నిర్వీర్యం
- డీబీటీ పథకాలతో బుక్ అడ్జస్ట్‌మెంట్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను మళ్లీ సమర్థంగా అమలు చేసేందుకు కూటమి సర్కారు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. గత ఐదేళ్లు సబ్‌ప్లాన్ నిధుల వినియోగం పుస్తకాలకే పరిమితమైంది. వైసీపీ సర్కారు అమలు చేసిన డీబీటీ పథకాల్లో ఎస్సీ, ఎస్టీలకు అందిన ప్రయోజనాలనూ లెక్కించి సబ్‌ప్లాన్ అమలు చేసినట్లు

మిగతా 11వ పేజీలో...

ప్రజాసేవకే టెక్నాలజీ

- వారికి ఉపయోగపడినప్పుడే సార్థకత
- వైద్యఖర్చులు పెరిగాయి.. తగ్గించాలి
- పేదలకు నాణ్యమైన విద్య అందాలి
- టెక్నాలజీతోనే ఇవన్నీ సాధ్యం 12



'బిల్‌గేట్స్'తో కలిసి చేపడుతున్న పనులపై సీఎం చంద్రబాబు సమీక్ష



సిద్ధూ తయారు చేసిన సైకిల్‌పై అతడిని ఎక్కించుకుని వెళుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

9

భలే ఈ-సైకిల్.. భళా సిద్ధూ!

- ఇంటర్ విద్యార్థికి పవన్ అభినందనలు
- ప్రోత్సాహకం కింద రూ.లక్ష అందజేత

యాపిల్ సీవోవోగా సబీ ఖాన్ 2

1966లో యూపీలో జననం.. 1995లో యాపిల్‌లోకి



2

వచ్చే ఏడాది నుంచి అమెరికా వీసా చార్జీల పెంపు

- విద్యార్థి, పర్యాటక, వ్యాపార, ఎక్స్ఛేంజ్ వీసాలపై..
- ఇంటిగ్రిటీ రుసుము 250 డాలర్లు

వంతెన కూలి నదిలో పడ్డ వాహనాలు

గుజరాత్‌లో 13మంది దుర్మరణం




వడోదర, జూలై 9: గుజరాత్‌లోని వడోదర జిల్లాలో నాలుగు దశాబ్దాల క్రితం నాటి భారీ వంతెన కూలిపోయింది. పాద్రా పట్టణం సమీపంలోని మహిసాగర్ నదిపై వడోదర-ఆనంద్ జిల్లాలను కలుపుతూ నిర్మించిన గంభీర బ్రిడ్జ్‌లో రెండు పియర్ల మధ్య 10-15 మీటర్ల మేర స్లాబు బుధవారం ఉదయం పూర్తిగా కూలిపోయింది. ఆ సమయంలో వంతెనపై నుంచి వెళుతున్న వాహనాల్లో రెండు ట్రక్కులు, రెండు వ్యాన్లు, ఆటోరిక్షా, కారు, బైక్ సహా కనీసం 12 వాహనాలు నదిలోకి పడిపోయాయి. ఈ ఘటనలో 13మంది మృత్యువాతపడ్డారు. మృతుల్లో నాలుగేళ్లు, రెండేళ్ల వయసున్న తోబుట్టువులు ఉండటం మరింత విషాదం! నాలుగేళ్ల బాలిక మినహా మృతులంతా పురుషులే! మరో తొమ్మిది మందిని సహాయక సిబ్బంది సురక్షితంగా బయటకు తీశారు. ఘటన పట్ల ప్రధాని మోదీ, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు మోదీ రూ.2 లక్షల చొప్పున, భూపేంద్ర పటేల్ రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. 900 మీటర్ల పొడవు, 23 పియర్లతో కూడిన గంభీర బ్రిడ్జ్ గుజరాత్-సౌరాష్ట్ర ప్రాంతాలను కలుపుతుంది. 1985లో దీన్ని నిర్మించారు. వంతెన నిర్వహణకు సంబంధించి అవసరమైనప్పుడల్లా మరమ్మతులు నిర్వహిస్తున్నామని గుజరాత్ మంత్రి రుషికేశ్ పటేల్ చెప్పారు. అయితే, వంతెన పరిస్థితిపై స్థానికులు గతంలోనే ఆందోళన వ్యక్తం చేశారని స్థానిక మీడియా పేర్కొంది. దీనిపై కథనాలు ప్రసారమైనట్లు తెలిపింది. అధికారులు పైపైన మరమ్మతులు చేసి చేతులు దులుపుకొన్నారని విమర్శించింది.

ఆసియాలోనే అత్యంత వృద్ధ ఏనుగు కన్నుమూత



భోపాల్, జూలై 9: ఆసియాలోనే అత్యంత వృద్ధ ఏనుగుగా పేరొందిన వత్సల మరణించింది. వందేళ్లకు పైబడిన ఈ ఏనుగు వృద్ధాప్యం కారణంగా మధ్యప్రదేశ్‌లోని పన్నా టైగర్ రిజర్వ్‌లో మంగళవారం చనిపోయింది. టైగర్ రిజర్వ్ అధికారులు, సిబ్బంది దాని అంత్యక్రియలు ఘనంగా నిర్వహించారు. వత్సలను కేరళలోని నిలంబూర్ అడవుల నుంచి తీసుకొచ్చారు.

లోకం తీరు



మోదీకి నమీబియా అత్యున్నత పౌర పురస్కారం

» ఇంధనం, ఆరోగ్య రంగాలతో సహా 4 కీలక ఒప్పందాలు



విండ్‌హోక్, జూలై 9: ప్రధాని మోదీకి నమీబియా అత్యున్నత పౌర పురస్కారం అందజేసింది. విండ్‌హోక్‌లో జరిగిన కార్యక్రమంలో ది మోస్ట్ ఏన్షియంట్ వెల్‌విట్షియా మిరాబిలిస్ అవార్డును నమీబియా అధ్యక్షురాలు నెటుంబో ప్రధాని మోదీకి బహూకరించారు. అనంతరం నెటుంబోతో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య ఇంధనం, ఆరోగ్య రంగాలతో సహా నాలుగు కీలక ఒప్పందాలు కుదిరాయి. ఈ సందర్భంగా ప్రధాని నమీబియా పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. రెండు దేశాల మధ్య స్నేహబంధం కాలపరీక్షను తట్టుకొని నిలబడిందన్నారు. భారత్‌కు చీతాలు ఇచ్చినందుకు నమీబియాకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మోదీ ప్రసంగిస్తున్నంత సేపు నమీబియా పార్లమెంట్ సభ్యులు బల్లలు చరుస్తూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

వర్షాకాల సమావేశాల్లో జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానం!

న్యూఢిల్లీ, జూలై 9: ఇంట్లో పెద్ద మొత్తంలో కరెన్సీ నోట్ల కట్టలు బయటపడడంతో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ న్యాయమూర్తి, జస్టిస్ యశ్వంత్ వర్మపై పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తుంది. ఈ తీర్మానానికి ప్రతిపక్షాల మద్దతు లభిస్తుందని ఆశిస్తోంది. లోక్‌సభలో ఓ తీర్మానం ప్రవేశపెట్టాలంటే మద్దతుగా కనీసం 100 మంది ఎంపీలు సంతకాలు చేయాలి. ఈ సంతకాల సేకరణ ప్రక్రియ ఇప్పటికే మొదలైనట్టు సమాచారం.

యాపిల్ సీవోవోగా సబీ ఖాన్

న్యూఢిల్లీ, జూలై 9: భారత సంతతికి చెందిన సబీ ఖాన్ యాపిల్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో)గా నియమితులయ్యారు. జెఫ్ విలియమ్స్ స్థానంలో ఆయన ఈ నెలాఖరులోగా బాధ్యతలు స్వీకరించనున్నారు. సబీ ఖాన్ యాపిల్ కంపెనీలో 30ఏళ్లుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు.

భారత్‌లో స్టార్ లింక్ ఇంటర్నెట్!

భారతదేశ ఇంటర్నెట్ రంగంలో మరో విప్లవం రాబోతుంది. ప్రపంచ కుబేరుడు మస్క్‌కు చెందిన స్టార్ లింక్ సంస్థ దేశ మార్కెట్‌లోకి అతి త్వరలో అడుగుపెట్టనుంది. ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలందించే స్టార్‌లింక్.. భారత్‌లో వాణిజ్య కార్యకలాపాల నిర్వహణకు కీలకమైన దేశ అంతరిక్ష విభాగం అనుమతులు పొందినట్టు 'రాయిటర్స్' ఓ కథనంలో పేర్కొంది.

వచ్చే ఏడాది నుంచి..

అమెరికా వీసా చార్జీల పెంపు

» ఇంటిగ్రిటీ రుసుము కింద 250 డాలర్ల భారం



న్యూఢిల్లీ, జూలై 9: ఉద్యోగ (హెచ్-1బీ), విద్యార్థి (ఎఫ్/ఎం), పర్యాటక/వ్యాపార(బీ-1, బీ2), ఎక్స్ఛేంజ్ (జే) వీసాలపై అమెరికా వెళ్లేవారిపై వచ్చే ఏడాది నుంచి మరింత భారం పడనుంది! ఈ వీసాలతో తమగడ్డపై అడుగుపెట్టాలనుకునేవారి నుంచి 'ఇంటెగ్రిటీ ఫీ' కింద అదనంగా 250 డాలర్లు (దాదాపుగా రూ.21,500) వసూలు చేయాలని అమెరికా సర్కారు నిర్ణయించింది. నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాలపై అమెరికాకు వచ్చేవారు అక్రమంగా ఉండిపోకుండా, వీసా కాలానికి మించి ఉండకుండా చూసేందుకే ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవలే ఆమోదించిన 'వన్ బిగ్ బ్యూటిఫుల్ యాక్ట్' కింద.. ఈ పెంపు వచ్చే ఏడాది నుంచి అమలు కానుంది. ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఈ రుసుములో మార్పుచేర్పులు ఉంటాయి. అంటే.. ద్రవ్యోల్బణం పెరిగితే ఎక్కువ రుసుము వసూలు చేస్తారు. ఈ వీసాలపై అమెరికాలో అడుగుపెట్టేవారు నిర్ణీత షరతులను పాటిస్తే ఇంటెగ్రిటీ ఫీ కింద వసూలు చేసిన సొమ్మును తిరిగి ఇచ్చేస్తారు. దౌత్య (ఏ, జీ) వీసాలపై వచ్చే వారికి మాత్రం ఈ రుసుము నుంచి మినహాయింపు ఉంటుంది. వీసా జారీ చేసేటప్పుడే అమెరికా 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ' ఈ రుసుమును సర్‌చార్జ్ రూపంలో వసూలు చేస్తుంది. దీంతోపాటు.. ఐ-94 సర్‌చార్జ్ (24 డాలర్లు), ఎలక్ట్రానిక్ సిస్టమ్ ఫర్ ట్రావెల్ ఆథరైజేషన్ (ఈఎస్‌టీఏ-13 డాలర్లు)/ఎలక్ట్రానిక్ వీసా అప్‌డేట్ సిస్టమ్ (ఈవీయూఎస్-30 డాలర్లు) కింద అదనపు రుసుములను ఈ బిల్లులో పొందుపరిచారు. అవీ కలుపుకొంటే వీసా రుసుములు భారంగా మారనున్నాయి.

'గోల్డెన్ వీసా'పై కథనాలను ఖండించిన యూఏఈ

యూఏఈ గోల్డెన్ వీసాను కేవలం రూ.23 లక్షలు చెల్లిస్తే పొందవచ్చన్న కథనాలను ఆ దేశం ఖండించింది. గోల్డెన్ వీసాకు సంబంధించిన రూల్స్‌ను స్పష్టంగా నిర్వచించామని, ఆసక్తి ఉన్నవారు అథారిటీ వెబ్‌సైట్ లేదా స్మార్ట్ అప్లికేషన్‌ద్వారా అధికారిక సమాచారాన్ని పొందవచ్చని తెలిపింది. అన్ని గోల్డెన్ వీసా దరఖాస్తుల ప్రక్రియను యూఏఈలోని అధికారిక ప్రభుత్వ మార్గాల ద్వారా చేపట్టనున్నట్టు స్పష్టం చేసింది. ఈ ప్రక్రియలో ఏ కన్సల్టెన్సీ సంస్థను ఆథరైజ్డ్ పార్టీగా గుర్తించలేదని పేర్కొంది. యూఏఈలో నివసించాలనుకునే వ్యక్తుల నుంచి అక్రమంగా సొమ్ములు వసూలు చేయడానికి ఇలాంటి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

కూలిన జాగ్వార్ ఫైటర్ జెట్

ఇద్దరు పైలట్ల దుర్మరణం.. రాజస్థాన్‌లోని చురు జిల్లాలో దుర్ఘటన

జైపూర్/న్యూఢిల్లీ, జూలై 9: భారత వైమానిక దళాని(ఐఏఎఫ్)కి చెందిన జాగ్వార్ ఫైటర్ జెట్ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు దుర్మరణం పాలయ్యారు. బుధవారం రాజస్థాన్‌లోని చురు జిల్లా భానుడా గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మధ్యాహ్నం 1.25 గంటల సమయంలో భారీ శబ్దంతో వ్యవసాయ క్షేత్రంలో విమానం కుప్పకూలిందని రాజల్‌దేసర్ పోలీసు అధికారి కమలేశ్ తెలిపారు. 'సాధారణ శిక్షణా కార్యక్రమంలో భాగంగా సూరత్‌గఢ్ నుంచి బయలుదేరిన ఫైటర్ జెట్ విమానం ప్రమాదవశాత్తు కుప్పకూలింది. ఘటనపై విచారణకు ఆదేశించాం. ఇద్దరు పైలట్ల దుర్మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాం' అని ఐఏఎఫ్ ప్రకటించింది. ఈ ఏడాది మార్చి తర్వాత కూలిన మూడో జాగ్వార్ ఫైటర్ జెట్ విమానమిది.. 1979లో భారత వైమానిక దళంలో చేరిన ఈ యుద్ధ విమానాలు పాతవై పోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్న వాదనలున్నాయి. గతంలో ఈ విమానాలను వినియోగించిన బ్రిటన్, ఫ్రాన్స్, ఈక్వెడార్, నైజీరియా, ఒమన్ వంటి దేశాలు చాలా కాలం క్రితమే వాటిని ఉపసంహరించుకున్నాయి. కొన్ని విమానాలను మ్యూజియంలలో ప్రదర్శనకు ఉంచాయి.



జాగ్వార్ ఫైటర్ జెట్ శకలాలు

రోదసిలో రైతుగా శుక్లా

ఐఎస్ఎస్‌లో మెంతి, పెసర విత్తనాలపై ప్రయోగం



న్యూఢిల్లీ, జూలై 9: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉన్న భారతీయ వ్యోమగామి శుభాన్షు శుక్లా రైతుగా మారారు. మెంతి, పెసర విత్తనాలను మొలకెత్తించే ప్రయోగాల్లో భాగస్వామి అయ్యారు. ఆ విత్తనాలను ప్రత్యేకమైన గాజు పాత్రలో పెట్టి, వాటి ఫొటోలు తీశారు. తర్వాత ఆ పాత్రలను ఐఎస్ఎస్‌లో ఉన్న స్టోరేజీ ఫ్రీజర్‌లో భద్రపరిచారు. అంతరిక్షంలో విత్తనాలు మొలకెత్తడంపై సూక్ష్మగురుత్వాకర్షణ ప్రభావం, ప్రాథమిక స్థాయిలో వాటి ఎదుగుదల ఎలా ఉంటుందనే దానిని పరిశీలించడానికి ఈ ప్రయోగం చేపట్టారు. ఈ ప్రయోగాన్ని ఇద్దరు శాస్త్రవేత్తలు.. యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్, ధార్వాడ్‌కు చెందిన రవికుమార్ హోసమణి, ఐఐటీ ధార్వాడ్‌కు చెందిన సుధీర్ సిద్ధపురెడ్డి నేతృత్వంలో శుక్లా చేపట్టారు. భూమికి వచ్చాక ఆ విత్తనాల్లో వచ్చిన జన్యుపరమైన మార్పులను పరిశీలిస్తారని యాగ్జియం స్పేస్ ఓ ప్రకటనలో తెలిపింది. మరో ప్రయోగంలో ఆయన సూక్ష్మ ఆల్గేలు అంతరిక్షంలో ఆహారం తయారు చేసుకోవడం, ఆక్సిజన్, జీవ ఇంధనాల ఉత్పత్తి సామర్థ్యంపై అధ్యయనం చేశారు. కాగా, శుక్లాతో పాటు ఐఎస్ఎస్‌కు వెళ్లిన వ్యోమగాములు గురువారం తర్వాత ఎప్పుడైనా భూమికి తిరిగివచ్చే అవకాశం ఉంది. అమెరికాలోని ఫ్లోరిడా తీరంలో వాతావరణ పరిస్థితిని బట్టి యాగ్జియం-4 మిషన్ అన్‌డాకింగ్ ప్రక్రియ ఉంటుంది. ఈ మిషన్‌లో భాగంగా 14 రోజులు వారు అంతరిక్షంలో ఉండే అవకాశం ఉండగా.. బుధవారంతో 12 రోజులు పూర్తయ్యాయి.

ఆర్ఎంపీల సమస్యలపై ప్రత్యేక కమిటీ

▸▸ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా ఆర్ఎంపీలు చేస్తున్న డిమాండ్ల పరిశీలనకు కమిటీని వేస్తామని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆర్ఎంపీలు, ఆశా వర్కర్లు, ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్య సంఘం డిమాండ్లు, సూచలనపై బుధవారం సచివాలయంలో మంత్రితో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టి.డి.జనార్ధన్ భేటీ అయ్యారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఆర్ఎంపీలు తమకు వృత్తి రక్షణ, శిక్షణ అందించాలని కోరుతున్నారు. రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్‌గా సేవలందించాల్సిన ఆర్ఎంపీలు రిజిస్టర్ మెడికల్ ప్రాక్టీషనర్లమని, డాక్టర్లమని చెప్పుకుంటూ ప్రాథమిక చికిత్సా కేంద్రాలుగా బోర్డులు పెట్టుకోవడంపై కొన్ని అభ్యంతారాలొచ్చాయని స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు వివరించారు. వీటన్నింటినీ సమగ్రంగా పరిశీలించి తగు నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఆశావర్కర్ల డిమాండ్లకు సంబంధించి సీఎం ఆమోదించిన కొన్ని విషయాలు ఆర్థిక శాఖ పరిశీలనలో ఉన్నాయని, ఆ ప్రక్రియను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కృష్ణబాబుకు మంత్రి సూచించారు. ఆయుర్వేద వైద్యానికి అవసరమైన ఔషధ మొక్కల్ని పెంచేందుకు అటవీశాఖ పరిధిలో స్థలాన్ని కేటాయించాలని ఆయా ప్రతినిధులు కోరగా, ఈ విషయాన్ని పరిశీలించాల్సిందిగా అటవీశాఖ, ఉన్నత విద్యాశాఖ మంత్రులకు లేఖలు రాస్తామని మంత్రి హామీ ఇచ్చారు. సమావేశంలో కమిషనర్ జి.వీరపాండియన్, డీఎంఈ నరసింహం, డాక్టర్ మంజుల పాల్గొన్నారు.

లేపాక్షి వీరభద్రస్వామికి ఆభరణాల సమర్పణ



బంగారు ఆభరణాలను ఆలయ సిబ్బందికి అందజేస్తున్న సజ్జనార్

లేపాక్షి, జూలై 9(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలో ప్రసిద్ధి చెందిన లేపాక్షిలోని దుర్గావీరభద్రస్వాములకు తెలంగాణ రోడ్డు, రవాణాశాఖ ఎండీ సజ్జనార్ బుధవారం బంగారు ఆభరణాలు సమర్పించారు. కుటుంబ సమేతంగా ఆయన ఆలయాన్ని సందర్శించారు. వీరభద్రస్వామికి 26.030 గ్రాముల బరువున్న బంగారు మీసాలు, విభూతి నామాలు, దుర్గాదేవికి 22.790 గ్రాముల బరువున్న తాళిబొట్టు, ముక్కుపుడకను సజ్జనార్ సమర్పించారు. పెళ్లిరోజును పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

తరగతి గదిలోనే కుప్పకూలిన ఉపాధ్యాయుడు

▸▸ తంటికొండలో గుండెపోటుతో టీచర్ మృతి



నాగభూషణం

గోకవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పాఠాలు చెబుతూనే ఓ ఉపాధ్యాయుడు తరగతి గదిలోనే కుప్పకూలిపోయారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తంటికొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో బొమ్మగంటి నాగభూషణం (56) గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. బుధవారం ఉదయం 10వ తరగతి గది విద్యార్థులకు లెక్కలు బోధిస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. హుటాహుటిన గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో నాగభూషణం స్వగ్రామమైన గోకవరంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన మృతి పట్ల తంటికొండ జడ్పీ ఉన్నత పాఠశాల చైర్మన్ నాగం వెంకటపతి, మండల విద్యాశాఖాధికారిణి గౌరమ్మ సంతాపం తెలిపారు. కాగా.. గత నెల 9న మండలంలోని రంపయర్రంపాలెం నుంచి తంటికొండకు నాగభూషణం బదిలీపై వచ్చారు. గత నాలుగు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ పాఠశాలకు హాజరవుతున్నట్టు సమాచారం. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు గత నెల 5న వివాహం జరిపించారు.

బర్లీ పొగాకు సేకరణకు రూ.273 కోట్లు

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2024-25 రబీ మార్కెట్ సీజన్‌లో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా 20 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకు సేకరణకు ప్రభుత్వం రూ.273.17కోట్లు మంజూరు చేసింది. ఇందులో రైతులకు కిలోకు రూ.120 చొప్పున లెక్కకట్టి రూ.240కోట్లు, యాదృచ్ఛిక ఖర్చుల కింద రూ.33.17కోట్లు మంజూరు చేసి, ముందస్తుగా రూ.100కోట్ల విడుదలకు ఆమోదం తెలిపింది. ఈమేరకు బుధవారం ఉత్తర్వులిచ్చింది. హెచ్‌డీఆర్ రకం పొగాకుకు కిలో రూ.120, హెచ్‌డీఎం రకం రూ.90, హెచ్‌డీఎక్స్ రకం రూ.60గా ధర నిర్ణయించింది. హెచ్‌డీ బర్లీ పొగాకు సేకరణకు మార్గదర్శకాలు జారీ చేసింది.



సింహ'గిరి ప్రదక్షిణ'కు పోటెత్తిన భక్తులు

సింహాచలం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తుల హరినామ స్మరణ నడుమ బుధవారం సింహ'గిరి ప్రదక్షిణ' ప్రారంభమైంది. ఆషాఢమాస శుక్ల పక్ష చతుర్దశినాడు సింహగిరి చుట్టూ సుమారు 32 కిలోమీటర్ల మేర భక్తులు ప్రదక్షిణ చేయడం అనాదిగా వస్తోంది. ఏటా మాదిరిగానే బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు కొండ దిగువన తొలి పావంచా వద్ద స్వామివారి పుష్పతేరు(ప్రచార రథం)కు ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు జెండా ఊపి సింహగిరి ప్రదక్షిణను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు మతుకుమిల్లి శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పీజీవీఆర్ నాయుడు (గణబాబు) పాల్గొన్నారు. ఉత్సవ ఏర్పాట్లను ఈవో నిరంతరం సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు.

బియ్యం ఎగుమతులకు సహకారం

▸▸ అక్రమ రవాణా చేస్తే ఉక్కుపాదం: మంత్రి నాదెండ్ల

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి ఇతర దేశాలకు చేసే బియ్యం ఎగుమతులకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ సులువుగా ఎగుమతులు చేసుకోవచ్చని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా ఇచ్చారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే మాత్రం ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని హెచ్చరించారు. ఈ మేరకు కాకినాడ, విశాఖపట్నం, నెల్లూరు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులతో మంత్రి నాదెండ్ల బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. రాష్ట్రం నుంచి బయటికి వెళ్లే బియ్యంలో పీడీఎస్ బియ్యం ఉండే ప్రసక్తే లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్రమాలకు పాల్పడేవారిపై 6ఎ కేసులతోపాటు పీడీ యాక్ట్, బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని సూచించారు. విశాఖపట్నం, కాకినాడ, నెల్లూరు పోర్టులలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి 24/7 సిబ్బందితో నిరంతరం తనిఖీలు కొనసాగించాలని ఆదేశించారు.

ధాన్యం బకాయిలు రూ. 672 కోట్లు విడుదల: అచ్చెన్న, మనోహర్

రాష్ట్రంలో రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిల సొమ్ము చెల్లించేందుకు రూ. 672 కోట్లు విడుదల చేసేందుకు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపిందని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ నిధులు విడుదలైన 24 గంటల్లోనే దాదాపు 30,988 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నవంబరులో సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్

▸▸ విశాఖలో సన్నాహక ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): వచ్చే నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) 30వ భాగస్వామ్య శిఖరాగ్ర సమావేశం (పార్టనర్‌షిప్ సమ్మిట్) జరగనున్నదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన సన్నాహక ఏర్పాట్లపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, సీఐఐ ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రులు, పలు శాఖ ఉన్నతాధికారులు సహా, భారత పరిశ్రమల సమాఖ్య, తదితర సంస్థలకు చెందిన అధిక సంఖ్యలో ప్రతినిధులు పాల్గొనేందుకు సన్నాహాలు ప్రారంభించి, పటిష్ఠ ఏర్పాట్లు చేయాలన్నారు. పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ ఈ నెల 16న జరిగే రెండో సమావేశం నాటికి సమ్మిట్ లోగా, వివిధ ప్రచార సామగ్రి సిద్ధం చేయనున్నట్లు చెప్పారు.

కరువు రహిత రాష్ట్రమే చంద్రబాబు లక్ష్యం

పట్టిసీమకు 1,300 కోట్లు ఖర్చు పెట్టి 50 వేల కోట్లు ఆదాయం సంపాదించాం: మంత్రి నిమ్మల

▸▸ పవిత్ర సంగమం వద్ద జలహారతి ఇచ్చిన నేతలు



పవిత్ర సంగమం వద్ద గోదావరి - కృష్ణా జలాలకు జలహారతి ఇస్తున్న మంత్రి నిమ్మల, ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్

ఇబ్రహీంపట్నం, జూలై 9(ఆంధ్రజ్యోతి): 'ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలి. రిజర్వాయర్లలో నిల్వ చేసుకోవాలి. వర్షాలు లేని సమయంలో వాటిని వాడుకోవాలి. కరువు రహిత రాష్ట్రంగా ఏపీనీ తీర్చిదిద్దాలి. అదే సీఎం చంద్రబాబు లక్ష్యం. దేశంలోనే తొలి సారిగా రాష్ట్రంలో గోదావరి - కృష్ణా నదులను అనుసంధానం చేసిన అపర భగీరథుడు ఆయన' అని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పవిత్రసంగమం వద్ద పట్టిసీమ ద్వారా పోలవరం కాలువలో వచ్చి కృష్ణా నదిలో కలిసిన గోదావరి జలాలకు ఆయన జలహారతులిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడారు. 'జాతి సంపదైన శ్రీశైలాన్ని కాపాడుకోవాలి. పట్టిసీమ ద్వారా గోదావరిలో కలిసే వరద జలాలను కృష్ణాలో కలిపి డెల్టాలోని 13 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చాం. వైసీపీ ప్రభుత్వ హయాంలో గత ఏడాది జూలైలో అర టీఎంసీ సాగునీరు నిల్వ ఉంటే ఈ ఏడాది అదే జూలైలో 20 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వాటర్ మేనేజ్‌మెంట్‌లో గత ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించాలి. వైసీపీ హయాంలో పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయాయి. అన్నమయ్య ప్రాజెక్టు తుడిచి పెట్టుకుపోయింది. 20 గ్రామాలను వరద ముంచెత్తింది. 42 మంది మరణానికి కారణమైంది. పట్టిసీమతో పాటు రాష్ట్రంలోని 1,040 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో సగం మూతపడేలా చేసి 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందకుండా చేసింది. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టులకు కనీసం గ్రీజు కూడ పెట్టలేదు. ఐదేళ్లలో వైసీపీ రూ.100 కోట్లు సాగునీటి ప్రాజెక్టులపై ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వం ఈ ఏడాది రూ.700 కోట్ల నిధులు మంజూరు చేసింది. శ్రీశైలం, ధవళేశ్వరం, ప్రకాశం బ్యారేజ్, ఇతర సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులకు, గేట్ల మార్పిడికి టెండర్లు పిలుస్తోంది. పట్టిసీమ నుంచి 2014-19 మధ్య 263 టీఎంసీల సాగునీరు కృష్ణాలో కలిపాం. శ్రీశైలం పూర్తి నిల్వ సామర్థ్యం కంటే ఎక్కువ. తద్వారా శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను రాయలసీమకు మళ్లించుకోగలిగాం. శ్రీశైలంలో 90 నుంచి 95 శాతం నీటిని నిల్వ చేసుకోగలిగామంటే అది పట్టిసీమ ద్వారానే సాధ్యమైంది. ఇప్పటి వరకు పట్టిసీమ ద్వారా 428 టీఎంసీలకు పైగా కృష్ణా డెల్టాకు తరలించాం. ఇది నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం కంటే ఎక్కువ. పట్టిసీమకు రూ.1,300 కోట్లు ఖర్చు చేసి రూ.50 వేల కోట్ల ఆదాయాన్ని సంపాదించుకోగలిగాం' అని మంత్రి వివరించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చనిపోతూ.. పలువురి జీవితాల్లో వెలుగులు

▸▸ బ్రెయిన్ డెడ్‌కు గురైన మహిళ అవయవదానం

▸▸ 63 ఏళ్ల వృద్ధురాలికి ఎయిమ్స్ వైద్యుల నివాళి



శేషారత్నం



శేషారత్నం భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎయిమ్స్ ప్రతినిధులు, వైద్యాధికారులు

మంగళగిరి సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన 63 ఏళ్ల వృద్ధురాలు.. అవయవదానం చేసి పలువురు జీవితాల్లో వెలుగులు నింపింది. మంగళగిరి ఎయిమ్స్ వైద్యవర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన మండెపూడి శేషారత్నం ఈ నెల 1న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో కుటుంబ సభ్యులు ఎయిమ్స్‌లో చేర్పించారు.మంగళవారం బ్రెయిన్ స్టెమ్ డెడ్‌కు గురైనట్లు వైద్యులు ప్రకటించారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో జీవన్‌దాన్ సంస్థ సమన్వయంతో అవయవ పునరుద్ధరణ ప్రక్రియను ప్రారంభించారు. ఒక కిడ్నీని ఎయిమ్స్ ఆస్పత్రిలోనే వేరొకరికి కేటాయించగా.. మరో కిడ్నీని చినఅవుట్‌పల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు, కాలేయాన్ని తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్‌కు, కళ్లను విజయవాడలోని ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు తరలించారు. అవయవదానానికి అంగీకరించిన శేషారత్నం కుటుంబ సభ్యులకు ఎయిమ్స్ ప్రతినిధులు, వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఎయిమ్స్ ప్రతినిధులు, సిబ్బందితోపాటు ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఎరుగుల అన్నపూర్ణ, తహసీల్దారు కే.దినేష్, ఆర్ఐ కే.గోపి తదితరులు బుధవారం ఉదయం శేషారత్నం భౌతికకాయానికి నివాళులర్పించి అంతిమ వీడ్కోలు పలికారు.

సమాచారం ఇవ్వకపోవడం వల్లే స్పందించలేదు

▸▸ పురుషోత్తపట్నం ఘటనపై కేసు నమోదు: చింతూరు ఏఎస్పీ



ఎటపాక, జూలై 9(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలోని భద్రాద్రి దేవస్థానం భూముల్లో మంగళవారం దేవస్థానం అధికారులు, స్థానికులు, ఇంటి నిర్మాణదారుల మధ్య జరిగిన వివాదంపై ముందస్తు సమాచారం ఇవ్వనందుకే సకాలంలో పోలీసులు స్పందించలేకపోయారని చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా తెలిపారు. ఆయన బుధవారం ఎటపాక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. అంతర్రాష్ట్ర సమస్యతోపాటు దేవస్థానం భూముల అంశంపై గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును పురుషోత్తపట్నం గ్రామస్థులు పాటించాలని సూచించారు. దాడి ఘటనపై దేవస్థానం అధికారుల ఫిర్యాదు మేరకు పురుషోత్తపట్నం స్థానికులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దేవస్థానం అధికారులు భవిష్యత్‌లో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఏపీ పరిధిలో ఎటువంటి చర్యలు చేపట్టినా తమకు ముందస్తు సమాచారమిస్తే బందోబస్తు కల్పిస్తామని ఏఎస్పీ తెలిపారు. కాగా, దేవస్థానం అధికారులు తమ ఇంటిని కూల్చేందుకు యత్నించి, దౌర్జన్యం చేశారని పురుషోత్తపట్నం రైతులు ఆరోపించారు. దేవస్థానం ఈవోనే తమపై దాడిచేసి స్పృహ కోల్పోయారని, ఆమెపై ఎవరూ దాడి చేయలేదని తెలిపారు.

సేవా భావంతో సమాజాన్ని నడిపించాలి

▸▸ రెడ్‌క్రాస్ వార్షిక సమావేశంలో గవర్నర్ నజీర్



రెడ్‌క్రాస్ వార్షిక సమావేశంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, తదితరులు

విజయవాడ సిటీ, జులై 7(ఆంధ్రజ్యోతి): సేవా భావంతో సమాజాన్ని ముందుకు నడిపించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపు నిచ్చారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ శాఖ వార్షిక సమావేశం బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. శాఖ అధ్యక్షుడు, గవర్నర్ నజీర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ రాష్ట్రంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని కొనియాడారు. విజయవాడ వరద బాధితులకు ఎనలేని సేవ చేసిందని అభినందించారు. అనంతరం రెడ్ క్రాస్ సభ్యతాలను అత్యధికంగా చేయించిన ఏపీ జెన్‌కో ఎండీ గిరీషా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌లను అభినందిస్తూ, వారికి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ వై.డి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో 2500 ఎకరాల్లో అంతర్జాతీయ క్రీడా మైదానం

▸▸ క్రీడల మంత్రి రాంప్రసాదరెడ్డి

సత్తెనపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో 2500 ఎకరాల్లో అంతర్జాతీయ క్రీడా మైదానం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి ఎం.రాంప్రసాదరెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో బుధవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో కలిసి ఇండోర్ స్టేడియాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విజయవాడ, వైజాగ్, తిరుపతిలో స్పోర్ట్స్ అకాడమీల ఏర్పాటు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఉద్యోగాల్లో రెండు శాతం ఉన్న రిజర్వేషన్‌ను మూడు శాతానికి పెంచడంతో డీఎస్సీలో క్రీడాకారులకు 450 పోస్టులు లభించనున్నాయని తెలిపారు.

కార్పొరేట్‌ను తలదన్నేలా..

▸▸ కాకినాడ జిల్లాలో ఆకట్టుకుంటున్న ప్రభుత్వ పాఠశాల

▸▸ అత్యాధునిక సైన్స్ ల్యాబ్ ప్రత్యేకం

▸▸ ఆంగ్ల భాషలో విద్యార్థుల ప్రావీణ్యం

▸▸ ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబోధన

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)



పి.దొంతమూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల



పాఠశాలలో అత్యాధునికంగా తీర్చిదిద్దిన సైన్స్‌ల్యాబ్





ఆ పాఠశాల ఆవరణలోకి అడుగుపెట్టగానే కార్పొరేట్ స్కూలు కన్నా మిన్నగా కనిపిస్తుంది. విద్యార్థులందరూ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర కిట్లు ద్వారా అందించిన యూనిఫామ్, షూ ధరించే ఉంటారు. బ్యాగు, మెడలో ఐడెంటిటీ కార్డుతో స్కూలుకు వస్తారు. ఆంగ్ల భాషలో ప్రావీణ్యం చూపిస్తున్నారు. అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దిన సైన్స్ ల్యాబ్, లైబ్రరీ ఈ పాఠశాల ప్రత్యేకం. ఆహ్లాదకర వాతావరణంతో ఆకట్టుకుంటున్న ఆ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.దొంతమూరులో ఉంది. పూర్తిగా ఇంగ్లిషు మీడియంలో విద్యా బోధన సాగే ఈ పాఠశాలలో 286 మంది విద్యార్థులు, 14 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రభుత్వం అందించిన ప్రతి సౌకర్యాన్నీ ఇక్కడ ప్రధానోపాధ్యాయుడు వీవీ రెడ్డి సారథ్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రభుత్వం సైన్స్ ల్యాబ్‌కు అవసరమైన పరికరాలను అందించింది. ల్యాబ్‌కు ప్రత్యేకంగా ఒక గది కేటాయించి అత్యాధునికంగా తీర్చిదిద్దారు. పవన్‌కల్యాణ్ అందించిన స్పోర్ట్స్ కిట్లతో క్రీడల్లోనూ విద్యార్థులు రాణిస్తున్నారు. గతం కంటే పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగింది.

నేటితో ముగియనున్న రొట్టెల పండుగ

▸▸ ఘనంగా తహలీఫాతేహా



స్వర్ణాల చెరువులో రొట్టెలు మార్చుకుంటున్న హిందూ, ముస్లిం మహిళలు

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండుగ గురువారం ముగియనుంది. బుధవారం ఒక్కరోజే 2 లక్షల మందికిపైగా వచ్చి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. బారాషహీద్ దర్గా కమిటీ ఆధ్వర్యం లో తహలీఫాతేహాను దర్గాలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

డిప్యుటేషన్లు నిలుపుదల చేయాలి

▸▸ మంత్రి నారాయణకు మునిసిపల్ కమిషనర్ల అసోసియేషన్ విజ్ఞప్తి

విజయవాడ (వన్‌టౌన్), జూలై 9 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిపాలన, అర్బన్ డెవలప్‌మెంట్ మునిసిపల్ కమిషనర్లుగా ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్లను నిలుపుదల చేయాలని రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణను మునిసిపల్ కమిషనర్ల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. బుధవారం వారు మంత్రికి వినతి పత్రం సమర్పించారు.

కార్పొరేట్ దొంగలు మోదీకి దత్తపుత్రులే: సీపీఐ నారాయణ

తిరుపతి(ఆటోనగర్), జూలై 9 (ఆంధ్రజ్యోతి): దేశ సంపదను కొల్లగొట్టిన 29 మంది కార్పొరేట్ దొంగల్లో 28 మంది గుజరాత్ వచ్చిన వారేనని, వారంతా మోదీకి దత్తపుత్రులేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. దేశవ్యాప్తంగా బుధవారం జరిగిన సార్వత్రిక సమ్మెకు మద్దతుగా తిరుపతిలో జరిగిన ర్యాలీలో నారాయణ పాల్గొన్నారు. మోదీ, అమిత్‌షా దేశంలో వందేళ్ల క్రితం సాధించుకున్న కార్మిక చట్టాలకు సవరణలు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి.. కార్మికులను బానిసలుగా చేసిన దేశద్రోహులన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధోన్మాదుల 'శాంతి'!

అనేక యుద్ధముల నారియు తేరిన అమెరికా అధ్యక్షుడే నోబెల్ శాంతిని ఆశిస్తుంటే, తామూ అర్హులమేననీ, తమకూ ఓ నోబెల్ దక్కితే బాగుండునని మిగతావారికీ అనిపించడం సహజం. తాను అధికారంలోకి వచ్చిన మరుక్షణంనుంచే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, అది నియమించిన లెఫ్టినెంట్ గవర్నర్ తనను రాచిరంపానబెట్టడం ఆరంభించారని, అన్ని ఒత్తిళ్ళనూ ఎదుర్కొని ఢిల్లీని అద్భుతంగా తీర్చిదిద్ది నందుకు తనకు పరిపాలనలో నోబెల్ దక్కాల్సిందేనంటున్నారు ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్. 'మీకంటే ఈ అవార్డుకు అర్హులెవరు?' అంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూ సోమవారం అమెరికా అధ్యక్షుడిని కీర్తించిన దృశ్యం కేజ్రీవాల్ మీద బాగా ప్రభావం చూపినట్టుంది. తన ఎదురీతలూ అర్హతల గురించి కేజ్రీవాల్ చెప్పుకున్న విషయాలను అటుంచితే, శ్వేతసౌధంలో భోజనవేళ బల్లకు ఆవల ఉన్న అమెరికా అధ్యక్షుడికి నోబెల్ శాంతి నామినేషన్ పత్రాన్ని అందిస్తూ నెతన్యాహూ గద్గదస్వరంతో ఇచ్చిన ఆ సందేశం, ఆశ్చర్యం, ప్రేమ ఒలుకుతున్న మొఖంతో ట్రంప్ ఆ పత్రాన్ని స్వీకరించడం ప్రపంచం అంతసులభంగా మరిచిపోలేని ఓ అద్భుత దృశ్యం.

తన ఎదురుగా కూర్చున్న ఆ శాంతిదూత ఈ ప్రపంచానికీ, మానవాళికీ చేసినదేమిటో చక్కగా వివరించారు నెతన్యాహూ. ఈయన ఒక దేశం తరువాత ఒకదేశం, మరోదేశం, ఇంకో దేశంలో వరుసపెట్టి శాంతిస్థాపనలు చేసుకుంటూపోతున్నారు... అధ్యక్షా, ఇదిగో నేను మీ పేరు ప్రతిపాదిస్తూ నోబెల్ ప్రైజ్ కమిటీకి పంపిన లేఖ. మీరు ఇందుకు సంపూర్ణంగా అర్హులు, అది మీకే చెందాలి అంటూ నెతన్యాహూ ఆ లేఖను ట్రంప్‌కు అందించారు. కొద్దివారాల కిందటే ఇరాన్‌మీదకు బీటూ స్టెల్త్ బాంబర్లతో సహా వందలాది యుద్ధవిమానాలను పంపిన అమెరికా అధ్యక్షుడు ఈ ప్రేమకు కరిగిపోయారు. మదర్ తెరీసా, నెల్సన్ మండేలా వంటివారు అందుకున్న అవార్డుకు తనను ఇజ్రాయెల్ పాలకుడు ప్రతిపాదించినందుకు కదిలిపోయారు. 'నీనుంచి ఈ ప్రతిపాదన రావడం ఎంతో అర్థవంతంగా ఉంది' అని నెతన్యాహూను ఉద్దేశించి ఆయన ఏ అర్థంలో అన్నారో తెలియదు కానీ, విశ్లేషకులు మాత్రం నానార్థాలూ తీస్తున్నారు. గాజాలో పాలస్తీనియన్లను ఊచకోతకోస్తున్న ఓ పాలకుడు, ఆ మారణకాండకు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ సమస్తవిధాలా సాయపడుతున్న మరో యుద్ధపిపాసిని శాంతిదూతగా ప్రతిపాదించడం అందరికీ వింతగానే ఉంది మరి. కానీ, ఇజ్రాయెల్ తన లక్ష్యాన్ని పరిపూర్తి చేయడం కోసం తన వద్ద ఉన్న సమస్త ఆయుధాలనూ అందిస్తానని మార్చిలోనే ప్రకటించి, అమెరికా పక్షాన ఇరాన్‌లోకి ఇజ్రాయెల్ చొరబడేట్టు చేసి, ఇజ్రాయెల్ పూర్తిచేయలేని ఆ ఆఖరుపనిని సైతం తానే స్వయంగా పూనుకొని చేసిన ట్రంప్ కంటే శాంతికి అర్హులెవ్వరని నెతన్యాహూకు అనిపించింది. ఆయుధాలనే కాదు, ఆకలిని కూడా అస్త్రంగా ప్రయోగించి, గాజానుంచి ఆఖరు మనిషిని కూడా తరిమికొట్టి, పూర్తిగా ఖాళీచేయించి, దానిని మధ్య ఆసియాలో మహాద్భుతమైన రిసార్టుగా మార్చాలన్న తన కలని నెరవేర్చబోతున్న నెతన్యాహూ కంటే అర్హులెవరుంటారని ట్రంప్‌కూ అనిపించింది.

ఇరాన్‌తో బరాక్‌ఒబామా కుదర్చుకున్న ఒక అంతర్జాతీయస్థాయి ఒప్పందం చక్కగా అమలవుతూ యావత్ ప్రపంచం ప్రశాంతంగా ఉన్న తరుణంలో, దానినుంచి తనదేశాన్ని తప్పించినవాడు ట్రంప్. మలివిడత రాకడలో మళ్ళీ తానే ఒప్పందం కోసం ఇరాన్‌మీద ఒత్తిడితెచ్చి, అనేక హెచ్చరికలూ బెదిరింపుల మధ్య చర్చలకు రప్పించి, అవి సజావుగా సాగుతున్న తరుణంలో వాటిని భగ్నం చేసిందీ ఆయనే. ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు లేవని అమెరికా నిఘాసంస్థలే చెప్పినా ఇరాన్‌లోకి ఇజ్రాయెల్‌ను చొరబడేట్టు చేసి, అనంతరం తానే స్వయంగా బాంబులు కురిపించి ఇజ్రాయెల్ ప్రధాని దీర్ఘకాలిక ఆశయాన్నీ, ఉమ్మడి లక్ష్యాన్నీ ఎట్టకేలకు నెరవేర్చాడు. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ఇవ్వనంత మద్దతు నెతన్యాహూకు ట్రంప్ ఇచ్చాడు. ఇరాన్ అణుస్థావరాలు ముట్టుకోవద్దన్న గతకాలపు హద్దుల్ని కూడా ట్రంప్ చెరిపివేసి, కొన్ని ఆయుధాల సరఫరాల మీద ఉన్న ఆంక్షలను కూడా ఎత్తివేశాడాయన. తద్వారా పలు ఏకకాల యుద్ధాలతో తన రాజకీయమనుగడ కొనసాగించాలన్న నెతన్యాహూ రాజకీయ ఎజెండాకు కూడా ట్రంప్ సహకరించారు. హద్దుల్లేని ఈ అభిమానానికి నెతన్యాహూ ఆనందం అవధులు దాటివుంటుంది. అంతర్జాతీయ న్యాయస్థానం అరెస్టువారెంట్ జారీచేసిన ఒక వ్యక్తి చేతులమీదుగా అమెరికా అధ్యక్షుడు నోబెల్‌శాంతి ప్రతిపాదనను అందుకోవడం చూడముచ్చటగా ఉంది.

యుద్ధాలయుగం వైపు..!

ఇప్పుడు ప్రపంచయుద్ధం స్థాయి పెరిగిపోయినట్లున్నది. యూరోపియన్ దేశాలు, అమెరికా కలిసి.. ఉక్రెయిన్ వెనకుండి రష్యాతో యుద్ధం చేస్తున్నా దాన్ని ప్రపంచ యుద్ధంగా ఎవరూ గుర్తించడం లేదు. ఈ లెక్కన ప్రపంచంలోని ముఖ్యమైన దేశాలన్నీ గ్రూపులుగా ఏర్పడి యుద్ధం చేస్తేనే అది ప్రపంచయుద్ధం అయ్యేలా ఉంది! స్వీడన్‌కు చెందిన 'స్టాక్ హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్' (సిప్రి) గత జూన్ 16న తన వార్షిక నివేదికలో అణ్వాయుధాలు, యుద్ధాలకు సంబంధించి పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. 1990 దశాబ్దంలో కోల్డ్‌వార్ ముగిసిన తరువాత కనీసం 21వ శతాబ్దంలోనైనా ప్రపంచమంతటా శాంతి నెలకొంటుందని అందరూ సంతోషపడ్డారు. కానీ ఇటీవలి పరిణామాలు చూస్తే అలా అనిపించడం లేదు. గత కొన్నేళ్లుగా ప్రపంచంలోని ప్రముఖ దేశాలన్నీ తమ శక్తిమంతమైన అణ్వాయుధ సంపత్తిని పెంచుకుంటూ వస్తుండడాన్ని కూడా మనం గమనించాలి.

రష్యా, అమెరికా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్, భారత్, పాకిస్థాన్, ఇజ్రాయిల్, ఉత్తర కొరియా వంటి దేశాలు 2024 నుంచి తమ అణ్వాయుధాలను పెంచుకుంటూ, ఆధునీకరించుకుంటూ వస్తున్నాయి. ప్రపంచంలోని అభద్రతా భావ పరిస్థితులు 2022లో ఉక్రెయిన్, రష్యా యుద్ధంతో బహిరంగమయ్యాయి. ఈ అభద్రతా పరిస్థితి కారణంగానే అన్ని దేశాలు తమ అణ్వాయుధాలను పెంచుకోవడం, ఆధునీకరించుకోవడం చేస్తున్నాయి. గతంలో అమెరికా, రష్యాల మధ్య జరిగిన అనేక అణ్వాయుధాల ఒప్పందాలు అటకెక్కాయి. ఇదంతా సిప్రి తన నివేదికలో పేర్కొంది.



'అణ్వాయుధాల నిర్మాణం కోసం మొదలైన ఈ కొత్త పోటీ, కోల్డ్‌వార్ కాలం నాటి పరిస్థితి కంటే చాలా ప్రమాదకరంగా ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అణ్వాయుధాలు అనుసంధానిస్తే మరింత ప్రమాదకరంగా మారుతుంది' అని సిప్రి డైరెక్టర్ స్మిత్ తమ ఇయర్ బుక్ ముందుమాటలో గట్టి హెచ్చరిక చేశాడు.

సిప్రి నివేదిక ప్రకారం చైనా వద్ద 600 అణ్వాయుధాలున్నాయి. ఆ దేశపు అణ్వాయుధాల సంఖ్య ప్రపంచంలోని మిగతా దేశాల కంటే వేగంగా పెరుగుతున్నది. భారతదేశం కూడా తన అణ్వాయుధాల సంఖ్యను ఒక మేరకు పెంచుకున్నది. ఇజ్రాయెల్ తన అణ్వాయుధ శక్తిపై మౌనం పాటిస్తోంది. కానీ ఆ దేశం కూడా తన అణ్వాయుధాలను ఆధునీకరిస్తున్న విషయం తెలియనిది కాదు. ఎగేవ్ ఎడారిలో ఉన్న ప్లుటోనియం ఉత్పత్తి కేంద్రాన్ని ఇజ్రాయెల్ మరింత అభివృద్ధి చేస్తోంది. అయితే మొత్తం అణ్వాయుధాల్లో 90 శాతం అమెరికా, రష్యా వద్దే ఉన్నాయి.

ప్రస్తుతమున్న 12,241 అణ్వాయుధాల్లో 9,600 అణ్వాయుధాలు సైనిక అవసరాల కోసం సిద్ధంగా ఉన్నాయి. వీటిలో 3,900 అణ్వాయుధాలు మిస్సైల్స్, యుద్ధ విమానాలతో సిద్ధంగా ఉన్నాయి. ఇందులోనే 2001 అణ్వాయుధాలు హై అలర్ట్ స్థితిలో ఉన్నాయి. అంటే ప్రపంచం ఎంత అభద్రతలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

సిప్రి డైరెక్టర్ స్మిత్ తమ ఇయర్ బుక్ ముందుమాటలో ఒక హెచ్చరిక చేశాడు. 'అణ్వాయుధాల నిర్మాణం కోసం మొదలైన ఈ కొత్త పోటీ, కోల్డ్‌వార్ కాలం నాటి పరిస్థితి కంటే చాలా ప్రమాదకరంగా ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అణ్వాయుధాలు అనుసంధానిస్తే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుంది' అని తెలిపాడు.

ప్రపంచ మార్కెట్ లాభాలను కొత్తగా అభివృద్ధి చెందుతున్న దేశాలు సొంతం చేసుకుంటున్నాయి. దీంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఇప్పటి వరకు క్రమబద్ధంగా నడుపుతున్న సంస్థలను, ఒప్పందాలను, చట్టాలను పక్కకు నెట్టి... సైనికబలం ద్వారా తమకు అనుకూలమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ క్రమాన్ని నెలకొల్పాలని పాత ధనిక దేశాలు అనుకుంటున్నాయి. ఇందులో భాగంగానే ఆధునిక ఆయుధాలు, అణ్వాయుధాల పోటీ పెరుగుతున్నది. జూన్ 24, 25 తేదీల్లో నెదర్లాండ్‌లోని 'ది హేగ్'లో జరిగిన నాటో దేశాల మంత్రులు, అధినేతల సమావేశం కూడా సిప్రి నివేదికను బలపరుస్తున్నది.

2035 వరకు నాటో దేశాలన్నీ, తమ దేశాల జీడీపీలో 5 శాతం వరకు ధనాన్ని నాటో బడ్జెట్‌కు కేటాయించాలని 'ది హేగ్' సమావేశంలో నిర్ణయించాయి. దీనికి స్పెయిన్, బెల్జియం, స్లోవేకియాలు అభ్యంతరం తెలిపాయి. అయితే 32 సభ్య దేశాలు ఉన్న నాటోలో ఒకటి రెండు దేశాలు ఈ ప్రతిపాదనను అంగీకరించనంత మాత్రాన నాటో బడ్జెట్ పెరుగుదలలో పెద్ద తేడా ఏమీ రాదు. నాటో బడ్జెట్ పెరగడం అంటే ఆయుధాల పోటీ, ఉద్రిక్తతలు, యుద్ధ అవకాశాలు పెరగడమే.

యూరప్‌కు రష్యానే పెద్ద ప్రమాదమనీ, భవిష్యత్తులో యూరప్‌లోని దేశాలపై రష్యా దాడి చేసే అవకాశం ఉందని, అందుకే నాటో బడ్జెట్ పెంచుతున్నట్లు ఈ సమావేశంలో నేతలు వెల్లడించారు. యూరప్, అమెరికా దేశాలు రష్యాతో యుద్ధం చేసినా చేయకపోయినా తమ ఆధునిక ఆయుధ బలంతో ప్రపంచంపై పెత్తనం చేస్తూ, సరుకులుగా పాత ఆయుధాలు అమ్ముకోవచ్చు.

కారణాలు ఏవైనా అన్ని దేశాలు తమ ఆధునిక ఆయుధాలు, అణ్వాయుధాలను పెంచుకుంటున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ డిజిటల్ రంగాలు, అంతరిక్షం అన్ని యుద్ధానికి వేదికలుగా సిద్ధమవుతున్నాయి. ఫలితాలు ఎలా ఉంటాయో ఇప్పుడే చెప్పడం కష్టం. కానీ ప్రపంచ నాటక రంగంలో శాంతి అధ్యాయానికి తెరపడబోతున్నట్లే కనిపిస్తోంది. ప్రపంచం యుద్ధాల యుగంలోకి, కల్లోల కాలంలోకి అడుగు పెడుతున్నది.

• లంకా పాపిరెడ్డి

భారత పౌరుల ఓటుహక్కుపై దాడి



భారత గణతంత్ర రాజ్యంలో పుట్టిన, పుట్టబోయే ప్రతి భారత పౌరుడికి ఒక విలువైన ఆస్తి ఉన్నది. ఓటు హక్కే ఆ అమూల్య ఆస్తి. భారత పౌరుల సామూహిక ఓటు హక్కుల తొలగింపునకు మన పాలకులు ఇప్పుడొక సాహసోపేతమైన ప్రయత్నం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – సర్)ను చేపట్టనున్నట్టు భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ బృహత్ కార్యానికి తొలుత బిహార్‌లో శ్రీకారం చుట్టారు. ఆ తరువాత త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలోను, ఆపై విశాల భారతదేశమంతటా ఆ ప్రత్యేక సమగ్ర సవరణను చేపట్టి పూర్తి చేస్తారు. ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కచ్చితంగా భారత పౌరుల సామూహిక ఓటుహక్కుల తొలగింపే, సందేహం లేదు.

నోట్ బంది (పెద్ద నోట్ల రద్దు– డీమోనిటైజేషన్), దేశ్ బంది (కోవిడ్ ఆపత్కాలంలో లాక్‌డౌన్) గుర్తున్నాయా? ఇప్పుడు ఓటుబంది (సామూహిక ఓటు హక్కుల తొలగింపు)కే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు పూనుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఉద్దేశం ఏమో గానీ ఈ ప్రక్రియ ప్రాథమికంగా లోపభూయిష్టమైనది, చాలా హానికరమైనది, నైతికంగా ఎంత మాత్రం సమర్థించలేనిది. 'సర్' పర్యవసానాలు భయానకంగా కనిపిస్తున్నాయా? ఆ ప్రతిపాదన వాస్తవికంగా లేదు. భయాందోళనలకు దారి తీసేదిగా ఉన్నది. దానిని నిశితంగా పరిశీలిద్దాం.

ప్రస్తుతమున్న ఓటర్ల జాబితాను పునఃపరిశీలించడం ద్వారా ప్రత్యేక సమగ్ర సవరణ ఎనాడో జరిగి ఉండవలసిన ప్రక్రియ అనే భావన చాలా మందిలో ఉన్నది. దీనిని పక్కన పెడదాం. బిహార్‌లో అటువంటి ప్రక్రియ ఆరు నెలల క్రితమే జరిగింది. లక్షలాది కొత్త ఓటర్ల పేర్లను చేర్చారు. దాదాపుగా అంతే సంఖ్యలో పాత ఓటర్ల పేర్లను తొలగించారు. చెప్పుకోదగ్గ ఫిర్యాదులు ఏవీ రాలేదు. అయితే ఎన్నికల సంఘం ఇప్పుడు ఆదేశించిన ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తిగా కొత్త ప్రక్రియ. సరికొత్తగా ఆరంభించి పూర్తి చేసేది. ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందిస్తారు. గతంలో ఎన్నడూ జరగనిది. సమగ్ర సవరణ పేరిట గతంలో ఓటర్ల జాబితా సవరణ జరిగేది. ఓటర్ల జాబితా కంప్యూటరీకరణతో 2003 తరువాత అటువంటి సవరణ ప్రక్రియను కొనసాగించలేదు. ఇప్పుడు ఎన్నికల సంఘం పూర్తిగా ఒక కొత్త ప్రక్రియను ప్రారంభించింది. ఈ కొత్త ప్రక్రియతో ఓటర్ల జాబితాలో తన పేరు ఉండేలా చూసుకునే బాధ్యత పూర్తిగా పౌరుడిదే. రాజ్యవ్యవస్థకు ఎంత మాత్రం సంబంధముండదు. జూలై 25లోగా పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫామ్‌ను సమర్పించని వారి పేరు ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉండదు. అలా ఉండేలా చూసుకోవలసిన బాధ్యత పూర్తిగా పౌరుడిదే. మరింత ఘోరమైన విషయమేమిటంటే ఓటర్ల జాబితాలో ఉండేందుకు అర్హత పొందాలంటే ప్రతి వ్యక్తీ తన భారత పౌరసత్వాన్ని ధ్రువీకరించే ప్రామాణిక పత్రాలు విధిగా సమకూర్చాలి. ఇది నిజానికి అనధికారిక జాతీయ పౌర పట్టికే (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్) అవుతుంది.

ప్రత్యేక సమగ్ర సవరణ అసలు ఉద్దేశాలను ఎన్నికల సంఘం చాలా తెలివిగా కప్పిపుచ్చుతోంది. అవేమిటో శోధిద్దాం. ఓటర్ల జాబితాలో ఉండే అర్హత పొందేందుకు అవసరమైన డాక్యుమెంటరీ రుజువులు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. ఎన్నికల సంఘం ఉత్తర్వు స్పష్టంగా ఉన్నది: ప్రతి ఓటర్ ఎన్యూమరేషన్ ఫామ్‌ను ప్రస్తుత ఫోటో, సంతకాలు, కొన్ని మౌలిక వివరాలతో నింపి, పౌరసత్వ రుజువుతో సమర్పించాలి. 2003 నాటి ఓటర్ల జాబితాలో పేరు ఉన్నవారి (పేరు, నివాసం మారకుండా ఉంటే) కొత్త జాబితాలో స్థానం సంపాదించుకోవడం సులువవుతోంది. 2003 ఓటర్ల జాబితాలో తమ పేరు ఉన్న పేజీ కాపీని తమ ఎన్యూమరేషన్ ఫామ్‌తో జత చేసి ఇవ్వాలి. ఇది వారి పౌరసత్వానికి రుజువుగా పరిగణితమవుతుంది. 4.96 కోట్ల మందికి (ప్రస్తుతం ఓటర్ల జాబితాలో ఉన్న 63 శాతం మంది) ఈ దగ్గరి దోవను ఉపయోగించుకునేందుకు అర్హులు అని ఎన్నికల సంఘం పేర్కొంది. కాగా ఓటర్ల జాబితాలో ఉండేందుకు తమ అర్హతలను నిరూపించుకోవల్సినవారు 3 కోట్ల మంది కంటే తక్కువగా ఉంటారని పేర్కొంది. ఇదొక విచిత్ర వాదన అని, ఇందులో నిజం లేదని రాహుల్ శాస్త్రి నిర్ధారించారు (జూలై 1, 'డేటా పాయింట్', ది హిందూ). 2003 నుంచి మరణాల సంఖ్యను, వలసపోయిన వారి సంఖ్యను, నివాసం మారిన వారి సంఖ్యను ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకోలేదని, తత్కారణంగా కొత్త ఓటర్ల జాబితాలో ఉండేందుకు తమ అర్హతలను నిరూపించుకోవల్సిన వారి సంఖ్య యథార్థంగా 3.16 కోట్లు అని రాహుల్ శాస్త్రి నిరూపించారు.



▪ యోగేంద్ర యాదవ్

ప్రస్తుత ఓటర్ల జాబితాలోని 7.9 కోట్ల మందిలో 4.74 మంది పుట్టిన తేదీ, ఊరుకు సంబంధించిన రుజువులతో తమ పౌరసత్వాన్ని రుజువు చేసుకోవలసి ఉంటుంది. ఇటువంటి బాధ్యత ఉన్న వారిని మూడు తరగతులుగా వర్గీకరించవచ్చు. మొదటి తరగతివారు 38 సంవత్సరాలకు మించిన వయసు ఉన్నవారు (జూలై 1, 1987కు ముందు పుట్టిన వారు). వివిధ కారణాల వల్ల 2003 నాటి ఓటర్ల జాబితాలో పేరు లేని వీరు తమ పుట్టిన తేదీ, ఊరుకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. 20 నుంచి 38 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారు (జూలై 1, 1987, డిసెంబర్ 2, 2004 మధ్య పుట్టినవారు) రెండు రుజువులు చూపవలసి ఉన్నది. తాము పుట్టిన తేదీతో పాటు తల్లి లేదా తండ్రి పుట్టిన తేదీకి కూడా ధ్రువీకరణపత్రాలు ఇవ్వవలసి ఉంటుంది. ఇక 18 నుంచి 20 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారు (డిసెంబర్ 2, 2004 తరువాత పుట్టినవారు) మూడు రుజువులు సమర్పించవలసి ఉంటుంది. తమ సొంత పుట్టిన తేదీతో పాటు తల్లి, తండ్రి పుట్టిన తేదీల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. 2003 ఓటర్ల జాబితాలో తల్లిదండ్రుల పేర్లు వారి పుట్టిన తేదీలకు రుజువులుగా పరిగణన అవుతాయి. అయితే దరఖాస్తుదారు విధిగా తాను పుట్టిన తేదీ, ఊరుకు సంబంధించి ధ్రువీకరణపత్రాలు సమర్పించాలి.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర జాబితా సామూహిక ఓటు హక్కుల తొలగింపు ఎలా కాదో ఇప్పుడు మీరే నిర్ణయించాలి. పరోక్షంగానే అయినప్పటికీ, ఓటు హక్కుకు సంపద, విద్యార్హతల పరమైన వివక్షాపూరిత అవరోధాలు సృష్టించడమనేది అమెరికా దక్షిణాది రాష్ట్రాలలో ఆఫ్రికన్ అమెరికన్ల ఓటుహక్కును తొలగించడానికి అనుసరిస్తున్న పద్ధతి కాదూ? బిహార్‌లోను, విశాల భారతదేశంలోనూ విద్యార్హతల ఆధారంగా ఓటర్ల జాబితా నుంచి మినహాయించడమనే చర్యకు మహిళా ఓటర్లు, పేద, దళిత్–ఆదివాసీ, బహుజన్ సామాజిక వర్గాలకు చెందిన ఓటర్లు ఎక్కువగా నష్టపోతారు. అంతే కాదు ఈ సామాజిక సమూహాలలో కూడా కొన్ని వర్గాలు మరింతగా ఎక్కువగా నష్టపోవడం సంభవిస్తుంది. ఇది భారత రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా వ్యతిరేకమని మరి చెప్పనవసరం లేదు.

మరో ప్రశ్న కూడా తప్పక అడగవలసి ఉంది: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ఎన్నికల సంఘం ఈ హాస్యాస్పద కాలక్రమాన్ని హఠాత్తుగా ఎందుకు ప్రకటించింది? జూన్ 25– జూలై 25 మధ్య 30 రోజుల వ్యవధిలో బిహార్ ప్రభుత్వం లక్ష మంది పోలింగ్ బూత్ స్థాయి అధికారులను (వీరిలో ఇరవై వేల మందిని ఇంకా నియమించవలసి ఉన్నది) సంప్రదించవలసి వున్నది; ప్రత్యేక సమగ్ర సవరణ పద్ధతులలో వారికి శిక్షణ ఇవ్వవలసి ఉన్నది; సకల రాజకీయ పార్టీలకు చెందిన పోలింగ్ బూత్ స్థాయి ఏజెంట్లతో వీరు సంబంధాలు పెట్టుకుని, 'సవరణ'పై ఆ రాజకీయ కార్యకర్తలకు సమగ్ర అవగాహన కల్పించవలసి ఉన్నది; ప్రతి కుటుంబానికి ఎన్యూమరేషన్ ఫామ్స్ పంపిణీ చేసి, 2003 ఓటర్ల జాబితాను వారికి అందుబాటులో ఉంచి తోడ్పడవలసి ఉన్నది. అంతేనా? సంబంధిత వివరాలతో పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫామ్స్‌ను ప్రతి కుటుంబం నుంచి (అవసరమైతే మూడుసార్లు సందర్శించి అయినా) సేకరించి, వాటిని ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేయవలసి ఉన్నది. వివిధ ధ్రువీకరణ పత్రాలు సరిగా ఉన్నాయో లేదో నిర్ధారించి తమ సిఫారసులు చేయాలి. ఇవన్నీ ఒక నెల రోజుల్లోనే జరగాలి సుమా! (మరి ఆ నెలలో ఇప్పటికే ఒక వారం గడిచిపోయింది) ఇవన్నీ జరగాల్సిన రోజులు ఎటువంటివి? బిహార్‌లో ఇది వర్షాకాలం. వరదలు వెల్లువెత్తడం కద్దు. మరి ఇటువంటి సహజ ప్రతికూల పరిస్థితుల్లో ఇవన్నీ జరగడం సాధ్యమేనా? ఎన్నికల సంఘం వద్ద మంత్రదండం ఏదైనా ఉంటే మినహా ఈ 'సమగ్ర సవరణ' మహాకార్యం అసంభవం. కనుక ఈ 'సవరణ' ఆదేశాన్ని ఉపసంహరించుకునే అవకాశముందని మనం భావించవచ్చు లేదా జూన్ 30న ప్రకటించిన ఆవశ్యక డాక్యుమెంట్ల జాబితాలో పెద్ద మార్పులు చేసేందుకు ఆస్కారమున్నది. లేదా? అసలు బిహార్ అసెంబ్లీ ఎన్నికలను వాయిదా వేయవచ్చు.


అటువంటి పెనుమార్పులు అవసరమవుతాయా? అవుతాయని అనుకుందాం. మరయితే కొత్త ప్రధాన ఎన్నికల కమిషనర్ గత నెలలో పేర్కొన్న 21 కొత్త చర్యల జాబితాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎందుకు లేదు? అలాగే గత నెలలోనే వివిధ జాతీయ రాజకీయ పక్షాల అధినేతలతో నిర్వహించిన సమావేశంలో 'ప్రత్యేక సమగ్ర సవరణ' ప్రతిపాదనను ఎన్నికల సంఘం ఎందుకు చేయలేదు? ఆ సమావేశానికి ముందు దేశవ్యాప్తంగా జరిపిన 4000కు పైగా సంప్రదింపులలో కూడా దాని గురించి ఎందుకు ప్రస్తావించలేదు? కేవలం 25 రోజుల క్రితమే ఎన్నికల సంఘం ఆలోచనలు ఎందుకు మారిపోయాయి? అనుకోకుండా వచ్చిన ఫోన్‌కాల్ అందుకు కారణమా? లేక చాయ్ పే చర్చా? సర్ (ప్రత్యేక సమగ్ర సవరణ) వెనుక ఉన్న 'సర్' ఎవరు?

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తిగా కొత్త ప్రక్రియ. సమగ్ర సవరణ పేరిట గతంలో ఓటర్ల జాబితా సవరణ జరిగేది. ఓటర్ల జాబితా కంప్యూటరీకరణతో 2003 తరువాత ఆ ప్రక్రియను కొనసాగించలేదు. కొత్త ప్రక్రియతో ఓటర్ల జాబితాలో తన పేరు ఉండేలా చూసుకునే బాధ్యత పూర్తిగా పౌరుడిదే. రాజ్యవ్యవస్థకు ఎంత మాత్రం సంబంధముండదు. మరింత ఘోరమైన విషయమేమిటంటే ఓటర్ల జాబితాలో ఉండేందుకు అర్హత పొందాలంటే ప్రతి వ్యక్తీ తన భారత పౌరసత్వాన్ని ధ్రువీకరించే ప్రామాణిక పత్రాలు విధిగా సమకూర్చాలి.

పాదయాత్రలతోనే జనం మెచ్చరు

జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ పాదయాత్ర చేస్తానంటున్నారు. ఇది ఒక ప్రకటనలా లేదు. బెదిరింపులా ఉంది. ప్రజలు దారుణమైన సంఖ్యతో దించేసినా ఆయన ధోరణిలో మార్పులేదు. పాదయాత్రలతోనో, నెత్తిన చేతులూ, నుదుట ముద్దులూ పెట్టడంతోనో, అధికారంలోకి రాగలమన్నది భ్రమే. అది గతం. వర్తమానం అలా లేదు. రాహుల్‌గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా చేసిన పాదయాత్ర గానీ, పార్టీలను అధికారంలో కూర్చో పెట్టగలనని గొప్పగా చెప్పుకునే ప్రశాంత్ కిశోర్ బిహార్ పాదయాత్ర గానీ, షర్మిల తెలంగాణ పాదయాత్ర గానీ ఎటువంటి ఫలితాలు ఇచ్చాయి? పాదయాత్రలకు ప్రజలు లొంగరు అన్నది స్పష్టం. పాదయాత్ర చేసే నాయకుడి మీద ఏర్పడే నమ్మకమే ముఖ్యం. జగన్‌రెడ్డి ఆ నమ్మకాన్ని గెలుచుకునే ప్రయత్నం చేయకుండా దబాయింపులకు దిగుతున్నారు.



ప్రజలు గతంలో ఆయనకు అధికారం ఇచ్చింది, కొత్త రాష్ట్రాన్ని భారతదేశ పటంలో కొంతలో కొంత అయినా ఆంధ్రులు సగర్వంగా చెప్పుకోగలిగేలా చేయగలరనే ఆశతోనే. కానీ ఆయనేం చేశారు... అసెంబ్లీలో, మీడియా సమావేశాల్లో ప్రత్యర్థి పార్టీల నేత కుటుంబ సభ్యులను, ముఖ్యంగా మహిళల్ని సమాజం ఛీత్కరించే భాషతో మాట్లాడించడం, ఆ మాటలకు పగలబడి నవ్వడం. పైగా 'నా మనసు గెలుచుకున్నావు' అని పొగడటం. ఇటువంటి రాజకీయ వాతావరణాన్ని దేశంలోనే ఎప్పుడూ ఎక్కడా చూసి ఉండం. దీనిని ప్రోత్సహించిన ఆ పార్టీ అధ్యక్షుడిలో ప్రజలకు శాడిస్టు అవశేషాలే కనిపించాయి గానీ, సాత్విక ప్రజారంజక పాలన ఛాయలు కనిపించలేదు.

సంక్షేమ పథకాల పేరుతో ప్రజల ఖాతాల్లోకి నేరుగా సొమ్ము జమచేస్తే చాలు, తానేమి చేసినా జనం పట్టించుకోరు అనే అభిప్రాయం తప్పు అని నిరూపణ అయినా, ఆయనలో మార్పు లేకపోవడమే విశేషం. మద్యం, ఇసుక, మట్టి, భూ ఆక్రమణలతో రాష్ట్రాన్ని లూటీ చేస్తూ ఉన్నా, 175కి 175 సీట్లూ తనవే అనే భ్రమలో ఆయన జనాన్ని తప్పుగా అంచనా వేశారు. ఇప్పుడూ అదే భ్రమలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం మీదకి తన జనాన్ని అబద్ధాలతో రెచ్చగొడుతున్నారు. తమ నాయకులందరినీ అన్యాయంగా జైలుకు పంపుతున్నారనీ, కక్ష సాధింపు అనీ మీడియా ముందు వగస్తున్నారు. అయినా.. ఇది 'నీవు నేర్పిన విద్యే కదా నీరజాక్ష!'

గతాన్ని మీరు మరచిపోవచ్చు గానీ, జనం మరవరు. చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో దిష్టిబొమ్మలు కాలిస్తే 307 కేసులు పెట్టించారు. జాతీయ రాజకీయాల్లో క్రియాశీలంగా పనిచేసినా, ఏ రోజూ రోడ్డుపైకి రాని నాలాంటి వ్యక్తిని కూడా పదిరోజులు గృహ నిర్బంధంలో ఉంచారు. ఒక రోజంతా స్టేషన్‌లో ఉంచారు. ఇలా రాష్ట్రమంతా కక్షల రాజకీయాలు నడిపి.. ఇప్పుడు శాంతిభద్రతలపై గగ్గోలు పెట్టడం ఎబ్బెట్టుగా లేదా? పైగా మీ నాయకులు పోలీస్ అధికారులపై దౌర్జన్యం చేయడం, అరెస్టు చేసుకోండి అంటూ మీది మీదికి వెళ్లడం.. ఇదేమి రాజకీయం? ఇది మీ వికృత చర్యలకి పరాకాష్ఠ కాదా?


అమాయకంగా మొహం పెట్టి అబద్ధాలు పండించినంత మాత్రాన ప్రజలు మోసపోరు. దబాయింపు, దౌర్జన్యాలతో, అరాచకాలతో ప్రజల్ని అదుపులో పెట్టుకుని పీఠాన్ని పదిలం చేసుకోగలం అనుకున్న బిహార్ లాంటి రాష్ట్రాలూ, ఆ నాయకులూ ఏమయ్యారో చూశాం. తల్లికి వందనం అంటూ పేద పిల్లల చదువులకు సాయం చేస్తుంటే.. రెండు వేలు విద్యామంత్రి లోకేశ్ ఖాతాలో పడుతోందంటూ నీచమైన ఆరోపణకి తెగించడం విడ్డూరం. జగన్ 2.0 అనీ, 2029లో సినిమా మరో లెవల్లో చూపిస్తాననీ, రప్పా రప్పా నరకుతానని అనడం మంచిదే అనీ.. ఏమిటిదంతా? గెలుపు ఓటములు సహజం. ఏడాది దాటినా ఓటమిని జీర్ణించుకోలేక కూటమిపై నిరంతరం రగిలిపోతూ, శాపనార్థాలు పెట్టడం ముఖ్యమంత్రి స్థాయిలో పనిచేసిన వ్యక్తికి సరిపోయే తీరు కాదు. ఇది ఆయనలోని అపరిపక్వతని తెలియజేస్తోంది.

ప్రజల్ని భయభ్రాంతులను చేయడం కాదు, చేసిన తప్పేమిటో గ్రహించి దిద్దుకునే ప్రయత్నం మొదలు పెట్టాలి. జనం నెత్తిన చేతులు పెట్టడం కాదు, జనం ముందు చేతులు కట్టుకుని నిలబడగలగాలి. అహం అనే కిరీటం నెత్తిన ధరించినంత కాలం మీరెన్ని ఆరోపణలూ విమర్శలూ చేసినా జనం వినరు. నచ్చరు. మిమ్మల్ని మెచ్చరు. ముందు మీరు మారండి.. తర్వాత మీ అనుచరులు మారుతారు. రాజశేఖరరెడ్డిలోని పరిణతి, పరిపక్వతా మీలో కనిపించిననాడే జనం మీకు ఇంకో ఛాన్స్ ఇస్తారు. లేదంటే మీరు కాలగర్భంలో కలిసిపోతారు.

○ ఓ.వి. రమణ
టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు

కార్యకర్తలుండగా హైటెక్ సర్వేలు ఎందుకు?

ఇటీవలి కాలంలో "సర్వే యాపారం" బాగా జోరందుకున్నది! అయిన దానికీ కానిదానికీ సర్వే ఒక ఫ్యాషనబుల్ వ్యాపకంగా మారింది. దీనికి పెద్దగా పెట్టుబడి అవసరం లేదు. సిబ్బందితో కూడా పని లేదు. ఒక ఐటీ డిగ్రీ, చేతుల్లో లాప్‌టాప్ ఉంటే చాలు ముగ్గురు నలుగురు కుర్రాళ్ళు కలిసి సర్వే దుకాణం ఒకటి మొదలుపెట్టేయవచ్చు! నిజానికి ఈ సర్వేలను ఎఫ్‌ఎంసీజీ (ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్) ఉత్పత్తులను తయారు చేసే/ మార్కెటింగ్ చేసే మల్టీ నేషనల్ కార్పొరేట్ కంపెనీలు ఎక్కువగా ఉపయోగిస్తాయి. ఏ కంపెనీ ఉత్పత్తులను జనం ఎక్కువగా ఉపయోగిస్తున్నారో, అందుకు కారణాలు ఏమిటో సమాధానాలు రాబడితే అందుకు తగినట్టు మార్కెటింగ్ వ్యూహాన్ని వారు రూపొందించుకోవచ్చు. ఇప్పుడు సర్వేల జాడ్యం రాజకీయ పార్టీలకు పాకింది. కానీ ఈ ఆన్‌లైన్ సర్వేల్లో ఎవరూ నిజం చెప్పరన్న నిజాన్ని రాజకీయ నేతలు గ్రహిస్తున్నట్టు లేదు.



రాజకీయ పార్టీల నేతలు తమ గురించి, తమ పాలన గురించి ప్రజలు ఏమి అనుకుంటున్నారో తెలుసుకొనేందుకు ఆధారపడవలసింది ఈ వ్యాపార హై-టెక్ సర్వేల మీద కాదు; ఆయా పార్టీల క్షేత్ర స్థాయి నేతలు, క్రియాశీలక కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, సానుభూతిపరుల మీద. అప్పుడే సరైన వాస్తవాలు తెలుస్తాయి. పైగా ఇందుకోసం ఆయా పార్టీలకు రూపాయి ఖర్చు పెట్టనక్కరలేదు. క్షేత్రస్థాయి బలగాలే సొంత ఖర్చుతో జనంలో తిరిగి జనాభిప్రాయాన్ని సేకరించి పంపుతారు. వాటిని క్రోడీకరించి, విశ్లేషించుకుంటే ప్రభుత్వం నుంచి ప్రజలు ఏమి ఆశిస్తున్నారో పాలకులకు స్పష్టంగా తెలుస్తుంది. ప్రజాభిప్రాయం తెలుసుకోడానికి ఇంతకుమించిన రాజమార్గం లేదు!

ఇక ఈ హైటెక్ సర్వే దుకాణాలన్నీ 'క్యాష్ & క్యారీ' తరహా వ్యాపార కాన్సెప్ట్‌లు మాత్రమే. వీటిని నిర్వహించే సంస్థలకు ప్రజలతో గానీ, వారి మనోభావాలతో గానీ, రాజకీయ పరిస్థితులతో గానీ, క్షేత్ర స్థాయి వాస్తవాలతో గానీ పరిచయం ఉండదు. ఎక్కడో ఐఐటీనో, ఎంబీఏనో చదువుకుని వచ్చి ఈ 'సర్వే యాపారం' మొదలుపెట్టేస్తారంతే!


రాజకీయ నేతలు కూడా (ఓటు అడిగే సందర్భంలో తప్పించి) ప్రజలను వదిలేశారు కాబట్టి, చివరకు ఇలా ఈ సర్వే యాపారులను పట్టుకుని సేద దీరుతున్నారు. ఇందుకు కోట్లాది రూపాయలు ఖర్చయినా రెడీమేడ్ ఫుడ్ లాగా సుఖంగా ఉంటుంది కాబట్టి లెక్క చేయటం లేదు. కానీ ఇదొక అసహజ, కృత్రిమ ప్రక్రియ. ఒక జూదం. గత ఎన్నికల ముందు ఈ సర్వే రాయుళ్ళు ఎన్ని పిల్లి మొగ్గలు వేస్తూ, జనం మనోభావాలతో ఎలా ఆడుకున్నారో మనమంతా చూశాం!

గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ సర్వేలనే జూదంపై ఆధారపడే చివరకు అన్నీ కోల్పోయారు. మద్దతుదారులను, కార్యకర్తలను, అభిమానులను, నాయకులను, శాసనసభ్యులను పోగొట్టుకున్నారు. జగన్ వందలాదిగా సర్వేలు నిర్వహించారని చెబుతారు. ఆ నివేదికల ఆధారంగానే ఆయనకు "వై నాట్ వన్ సెవెంటీ ఫైవ్?" అనేంత ధైర్యం వచ్చి ఉంటుంది. పోలింగ్‌కు నాలుగు రోజుల ముందు కూడా సర్వే చేయించామని, ఇంతటి ఘోర పరాజయం తాలూకు వాసనలేమీ ఆ సర్వేలో బయటపడలేదని ఆయన ఆ తర్వాత వాపోయారు. ఈ సర్వేల విశ్వసనీయత ఏపాటిదో చెప్పడానికి ఇంతకంటే పెద్ద ఉదాహరణ ఇంకే కావాలి! ఈ సర్వేల పైనే ఆధారపడి, సిద్ధం... సిద్ధం అంటూ ఎన్నికల యుద్ధంలోకి దిగారు జగన్. చివరకు ఏ సర్వేకూ అందని ప్రజాభిప్రాయం పోలింగ్‌లో వ్యక్తం అయింది.

అందుకే, తెలుగుదేశం పార్టీ వాస్తవ పరిస్థితి తెలుసుకునేందుకు ఈ బయటి సర్వేలపై ఆధారపడటం అనవసరం. కోటిమంది సభ్యులు కలిగిన ఏకైక ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం. తెలుగుదేశం సభ్యులు లేని గ్రామం అంటూ తెలుగునాట ఏదీ బహుశా ఉండకపోవచ్చు. కాబట్టి తెలుగుదేశం (కూటమి) ప్రభుత్వం తీసుకుంటున్న అనేక నిర్ణయాలపై ఈ కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకోవచ్చు. ప్రజల మధ్యనే నివసించే వారి అభిప్రాయాలకు మించిన సర్వే ఏముంటుంది?

అమరావతి పేరిట మరో 35 వేల ఎకరాల భూమి సేకరణ, గన్నవరం విమానాశ్రయంతోపాటు అమరావతిలో 5 వేల ఎకరాలతో మరో విమానాశ్రయం, గత పాలకుల హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై దర్యాప్తు, పోలవరం–బనకచర్ల లింక్ కాలువలు... తదితర అంశాలపై ప్రజలు ఏమనుకుంటున్నారో నేరుగా తమ కార్యకర్తల ద్వారానే తెలుసుకోవచ్చు. కోటిమంది కార్యకర్తలకూ స్మార్ట్ ఫోన్లు ఉంటాయి. అందువల్ల, నిముషాల్లో వారికి సందేశాలు పంపి, 48 గంటల్లో సమాధానాలు సంపాదించవచ్చు. వాటి ప్రాతిపదికగా పాలనా విధానాలను సవరించుకోవచ్చు.

▪ భోగాది వేంకటరాయుడు



సోలార్.. బాదుడు

- మిగులు విద్యుత్ ఇస్తున్నా తప్పని భారం
- ఏడాదిగా చెల్లింపులు నిల్.. వినియోగదారుల ఆగ్రహం
- చార్జీల పేరుతో ప్రతి నెలా రూ.400 నుంచి 500 వసూలు

8





పంచాయతీల్లో.. నిధులు నిల్

- ఆర్థిక సంఘం నిధులు మళ్లింపు
- 7 నెలలుగా ఒక్క రూపాయి ఇవ్వని వైనం
- రూ.70.52 కోట్లు బకాయి

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

వర్షాకాలం మొదలైంది. అంటు వ్యాధులు, జ్వరాలు ప్రబలే అవకాశాలు మెండుగా ఉన్నాయంటూ వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. ఇటువంటి సమయంలో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదల ఒక ఉద్యమంలా చేపట్టి, ప్రజలకు అంటు వ్యాధులు రాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. స్థానిక సంస్థల్లో ప్రజల మౌళిక వసతులకు సంబంధించిన పనులను చేపట్టాలని కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. ఈ నిధులను గ్రామాల్లో తాగునీటి పథకాల అభివృద్ధి, పారిశుధ్యం మెరుగుదల, మరుగుదొడ్ల నిర్మాణం, వ్యర్థాల నిర్వహణ తదితర పనులకు వినియోగించాలి. దీనిలో భాగంగా గత డిసెంబరు నెలలో పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాలకు రూ. 70.52 కోట్ల నిధులను కేంద్రం విడుదల చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను పంచాయతీల ఖాతాలకు జమ చేయకుండా దారి మళ్లించినట్లు తెలుస్తోంది. దీంతో గ్రామాలలో కనీసం పారిశుధ్య పనులను నిర్వహించ లేని దుస్థితి నెలకొంది. ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేయాలని సర్పంచులు కోరుతున్నా ప్రభుత్వం లెక్కచేయడంలేదు. వెనువెంటనే నిధులు విడుదల చేయకపోతే ఉద్యమమే శరణ్యమని సర్పంచ్‌లు చెబుతున్నారు.

నేడు బడి పండుగ

- మెగా పీటీఎం 2.0కు ఏర్పాట్లు
- పాఠశాలల్ని అలంకరించిన విద్యార్థులు

బడి పండుగకు విద్యాలయాలు ముస్తాబయ్యాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో గురువారం పండుగ వాతావరణంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు జరగనున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన, మౌలిక వసతులపై తల్లిదండ్రు లకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు ఉపాధ్యాయులు తల్లిదండ్రుల మధ్య స్నేహ పూర్వకమైన వాతావరణం నెలకొల్పి తద్వారా విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాట లక్ష్యంగా మెగా పేరెంట్స్ మీట్‌ను కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత గత ఏడాది నిర్వహించింది. ఇది విజయవంతం కావడంతో పాటు సత్ఫలితాలు ఇచ్చింది. దీంతో ఈ ఏడాది కూడా మెగా పేరెంట్స్ మీట్ ను నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలోని అన్ని పాఠశాలలు మెగా పేరెంట్స్ మీట్‌కు సిద్ధమయ్యా యి. కాగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఉత్సాహం చూపుతుండటంతో పండు గ వాతావరణంలో బడి పండుగకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

గుంటూరు(విద్య), జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులతో పాటు వారి తల్లితండ్రులను, టీచర్లను ఒకే వేదిక మీదకు తెచ్చి లోటుపాట్లు చర్చించడంతో పాటు చదువులో విద్యార్థుల ప్రోగ్రెస్‌ను అంచనా వేయడానికి ప్రభుత్వం పీటీఎం(పేరెంట్స్--టీచర్ మీటింగ్)కు గతేడాది డిసెంబరులో శ్రీకారం చుట్టింది. ఏడాదికి రెండుసార్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్ 2.0 నిర్వహణకు యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మౌలిక వసతుల కల్పన, చదువులో విద్యార్థుల ప్రతిభ, గ్రామంలోని దాతల సహకారంతో పాటు అన్ని అంశాలు చర్చకు వచ్చేలా పీటీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి ఏర్పాట్లపై ఇప్పటికే సూచనలు

(మిగతా 6వ పేజీలో)


ఎస్‌కేబీఎం స్కూల్లో మెగా పేరెంట్స్ మీట్‌కు జరుగుతున్న ఏర్పాట్లు

ప్రపంచ జనాభా దినోత్సవ వేదిక వెలగపూడి

- రేపటి కార్యక్రమానికి హాజరుకానున్న సీఎం చంద్రబాబు
- సచివాలయం సమీపంలో ఏర్పాట్లు.. పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

తుళ్లూరు (వెలగపూడి), జూలై 9 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం. వెలగపూడి సచివాలయం సమీపంలో ఈ కార్యక్రమానికి వేదిక ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించి భారీగా ఏర్పాట్లను చేస్తున్నారు. బుధవారం కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ బార్గవ తేజ ఆయా ఏర్పాట్లను పరిశీలించారు. సభా స్థలి, బారికేడింగ్, వాహనాల పార్కింగ్, సిట్టింగ్, తాగునీరు, పారిశుధ్య పను ల ఏర్పాట్లపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశా రు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, సీపీవో శేషశ్రీ, డీపీవో నాగసాయి కుమార్, డ్వామా పీడీ శంకర్, జిల్లా వ్యా ధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు, డీఎస్పీ మురళీకృష్ణ, ఎంపీడీవో శిల్ప, తహసీల్దారు సుజాత పాల్గొన్నారు.

సభా స్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్


ఇసుక క్వారీలకు.. సింగిల్ టెండర్

- అన్ని అనుమతుల బాధ్యత ఏపీసీఆర్‌డీఏదే
- ఇసుక కమిటీ ద్వారా ఏజెన్సీకి నగదు చెల్లింపు

బస్సుల కండీషన్‌లో నిర్లక్ష్యం వద్దు

- మహిళలకు ఉచిత ప్రయాణం సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలి
- ఆర్టీసీ ఈడీ నాగేంద్రప్రసాద్

నేటి నుంచి ఏఎన్‌యూ దూరవిద్య పరీక్షలు

- రాష్ట్ర వ్యాప్తంగా 114 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

సీటీ శాఖలో జోనల్ ఆర్వోకు గ్రీన్ సిగ్నల్

- మంత్రి పయ్యావుల సూత్రపాయ అంగీకారం
- వైసీపీ హయాంలో అడ్డగోలు సంస్కరణలు

6

జిల్లాకు 12 పంచాయతీ భవనాలు

- ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.32 లక్షలు

గుంటూరు సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 12 పంచాయతీ భవనాలు మంజూరయ్యాయి. జిల్లాలోని 14 పంచాయతీలకు నూతన భవనాలు నిర్మాణం కోరుతూ మార్చి 16న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆ లేఖపై స్పందించిన ప్రభుత్వం 12 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఒక్కొక్క గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం కోసం రూ.32 లక్షలు వెచ్చించ నున్నారు. ఇందులో రూ.25 లక్షలు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద, రూ.7 లక్షలు ఉపాధి హామీ పథకం కింద చెల్లించనున్నారు. చేబ్రోలు మండలంలో నారాకోడూరు, పొన్నూరు మండలంలో కట్టెంపూడి, వీఎన్‌పాలెం, పెదకాకాని మండలంలో వెంకటకృష్ణాపురం, దుగ్గిరాల మండలంలో వీర్లపాలెం, మోరంపూడి, కొల్లిపర మండలంలో దొంతలూరు, కుంచవరం, సోమసుందరపాలెం, మేడికొండూరు మండలంలో భీమినేనివారిపాలెం, పెదనందిపాడు మండలంలో నాగభైరవారిపాలెం, తిమ్మాపురం పంచాయతీలకు భవనాలు మంజూరయ్యాయి. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కమిషనర్ కృష్ణతేజలకు పెమ్మసాని కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదాత సుఖీభవ.. 2,21,317 మందికి

- జిల్లాలో 34533 మంది అనర్హులని తేల్చిన అధికారులు



గుంటూరు సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధి పొందేందుకు మొత్తం 2,64,566 మంది రైతుల్లో 2,213,17 మంది అర్హులు ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. వివిధ కారణాల చేత 34,533 మందిని అనర్హుల జాబితాలో చేర్చినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో పథకం కింద లబ్ధి పొందేందుకు వీలుగా అనర్హుల జాబితా నుంచి మినహాయించాలని 8716 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ప్రతి రైతు ఆధార్ కార్డు తీసుకుని రైతు సేవా కేంద్రానికి వెళ్లి అర్హుల జాబితాలో పేరు ఉందో లేదో తెలుసుకోవాలని అధికారులు సూచించారు. ఒక వేళ అనర్హుల జాబితాలో పేరు ఉంటే దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం గడువు ప్రకటించిందన్నారు.

బంగారు కుటుంబాలు.. 81,264

- ఎంపిక లక్ష్యం పూర్తికి ఆగస్టు 15గా నిర్దేశం
- ఇప్పటివరకు కేవలం 107 కుటుంబాలు మాత్రమే దత్తత

గుంటూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీ-4 బంగారు కుటుంబాలను ఎంపిక చేసే లక్ష్యం 81,264గా ప్రభుత్వం నిర్దేశించింది. ఆగస్టు 15వ తేదీ నాటికి ఆయా కుటుంబాలను ఎంపికచేయాలని సూచించింది. ఇందులో గుంటూరు తూర్పు నుంచి 17,050, పశ్చిమలో 14,757, మంగళగిరిలో 9,968, పొన్నూరులో 9,632, ప్రత్తిపాడులో 11,984, తాడికొండలో 6,700, తెనాలిలో 11,173 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు లక్ష్యం విధించింది. ఇప్పటివరకు తాడికొండలో మాత్రమే కాస్తంత పురోగతి కనిపిస్తున్నది. ఈ నియోజకవర్గంలో 101 కు టుంబాలను దత్తత తీసుకోగా మిగ తా చోట్ల ఇంకా ప్రారంభించలేదు. దీంతో ఆగస్టు 15కి ఇప్పుడు సాధించిన పురోగతి కంటే 81,157 కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉం టుంది. అయితే దీనికి సంబంధించిన డేటా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉన్నదని, పీ-4 సర్వే ఇప్పటి కే జరిగిందని అధికారులు చెప్తున్నా రు. ఎటొచ్చి మార్గదర్శకుల ఎంపికే క్లి ష్టతరం కానుంది. ఇందుకోసం శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించాలని కలెక్టర్ నిర్ణయించారు. మరో 35రోజుల్లో ఎంతమేర కు పురోగతి తెస్తారో చూడాలి. కొద్దిరోజుల్లో జిల్లాలోని పారిశ్రామికవేత్తలతో ప్రజాప్రతినిధు లు, అధికారులు సమావేశమై పీ4 గురించి వివరించి మార్గదర్శకులుగా ఎంపిక చేసేందుకు కృషి చేయనున్నారు.

సమన్వయంతోనే సైబర్ నేరాల నియంత్రణ

- పోలీసు, బ్యాంకు అధికారులు కలిసి పనిచేయాలి
- బ్యాంకు మేనేజర్ల సమావేశంలో ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ పెరుగుతోన్న సైబర్ నేరాలను నియంత్రించాలంటే పోలీసు శాఖ, బ్యాంకులు కలిసి సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల నియంత్రణకు పోలీసు, బ్యాంకు అధికారులు కలిసి పనిచేయాలన్నారు. సాంకేతికత పెరుగుతున్న తరుణంలో సైబర్ మోసాలపై ప్రజలకు ముందస్తు సమాచారం, అవగాహన కల్పించడం ముఖ్యమన్నారు. బాధితులు 1930 నేషనల్ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయడం, సమీపంలోని పోలీస్/బ్యాంకు అధికారులకు సమాచారం ఇవ్వడం ద్వారా తక్షణ సహాయం పొందవచ్చన్నారు. ఎన్‌సీఆర్‌బీ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసిన బాధితులకు ఎఫ్ఐఆర్ అవసరం లేకుండా సహాయం అందుతుందన్నారు. డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి, లోన్‌యాప్ మోసాల గురించి ఖాతాదారులకు అవగాహన కల్పించాలన్నారు. మొబైల్ ఫోన్ల ద్వారానే ఎక్కువ సైబర్ నేరాలు జరుగుతున్నందున, ఈ మార్గాల్లో వినియోగదారులను అప్రమత్తం చేయడం అత్యంత కీలకమన్నారు. సైబర్ నేరాల బాధితులకు అండగా ఉండి, వాటి నివారణకు బ్యాంకుల భాగస్వామ్యంతో తాము కృషి చేస్తామన్నారు. సైబర్ నేరాలపై ప్రత్యేక సూచనలతో కూడిన బ్రోచర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు జీ.వి.రమణమూర్తి, కే.సుప్రజ, యూనియన్ బ్యాంక్ డీజీఎం జవహర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి, ఐటీ కోర్ సీఐ నిస్సార్ బాషా తదితరులు పాల్గొన్నారు.


బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్


ర్యాలీలో పాల్గొన్న కేఎస్ లక్ష్మణరావు, కార్మిక, ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీ నాయకులు

నల్లచట్టాలను రద్దు చేయాలి

- సార్వత్రిక సమ్మెలో కార్మిక సంఘ నేతలు
- నిరసన ప్రదర్శనలు, ధర్నాలతో దద్దరిల్లిన గుంటూరు

గుంటూరు(తూర్పు), జూలై 9 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, 8 గంటల పని విధానం కొనసాగించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలని కార్మిక సంఘ నేతలు నినదించారు. కార్మిక సంఘాల పిలుపు మేరకు గుంటూరులో బుధవారం సార్వత్రిక సమ్మె నిర్వహించారు. సమ్మెలో కార్మికులు, ఎల్ఐసీ, పోస్టల్, గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు, రైతు, ప్రజా, కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. మిర్చియార్డు, కోల్డ్ స్టోరేజిలు, రైల్వేస్టేషను, బస్టాండ్, పోస్టల్, ఎల్ఐసీ కార్యాలయాలతో పాటు పలు ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. మెడికల్ రిప్రజెంటేటివ్‌లు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి బీఆర్ స్టేడియం వరకు కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ కార్మికులు వందేళ్లలో పోరాడి సాధించుకున్న కనీస వేతన చట్టం, బోనస్ చట్టం, పనిగంటల చట్టం వంటి దాదాపు 29 చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లుగా మార్చారని విమర్శించారు. లేబర్ కోడ్‌లకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్రంలోనూ 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి, 10 గంటల పని విధానం తీసుకొస్తుందన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు అమలు కావట్లేదన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసి, అంబానీ, అదానీ వంటి బడా కార్పోరేట్లకు సేవలు చేస్తున్నాయని మండిపడ్డారు. సీఐటీయూ నగర కార్యదర్శి శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నాగేశ్వరరావు, విష్ణు, కోటేశ్వరరావు, ముత్యాలరావు, ఎల్ అరుణ, నళినీకాంత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సమ్మె సందర్భంగా గ్రామీణ బ్యాంకుకు తాళాలు

చెత్త సంపదకు నిప్పు

- గ్రామ స్వరాజ్య లక్ష్యానికి తూట్లు
- ప్రత్తిపాడు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డులో దుస్థితి

ప్రత్తిపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు పరిశుభ్రంగా ఉండచడంతో పాటు వ్యర్థాల నుంచి సంపద సృష్టించి గ్రామ స్వరాజ్యానికి బాటలు వేయాలనే ప్రభుత్వ సంకల్పానికి అధికారులు తూట్లు పొడుస్తున్నారు. నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పడిన సంపద సృష్టి కేంద్రాలు గత వైసీపీ పాలనలో పూర్తిగా నిరాధరణకు గురయ్యాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో తిరిగి ప్రాణం పోసుకుంటున్నాయి. ప్రభుత్వం డంపింగ్ యార్డులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. గ్రామాలు స్వచ్ఛత దిశగా అడుగులు వేయడం కోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేసి అమలు చేస్తోంది. అయితే అధికారులు అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరి స్తున్నా రు. ప్రత్తిపాడులో నిత్యం ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు తడి పొడి చెత్త ఎక్కువ మొత్తంలోనే వస్తుంది. అయితే రోడ్లపై, ఇంటింటా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి అక్కడ తగల బెట్టేస్తున్నారు. అధికారులను బురిడీ కొట్టించేందుకు కొన్ని తొట్లను మాత్రం వర్మి కంపోస్టు తయారు చేయడానికి ఉపయోగించారు. అయితే వర్మి కంపోస్టు తయారు చేయాలంటే నాడెప్‌లు పనిచేయాలి. అందులో నిత్యం తడి చెత్తను వేసి వర్మి కంపోస్టుకు సిద్ధం చేయాలి. కాని ఇక్కడ నాడెప్‌లు పగిలిపోయి ఎందుకూ పనికి రాకుండా ఉన్నాయి. వచ్చిన చెత్తకు నిప్పు పెట్టి పూర్తిగా బూడిద చేసేస్తున్నారు. తగల బెడుతున్న విషయంలో పారిశుధ్య సిబ్బంది రకరకాల కారణాలు చెపుతున్నారు. డంపింగ్ యార్డు ముందు మొక్కలు నాటి పరిశుభ్రంగా ఉంచే ప్రయత్నం చేస్తుండగా వెనుక మాత్రం చెత్తను తగలబెట్టేస్తున్నారు.


పగిలిపోయి నిరుపయోగంగా ఉన్న నాడెప్‌లు


ప్రత్తిపాడు డంపింగ్ యార్డులో వ్యర్థాలను తగలబెడుతున్న దృశ్యం

సీఎంఏ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్
విద్యార్థుల ప్రభంజనం


సమావేశంలో మాట్లాడుతున్న మట్టుపల్లి మోహన్

గుంటూరు (విద్య) జూలై 9 ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సీఎంఏ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులతో ప్రభంజనం సృష్టించారని సంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ వెల్లడించారు. బుధవారం గుంటూరులోని మెయిన్ క్యాంపస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయస్థాయిలో తమ విద్యార్థులు పెనుగొండ సాయి రామచంద్రారెడ్డి 4 ర్యాంకు మట్టుపల్లి గాయత్రి శ్రావ్య 5, మైత్రేయ చోప్రా, బండి రెడ్డి మహేశ్వర్ 6, తోలేటి మనోజ్, పి కౌశిక్ రాజ్, అడ్డేపల్లి విజేత 8వ ర్యాంకు కొండరాపు పూర్ణచంద్ర, కురుబ దీక్షిత్ 9 వ ర్యాంకు నముద్రాల సాత్విక్, తులసి గౌతమ్ కుమార్ 10వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. జాతీయ స్థాయిలో 10 ర్యాంకుల్లో 11 మంది విద్యార్థులు మాస్టర్ మైండ్స్‌కు చెందిన వారేనని వెల్లడించారు. విద్యార్థులను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

● కార్యదర్శులకు డీపీవో ఆదేశాలు

రాజుపాలెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత ఆయా పంచాయతీల కార్యదర్శులదేనని డీపీవో నాగేశ్వరరావునాయక్ తెలిపారు. మండలంలోని గణపవరం గ్రామాన్ని బుధవారం డీపీవో సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడారు. ప్రతిరోజు చెత్త సేకరణ జరుగుతుందా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గృహాల్లోని వ్యర్థాలను గ్రీన్ అంబాసిడర్లకు అందజేసి, నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు.


గణపవరంలో ప్రజలతో మాట్లాడుతున్న డీపీవో నాగేశ్వరరావు నాయక్

లేబర్‌కోడ్ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి షేక్ ముజుఫర్ అహ్మద్ ● నరసరావుపేటలో సార్వత్రిక సమ్మె.. కార్మికుల ర్యాలీ

నరసరావుపేట టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్ అమలు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి షేక్ ముజుఫర్‌అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం సార్వత్రిక సమ్మెలో భాగంగా నరసరావుపేటలో కార్మికులు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా ముజుఫర్‌అహ్మద్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందు సాధించుకున్న కార్మిక చట్టాలను నరేంద్రమోదీ ప్రభుత్వం కాలరాస్తున్నదన్నారు. లేబర్‌కోడ్ అమలు చేస్తే కార్మిక వర్గానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. 8 గంటల పని విధానం, ఈఎస్ఐ, పీఎఫ్ తదితరాలు రద్దు అవుతాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులునాయక్, జిల్లా కన్వీనర్ శివకుమారి, రామకృష్ణ, శ్రీనివాసరావు, మసూద్, షేక్ సిలార్ మసూద్, ఎంసీపీఐ రెడ్‌ఫ్లాగ్, కృష్ణ, ఏడుకొండలు, పీడీఎం నాయకులు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ రాంబాబు,మస్తాన్‌వలి,కోటిరెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.


నరసరావుపేటలో కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు నిర్వహిస్తున్న భారీ ర్యాలీ

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి క్షమాపణలు చెప్పాలి


ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై సభ్య సమాజం తలదించుకునేలా వైసీపీ నేత నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి చేసిన జుగుప్సాకర వ్యాఖ్యలను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఖండించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తల్లిని, చెల్లిని దూషించే జగన్, వైసీపీ నేతల నుంచి ఇంత కంటే హుందాతనాన్ని ఆశించలేమని, మహిళ వ్యక్తిత్వంపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం హేయనీయమన్నారు. నారా భువనమ్మ దగ్గర నుంచి మొన్న అమరావతి మహిళలను, నేడు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని దూషించడం చూస్తే మహిళల పట్ల వైసీపీ నేతలకు ఎంత చులకన భావం ఉందో అర్థమవుతుందన్నారు. తక్షణమే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి వైసీపీ నేతలు క్షమాపణ చెప్పాలని, లేకుంటే మహిళలు ఆదిపరాశక్తులై కీచక వైసీపీ నేతలను తరిమికొట్టడం ఖాయమన్నారు.

యువకుడి హత్య కేసులో వీడిన మిస్టరీ

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉండడమే కారణం

గుంటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని తురకపాలెం రోడ్డులో జరిగిన కరిముల్లా హత్య కేసులో మిస్టరీ వీడింది. వివాహేతర సంబంధానికి కరిముల్లా అడ్డుగా ఉన్నాడని కారణంతోనే ఈ హత్య చేసినట్లు పోలీసులు విచారణలో తేలింది. శ్యామలనగర్ మూడో లైన్‌కి చెందిన చాగంటి శివరామరాజు ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో స్తంభాలగరువు రెండోలైన్‌లోని రాజ్యలక్ష్మి నగర్ కు చెందిన కరిముల్లా వదినతో శివరామరాజుకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇదిలా ఉంటే కొంతకాలంగా కరిముల్లాకు, ఆయన భార్యకు మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. కరిముల్లా భార్య కూడా ఆయన వదిన వద్దే ఉంటుంది. కాపురానికి రమ్మని ఎన్నిసార్లు కరిముల్లా అడిగినా ఆమె నిరాకరించింది. దీంతో తన భార్యపై కూడా కరిముల్లాకు అనుమానం వచ్చింది. దీంతో శివరామరాజుపై కరిముల్లా కక్ష పెంచుకున్నాడు. ఈ వ్యవహారం వారి మధ్య గొడవలకు కారణమైంది. దీంతో ఎలాగైనా కరిముల్లాను అడ్డుతొలగించుకోవాలనుకున్నాడు శివరామరాజు. ఇందుకు తన స్నేహితుడైన స్తంభాలగరువు మూడో లైనుకు చెందిన లావునూరి మధుసూదన్‌రెడ్డికి డబ్బు ఆశ చూపి కరిముల్లాను చంపాలని శివరామరాజు ప్రోత్సహించాడు. దీంతో మధుసూదన్‌రెడ్డి 15 రోజులుగా కరిముల్లాతో మరింత సన్నిహితంగా ఉంటున్నట్లు నటించాడు. గత ఆదివారం మధుసూదనరెడ్డి తన ఆటోలో కరిముల్లాను తురకపాలెం రోడ్డులోకి తీసుకు వెళ్లి కరిముల్లాకు మద్యం తాగించాడు. ఆ తర్వాత అరటి కాయల కత్తితో గొంతు కోసి చంపేశాడు. మృతదేహాన్ని పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి నెట్టి ఇంటికి వచ్చేసాడు. ఈ క్రమంలో నల్లపాడు పోలీసులు ఈ కేసులో నిందితులైన మధుసూదన్ రెడ్డి, శివరామరాజులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. తొలుత శివరామరాజు ఈ హత్యతో తనకి ఎటువంటి సంబంధం లేదని శివరామరాజు వాదించినప్పటికీ, మధుసూదన్ రెడ్డి చెప్పిన వివరాలు ప్రకారం పోలీసులు విచారించగా శివరామరాజు ఆదేశాల మేరకే ఈ హత్య జరిగినట్లు నిర్ధారించారు. కేసును పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నారు.

గంజాయి తాగుతున్న ఇద్దరు యువకుల అరెస్టు

గుంటూరు కార్పొరేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గంజాయి తాగుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు గుంటూరు-1


నిందితులను అరెస్ట్ చేసిన వన్‌టౌన్ ఎక్సైజ్ సీఐ లత, సిబ్బంది

ఎక్సైజ్ సీఐ లత బుధవారం తెలిపారు. అన్నమయ్యనగర్ రెండవ వీధిలో శివనాగరాజు కాలనీకి చెందిన బత్తుల గోపి, రాజీవ్ గాంధీనగర్‌కి చెందిన కుంభ కార్తీకేయ లు గంజాయి తాగుతూ ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 203, 20 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుని ఇద్దరిని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. సీఐ లత మాట్లాడుతూ ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్నా కఠిన చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐలు షరీఫ్, తిరుమలేశ్వరరావు సిబ్బంది కె. పూర్ణచంద్రరావు,. బసవేశ్వరరావు, వీరాంజనేయులు, గోపి, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 14.43 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 3,600 క్యూసెక్కుల నీరు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 536.90 అడుగులు ఉంది. ఇది 181.92 టీఎంసీలకు సమానం. ఎడమ కాలువ ద్వారా 3146 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ 1500 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 4646 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,17,868 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

టీడీపీ కార్యకర్తపై గొడ్డలితో దాడి


గాయాలతో రవీంద్ర

మాచర్ల రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడులో టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్తలు గొడ్డలితో దాడి చేసి గాయపరిచిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కంభంపాడు గ్రామానికి చెందిన కారుమంచి రవీంద్ర పొలంలో పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు పుట్ల వెంకయ్య, శివ, యర్రంకయ్య, వీర్ల సోమలింగంలు జీవాలను పొలంలో తోలారు. మా పొలంలో మేపవద్దని అలా మేపితే ఊరుకునేది లేదని రవీంద్ర వారిని అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన వైసీపీ కార్యకర్తలు గొడ్డలితో దాడి చేసి గాయపరిచారు. గాయపడ్డ రవీంద్రను బంధువులు వైద్యం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం దాడి సంఘటనపై మాచర్ల రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

చెట్టుకు ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య

బొల్లాపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేళ్ళవాగు గ్రామానికి చెందిన గంగనబోయిన వెంకటేశ్వర్లు(37) బుధవారం తన పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని చనిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటేశ్వర్లు రెండు రోజుల క్రితం తన భార్య కృష్ణకుమారిని పొలంలోనే హత్య చేశాడని, ఈ నేపథ్యంలో తాను కూడా బుధవారం తన పొలంలోనే చెట్టుకు ఉరి వేసుకొని చని పోయాడని తెలిపారు. కుటుంబ మనస్పర్థల కారణంగా ఈ సంఘటనలు జరిగినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఏ బాలకృష్ణ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులు చనిపోవటంతో కుమారుడు నాగ లక్ష్మయ్య, కుమార్తె శ్రీవాణిలు రోదిస్తున్న తీరు స్థానికులను కంట తడి పెట్టించింది. శ్రీవాణి ఇంటర్ చదువుతుండగా, నాగ లక్ష్మయ్య ఇటీవల 10వ తరగతి పూర్తి చేశాడు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

నరసరావుపేట లీగల్, జూలై 9, (ఆంధ్రజ్యోతి): సాతులూరు, జొన్నలగడ్డ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడు నలుపు చొక్కా నలుపు రంగు ప్యాయింట్ ధరించి ఉన్నాడు. మృతుడి జేబులో మద్దిల రామకృష్ణ తండ్రి పేరు లక్ష్మయ్య, గోదికొమ్ము సింగవరం, విజయనగరం అనే ఆధార్ కార్డు ఉంది. మృతుని వివరాలు ఎవరికైనా తెలిస్తే నరసరావుపేట రైల్వే పోలీస్ లను సంప్రదించాలని రైల్వే ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా గుర్తుతెలియని వ్యక్తి మృతి

వినుకొండటౌన్, జూలై 9, (ఆంధ్రజ్యోతి): గోనుగుంట్లవారిపాలెం పంట పొలాల్లో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని స్థానికులు పోలీసులకు తెలిపారు. ఎస్ఐ సత్యనారాయణ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాల్లో మార్చురీకి తరలించి, కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెనుమాక రైతులతో మంత్రి నారాయణ సమావేశం

తాడేపల్లి (పెనుమాక), జూలై 9 (ఆంధ్ర జ్యోతి): పెనుమాకలో మంత్రి నారాయణ బుధవారం రాత్రి పర్యటించి రాజధానికి భూములు ఇచ్చిన రైతులతో సమావేశమ య్యారు. లాండ్ పూలింగ్ లో భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్లు కేటాయింపుపై చర్చలు


రైతులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

జరిగాయి. రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్ల కేటాయింపుపై రైతులు తమ అభి ప్రాయాలను మంత్రి నారాయణకు వివరించారు. జరీబు కింద ఇచ్చిన ప్లాట్లకు సం బంధించి పలు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సుమారు 1100 ఎక రాలు జరీబు ల్యాండ్ వుండగా పూలింగ్‌కు 850 ఎకరాలు రైతులు ఇవ్వడంతో ప్లాట్ల కేటాయింపు విషయమై చర్చకు వచ్చింది. ప్రస్తుతం దానికి సంబంధించి రెసిడెన్సియల్ ప్లాట్లు ఇచ్చి, కమర్షియల్ ప్లాట్లు తదుపరి కేటాయిస్తామని అధికారులు చెప్పగా రైతులు అలా కాకుండా రెండింటిని ఒకేసారి ఇవ్వాలని కోరారు. పలు స్థలాలకు రోడ్ల పోటు విషయాలపై చర్చించారు. రైతులు కోరిన విధంగా ప్లాట్లు కేటాయింపులు చేస్తామని ఆ విధంగానే కేటాయింపు చేయాలని అధికారులకు మంత్రి నారాయణ సూచించారు. ఈ నెల 11న ప్లాట్లు కేటాయించాల్సి ఉండగా అన్ని విషయాలు పరిగణలోకి తీసుకున్న తరువాత ప్లాట్లు కేటాయిస్తామని మంత్రి చెప్పారు.ఈ కార్యక్రమంలో సీఆర్‌డిఏ కమిషనర్ కన్నబాబు, అధికారులు, స్థానిక గ్రామ రైతులు, ఆయా పార్టీల నేతలు పాల్గొన్నారు.

6 నెలల తర్వాత
టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి

రెండు యూనిట్లను పరిశీలించిన శ్రీశైలం ప్రాజెక్టు సీఈ తిరుమల ప్రసాద్


ప్రాజెక్టు ఇంజనీర్లతో చర్చిస్తున్న శ్రీశైలం ప్రాజెక్టు సీఈ జి.తిరుమల ప్రసాద్

రెంటచింతల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో బుధవారం రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. కిందటేడాది డిసెంబర్ 13 తరువాత కరెంట్‌ను తయారీ చేయడం ఇదే ప్రథమం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా శ్రీశైలం ప్రాజెక్టు సీఈ జి.తిరుమల ప్రసాద్ హాజరయ్యారు. ఉద్యోగులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 2026 మార్చి 31 వరకు 78 ఎంయుల విద్యుత్ తయారు చేయాలనేది టార్గెట్‌గా నిర్ణయించారని గతేడాదిలా లక్ష్యాన్ని అధిగమించాలని గుర్తు చేశారు. రెండు యూనిట్లను, ఎంసీఆర్‌ను, 20 రేడియల్ క్రస్ట్‌గేట్లను పరిశీలించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. బుధవారం రాత్రి 7 గంటల వరకు 322 మెగావాట్ల విద్యుత్‌ను తయారు చేయగా టేల్‌రేస్ ఛానల్ ద్వారా కృష్ణానదిలోకి 8799 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రసుత్తం రిజర్వాయర్‌లో 7.0800 టీఎంసీల నీరుండగా ఈ నీరు 75.50 మీటర్లకు సమానం. సీఈ జి.తిరుమల ప్రసాద్‌ను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఈ వేంకటరమణ, జీఎం శ్రీనివాస్, ఈఈ సుబ్రహ్మణ్యం, నాగరాజు, ఏడీఈ రత్తయ్య, సుబ్బారావు,రాజేష్ పాల్గొన్నారు.

జగన్ పర్యటన బల ప్రదర్శన కోసమే : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జగన్ చిత్తూరు జిల్లా పర్యటనతో రైతులకు ఒరిగిందేమి లేదని, కేవలం బలప్రదర్శన కోసం అక్కడకు వచ్చారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట గురించి, సాగు గురించి తెలియని జగన్ పదవీకాంక్షతో ప్రభుత్వంపై బురద జల్లుతున్నాడని విమర్శించారు. రైతుల పరామర్శ పేరుతో గొప్పగా రక్తి కట్టిద్దామన్న జగన్ నాటకం అభాసుపాలైందని, రైతుల స్థానంలో కార్యకర్తల్ని ఉంచి బంగారు పాళ్యంలో వైసీపీ చేసిన విన్యాసాలను ప్రజలు ఛీ కొడుతున్నారని వివరించారు. సరైన ధరలేదని, రైతులు నష్టపోకూడదనే చంద్రబాబు మిర్చి, పొగాకు, కోకో, మామిడి ఉత్పత్తుల్ని ప్రభుత్వమే కొనేలా చేశారని తెలిపారు. ఇప్పటికే పొగాకు రైతులకు రూ.270 కోట్ల వరకు చెల్లించారని, మామిడికి ప్రభుత్వం తరపున కిలోకు రూ.4లు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు.

ఎస్టీ ఉద్యోగ నియామకంలో రిజర్వేషన్లు పాటించాలి

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

పెదకాకాని, జులై 9(ఆంధ్రజ్యోతి): ఎస్టీల ఉద్యోగ నియామకాలలో రిజర్వేషన్లు పాటించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో రాష్ట్ర ఎస్టీ కమి


ప్రసంగిస్తున్న శంకర్‌రావు

షన్ సెక్రెటరీ కే. రామశేషు, విద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే గంగాధర రావు, ఫ్యాకల్టీ, టీచింగ్ , నాన్ టీచింగ్ స్టాఫ్ , స్టూడెంట్స్ , కాలర్స్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ విద్యార్థులు, కాలర్స్ అడ్మిషన్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తున్నారో లేదో పరిశీలించడానికి వచ్చానని తెలిపారు. రోస్టర్ పాయింట్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి ఎస్టీలు రాజ్యాంగ పరంగా వచ్చిన హక్కులను ఉపయోగించుకోవాలని, మనకు ఎదురైన సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. సమస్యలు ఏమైనా చెప్పాలని, మీ సమస్యలను కమిషన్ ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. వర్సిటీలో స్కాలర్‌షిప్, హాస్టల్ ఫెసిలిటీ తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ప్రొఫెసర్ రత్నశీలమణి, జి. సింహాచలం, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలో రూ. లక్ష మాయం

గురజాలటౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గురజాల కు చెందిన కొత్తపల్లి శ్రీనివాసరావుకు చెందిన బ్యాంకు ఖాతాలో రూ. లక్ష మాయమైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. మాచర్ల రోడ్డులోని స్టేట్ బ్యాంకు ఖాతాలో గత నెల 15వ తేదీన తన ఫోన్‌లో పీఎం కిసాన్ యోజన పథకం క్లిక్ చేశానని బుధవారం ఖాతాను తనిఖీ చేయగా రూ. లక్ష మాయమయ్యాయని, దీనిపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

నేడు బడి పండుగ

(5వ పేజీ తరువాయి..)

సలహాలు అందించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 1200కి పైగా పాఠశాలల్లో మెగా పేటీఎం కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమ ఏర్పాట్లకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయించింది. దీంతో పాఠశాలల్లో షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు, వలంటీర్లు వ్యక్తిగతంగా తల్లిదండ్రులతో మాట్లాడేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి తల్లితండ్రితో విద్యార్థుల పురోగతి నివేదిక, ఆరోగ్య నివేదిక గురించి చర్చిస్తారు. తల్లులకు రంగవల్లుల పోటీలు, నిమ్మకాయ, చెంచా, మ్యూజికల్ చెయిర్స్ పోటీలు, తండ్రులకు తాడు లాగుడు పోటీలు జరగనున్నాయి.

ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలి

అమ్మ పేరుతో ఒక మొక్కను ప్రతి విద్యార్థికి అందిస్తారు. నాలుగు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ వారు నమోదు చేసుకున్న సంఖ్య ఆధారంగా కనీసం ఒకటి నుంచి రెండు మొక్కలు ఇస్తారు. వారు ఆ మొక్కలను వారి ఇంటి పరిసరాలు, పబ్లిక్ ప్రదేశంలో, పాఠశాలకు వెళ్లే మార్గంలో నాటి వాటిని రోజు సం రక్షించేటట్లు వారిని చైతన్య పరచనున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	104, 112, 123
చికెన్ విత్ స్కిన్(కిలో)	200.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	210.00

37,578 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 39,011 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 37,578 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,839 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	11000
334	9500	12700	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13200	334	9500	12600
273	----	-----	నెంబరు. 5	10000	13300
341	10000	13400	273	---	----
4884	----	---	341	10000	13500
సూపర్ 10	----	----	4884	---	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13500	తేజ	10000	13400
షార్క్-1	---	---	బ్యాడిగి	10000	12500
బ్యాడిగి	10000	12600	దేవనూరు డీలక్స్	---	----
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4800	7000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ప్రజలకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

చంద్రన్న పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందజేస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని 14వ డివిజన్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసిన ఘనత సీఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందని తెలిపారు. పింఛన్లు నాలుగు వేల రూపాయలు పెంచి ప్రతి నెలా ఇంటికే తీసుకొచ్చి అందిస్తున్న ప్రభుత్వాన్ని అవ్వ తాతలు హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నారని తెలిపారు. అనారోగ్యంతో ఏ ఒక్కరు బాధపడకూడదని నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 200మందికి రూ.2.50 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ నిధుల ద్వారా భరోసా కల్పించామని తెలిపారు. గుంటూరు జీజీహెచ్‌లో పేదలకు మరింత వైద్యసేవలు అందించేందుకు దాతలను భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. దీంతోపాటు పీ-4 కార్యక్రమం ద్వారా పేదరికంపై యుద్ధం చేయబోతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్, కార్పొరేటర్ వేముల జ్యోతి, దేవళ్ల వెంకట్, వహీద్, చల్లా ఆంజనేయప్రసాద్, అచ్చి కిరణ్, సాదినేని శ్రీనివాసరావు, కొంపల్లి మాలకొండయ్య, రవి, కోటేశ్వరరావు, కలాం, జానీ, అన్సారి, మధు, వేముల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరులాకు అటానమస్ హోదా

గుంటూరు(విద్య), జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెదపలకలూరులోని విజ్ఞాన్ నిరులా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్‌కు యూజీసీ, జేఎన్టీయూకే నుంచి అటానమస్ హోదా మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కళాశాలలో ఉన్న విద్యా నాణ్యత, మౌలిక సదుపాయాలు, పరిశోధన తదితర అంశాలను పరిశీలించి తమ కళాశాలకు అటానమస్ హోదా కల్పించినట్లు తెలిపారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సిలబస్ రూపొందించుకోవడం, నవీన విద్యావిధానాలు అమలు చేస్తామని వివరించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు హర్షం వ్యక్తం చేశారు విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.



సర్టిఫికెట్‌తో విజ్ఞాన్ నిరులా ప్రిన్సిపాల్ పాతూరి రాధిక

జిల్లా రెడ్ క్రాస్‌కు గవర్నర్ పురస్కారాలు

గుంటూరు(తూర్పు), జూలై 7(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా విభాగంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా రెడ్ క్రాస్‌కు గవర్నర్ పురస్కారాలు లభించాయి. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన రెడ్‌క్రాస్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ వడ్లమాని డాక్టర్ రవి, వైస్ చైర్మన్ పి రామచంద్రరాజు ఈ పురస్కారాల్ని అందుకున్నారు. 2021- 22 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి, 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి తృతీయ ఉత్తమ జిల్లాగా గుంటూరు రెడ్ క్రాస్‌కు అవార్డులు వరించాయి. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న వారిని పలు సేవా సంస్థలు ప్రత్యేకంగా అభినందించారు.



గవర్నర్ నజీర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ వడ్లమాని రవి

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

● దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు

● గుంటూరు రైల్వేస్టేషన్‌లో నిరసన ప్రదర్శన

గుంటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ గుంటూరు డివిజనల్ సెక్రెటరీ వీవీ రమణయ్య అన్నారు. జాతీయ స్థాయిలో 10 మేజర్ సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాలు బుధవారం భారత్‌బంద్‌కు పిలుపునిచ్చిన దృష్ట్యా సంఘ్ సంఘీభావం తెలిపింది. గుంటూరు రైల్వేస్టేషన్, పీవే యూనిట్, సీఅండ్‌డబ్ల్యూ డిపోలో నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. సంఘ్ డివిజనల్ సెక్రటరీ రమణయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, జాతీయ వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా విధానపరమైన నిర్ణయాలు అమలు చేస్తుందని ఆరోపించారు. ఈ విధానాలు కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నాయన్నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ నిరసన ప్రదర్శనల్లో సంఘ్ డివిజన్ ప్రెసిడెంట్ వై.సురేష్‌బాబు, డిప్యూటీ డివిజనల్ సెక్రటరీలు ఎస్‌వీ అర్జున, ఎల్ఎస్ మూర్తి, సీడబ్ల్యూసీ సభ్యుడు వై.కృష్ణమోహన్, ఓపెన్‌లైన్ బ్రాంచ్ సెక్రెటరీ శ్రీధరాచారి తదితరులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు

గోరంట్ల, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా ఘంటసాల

గుంటూరు(తూర్పు), జూలై 9(ఆంధ్రజ్యోతి): గోరంట్ల, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ(పీఏసీఎస్) చైర్ పర్సన్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు ఘంటసాల సోమశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ కీలకమైన పదవి అప్పజెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. గోరంట్ల పరిధిలో రైతులకు విస్తృత సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



ఘంటసాల సోమశేఖర్

ఐదు లక్షల మొక్కలతో గ్రీన్ గుంటూరు

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర



కాకాని రోడ్డులో పరిశీలిస్తున్న నగర మేయర్ రవీంద్ర, పక్కన ఎమ్మెల్యే నసీర్, కమిషనర్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో 5 లక్షల మొక్కలు నాటడం ద్వారా గ్రీన్ గుంటూరు సాధన జరుగుతుందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. బుధవారం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్ నసీర్, కమిషనర్ పులి శ్రీనివాసులతో కలిసి కాకాని రోడ్డు, నందివెలుగు రోడ్డు, పొన్నూరు రోడ్లలో పర్యటించి, నగరంలోకి ప్రవేశ మార్గాలైన ప్రధాన రోడ్లకు ఇరువైపులా, సెంట్రల్ డివైడర్లపై మొక్కలు నాటడం, ఆక్రమణల తొలగింపు చేపట్టాల్సిన ప్రాంతాలను పరిశీలించారు. మేయర్ రవీంద్ర మాట్లాడుతూ.. నగరంలో మిషన్ గ్రీన్ అమలుకు వార్డుల వారీగా మొక్కలు నాటడంతో పాటు ప్రభుత్వ స్థలాల్లో, పార్కులలో, వాకింగ్ ట్రాక్‌లలో, ప్రధాన, అంతర్గత రోడ్ల వెంట విరివిగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం సంగడిగుంట ముస్లిం శ్మశాన వాటికను పరిశీలించి, అందులో వీధి లైట్లు, పిచ్చి మొక్కల తొలగింపు, మౌలిక వసతుల కల్పనపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఓటర్ల జాబితా రూపకల్పనలో బీఎల్వోలు కీలకం

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పారదర్శక ఎన్నికలకు, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించడంలో బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వో)ల పాత్ర కీలకమని, బీఎల్‌వోలు ఎన్నికల నిబంధనలు, చట్టాలపై సమగ్ర అవగాహన కల్గి ఉండాలని గుంటూరు తూర్పు 95 నియోజకవర్గ ఈఆర్‌వో, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధ వారం స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమొక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో గుంటూరు పశ్చిమ 94, తూర్పు 95 నియోజకవర్గాల బీఎల్‌వోలకు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో జరుగుతున్న శిక్షణ శిబిరంలో కమిషనర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతి ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నగరంలోని గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజక వర్గాల బీఎల్‌వోలకు జరుగుతున్న దశల వారీ శిక్షణలో బీఎల్‌వోల విధులు, ఎన్నికల నిబంధనలు తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌వో, నగర అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఏఈఆర్‌వోలు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, రాంబాబు, సూరజ్‌కుమార్, సూపరిండెంట్ పద్మనాభరావు, డిప్యూటీ తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, వేదికపైన ఏసీ ఓబులేసు, డీసీలు

రోడ్ల మీదకు ర్యాంపులు, డ్రైన్ల నిర్మాణం చేయకూడదు

నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రైన్లపై నిర్మాణాలు చేయకుండా, డ్రైనేజి లైన్‌ని మేజర్ డ్రైన్‌లోకి కనెక్ట్ చేయాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ ఏటీ అగ్రహారం, వెంకటరమణ కాలనీ, రామిరెడ్డి నగర్, ఎన్జీవో కాలనీ, శ్యామలనగర్ ప్రాంతాల్లో ఆక్యుపెన్సి సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, సెట్ బ్యాక్, రోడ్ల కొలతలు తనిఖీ చేసి, తదుపరి అనుమతులకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎక్కువమంది రైతులకు వ్యవసాయ పరికరాలు

● ఆగ్రోస్ చైర్మన్ సుబ్బానాయుడు

అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో తిరిగి ప్రవేశపెట్టిన వ్యవసాయ యాంత్రీకరణ సబ్‌మిషన్ పథకం కింద రైతులకు వ్యక్తిగత పనిముట్లను 2025-26లో ఎక్కువ మందికి అందేలా చూడాలని ఏపీ ఆగ్రోస్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ఆగ్రోస్ అధికారులను ఆదేశించారు. బుధవారం మంగళగిరి సమీపంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జిల్లాల వారీగా ఆగ్రోస్ అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన ఆగ్రోస్ అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికతో పాటు కోర్టు కేసులు, బకాయిలు, సంస్థ స్థలాల పరిరక్షణ, వ్యవసాయ పరికరాల అమ్మకం తదితర అంశాలపై చర్చించారు. ఆగ్రోస్ ఎండీ ఢిల్లీరావు, జీఎం రాజమోహన్, మేనేజర్ కూర్మారావు, ఎస్ఈ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలో కోత లేదు: అగ్రి డైరెక్టర్

రాష్ట్రానికి ఎరువుల సరఫరాపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి కోతలైె విధించలేదని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు స్పష్టం చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 16.76లక్షల టన్నుల ఎరువులు కేటాయించగా, జూన్ నెలాఖరు నాటికే 5.64లక్షల టన్నులు రాష్ట్రానికి వచ్చినట్లు బుధవారం తెలిపారు.

ప్రాజెక్ట్ లీడ్ ఏజెన్సీగా రైతు సాధికార సంస్థ


అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరువు అనుసరణ, ఉపశమనం ద్వారా ప్రకృతి దృశ్య స్థాయి వ్యవసాయ పర్యావరణ పరివర్తన ప్రాజెక్ట్ అమలుకు లీడ్ ఏజెన్సీగా ఏపీ రైతుసాధికార సంస్థను ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర పశుసంవర్థకశాఖలో ముగ్గురు అదనపు డైరెక్టర్ల తుది సీనియారిటీ జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. ఉద్యానశాఖలో 1,2 స్థాయి గెజిటెడ్ పోస్టుల భర్తీకి ఆ శాఖ డైరెక్టర్ అధ్యక్షతన స్క్రీనింగ్ కమిటీని ప్రభుత్వం నియమించింది. పట్టు పరిశ్రమశాఖలో ఫీల్డ్ అసిస్టెంట్ కేటగిరిలో 2017 నుంచి ప్రొబేషన్‌లో ఉన్న ఫుల్‌టైమ్ కంటింజెంట్ ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించి, ఇప్పటికే రిటైరైన వారికి కోర్టు ఆదేశాల మేరకు పెన్షన్ ప్రయోజనాలు కల్పించేలా ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పీఎంఏజీవై అమలుకు అప్రైజల్ కమిటీ

అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన(పీఎంఏజీవై) పథకం అమలుకు జిల్లా స్థాయి ప్రాజెక్టు అప్రైజల్ కంకన్వర్జెన్స్ కమిటీ ఏర్పాటు చేస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా స్థాయిలో కలెక్టర్/కమిషనర్ చైర్‌పర్సన్‌గా, జడ్పీ సీఈఓ వైస్ చైర్‌పర్సన్‌గాను, పంచాయతీరాజ్ ఎస్ఈ, డీఆర్‌డీఏ పీడీ, మహిళా శిశుసంక్షేమశాఖ పీడీ, డీఈఓ, డీఎంఅండ్‌హెచ్ఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ/ఈఈ, విద్యుత్‌శాఖ ఎస్ఈ, ఎన్ఐసీ డీఎం, ఐదు పీఎంఏజీవై గ్రామాల నుంచి ప్రతినిధులు, రాష్ట్ర స్థాయి టెక్నికల్ రిసోర్స్ సపోర్ట్ ఇన్‌స్టిట్యూషన్ నోడల్ అధికారి సభ్యులుగా, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా కమిటీని ఏర్పాటు చేస్తూ ఆదేశాలిచ్చారు.

వీవీఐటీ విశ్వవిద్యాలయంలో 'ఎపిక్స్' కార్యక్రమం

పెదకాకాని, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన ప్రతిష్టాత్మక పర్డ్యూ యూనివర్సిటీలో ప్రారంభించిన 'ఎపిక్స్' కార్యక్రమాన్ని వీవీఐటీ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఎపిక్స్ కార్యక్రమంలో భాగంగా పర్డ్యూ యూనివర్శిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ విలియమ్ వోక్స్ వీవీఐటీ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ సర్వీసెస్ ప్రోగ్రాంలో భాగంగా వీవీఐటీ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను విద్యార్థులు వివరించారు. అనంతరం ప్రొఫెసర్ డాక్టర్ విలియమ్ వోక్స్ మాట్లాడుతూ సాంకేతిక వినియోగం ద్వారా ప్రపంచ సవాళ్లు అధిగమించేలా విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా 10 విద్యాలయాలు ఎంపిక కాగా వీవీఐటీ విశ్వవిద్యాలయం అందులో ఒకటి అన్నారు. విద్యార్థులలో సేవాగుణం, మంచిని పెంచే 'ఎపిక్స్' కార్యక్రమంలో భాగమైన విలియమ్ వోక్స్నును వీవీఐటీ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు, వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ కె.గిరిబాబు, సీఎస్పీ సంధానకర్త భక్తసింగ్ అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ విలియం వోక్స్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

నేటి నుంచి శ్రీగౌరీ విశ్వేశ్వర స్వామి ఆలయ ఉత్సవాలు

గుంటూరు(తూర్పు), జూలై 9(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట, 2వ లైన్‌లో ఉన్న శ్రీగౌరీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ శతాబ్ది ఉత్సవాలు గురువారం నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామికి గణపతి హోమాలు, లక్ష బిల్వార్చన, నీరాజన మంత్ర పుష్పం, 11న చండీ హోమం, గౌరీదేవికి లక్ష కుంకుమ అర్చన, 12న లక్ష నాగవల్లీ దళార్చన, 13న లక్ష తులసి దళార్చన, 14న పూర్ణాహుతి, మహాకుంభాభిషేకాలు, స్వామి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

వైభవంగా గురుపూజోత్సవం

గుంటూరు(తూర్పు), జూలై 9(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానగర్, 3వ లైన్‌లోని శ్రీసాయినాథ సన్నిదానంలో గురుపౌర్ణమి మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం బాబాకి విశేషాభిషేకాలు, అర్చనలు జరిగాయి. అనంతరం గురుపూజోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులకు కమిటీ సభ్యులు పాద పూజ నిర్వహించారు. అనంతరం కోలాటాలు, మంగళ వాయిద్యాల నడుమ పుర వీధుల్లో బాబా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలపాటి మాధవి, స్థానిక కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు పాల్గొనగా, కార్యక్రమాల్ని సన్నిధానం గౌరవ అధ్యక్షుడు యడ్లపాటి అశోక్‌కుమార్, అధ్యక్షుడు వడ్లమూడి శివరామకృష్ణయ్య, స్వరూపరాణీ తదితరులు పర్యవేక్షించారు.



గురు పూజ ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, బొల్లేపల్లి సత్యనారాయణ దంపతులు

అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిత్యనగర్, సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా స్వరరాగ సుధా ఆధ్వర్యంలో బుధవారం జరిగిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు కేవీ సాయిబాబా శర్మ, కృష్ణకుమారి, పీఎల్ నరసింహారావు పలు భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీబోర్డుపై రామకృష్ణ, తబలాపై షణ్ముఖశర్మ వాయిద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను ఆలయ ధర్మకర్త కోటేశ్వరరావు ఘనంగా సత్కరించారు.



భక్తిగీతాలను ఆలపిస్తున్న సాయిబాబా శర్మ

వైకుంఠపురం హుండీ ఆదాయం రూ.46.76 లక్షలు

తెనాలి అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురం ఆలయానికి రూ.46 లక్షల 76 వేల 204 రూపాయల ఆదాయం లభించింది. శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి నాలుగు నెలలకుగాను భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. 19.5గ్రాముల బంగారం, 319 గ్రాముల వెండి భక్తులు సమర్పించారు. భక్తులు, అర్చక సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, భక్తులు, స్కౌట్స్ క్యాడెట్లు పాల్గొన్నారు. ఈవో అనుపమ, ప్రత్యేక అధికారి సుభద్ర పర్యవేక్షించారు.

కొలకలూరు శివాలయంలో చోరీ

తెనాలి రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కొలకలూరులోని గంగాపార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి వారి దేవస్థానం (శివాలయం)లో చోరీ జరిగింది. ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం పూజా కార్యక్రమాలు ముగించుకుని మంగళవారం రాత్రి ఆలయానికి తాళాలు వేశారు. బుధవారం ఉదయం వచ్చిన ఆలయ అర్చకులు దేవస్థానానికి వేసిన తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఆలయంలోకి వెళ్లిచూడగా స్వామివారి హుండీ తాళాలు ధ్వంసం చేసి అందులోని కానుకలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీంతో ఆలయంలో ఆధారాలు సేకరించారు.



సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో అవ్వాతాతలతో ఎమ్మెల్యే గళ్లా మాధవి

సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రం ముందడుగు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): సంక్షేమాన్ని, అభివృద్ధిని సమ పాళ్లలో కొనసాగిస్తూ రాష్ట్రాన్ని కూటమి ప్రగతి పథాన నడిపిస్తోందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. నియోజకవర్గంలో ఆమె బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. పీరుతోటలో ప్రజలను కలిసి వారి అభిప్రాయాన్ని సేకరించారు. డివిజన్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారని, రాబోయే 2 నెలల్లో కుక్కల బెడద కూడా పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. టిడ్కో ఇళ్ల సమస్యను పరిష్కరించి, అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించేలా కృషి చేస్తామన్నారు.

సమాజంలో వైసీపీకి స్థానం లేదు

అధికారం పోయిందన్న అక్కసుతో వైసీపీ నేతలు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి ప్రజలను తొక్కుకుంటూ పోతే, ఆ పార్టీ మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు ఇష్టానుసారం మహిళలపై నోరు పారేసుకుంటున్నారు. నిన్నటికి నిన్న ఒక బుద్ధి లేని, ఇంగిత జ్ఞానం, విచక్షణ లేని వ్యక్తి మహిళా ప్రజాపతినిధైన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై సభ్యసమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు చేస్తే ఆ పార్టీ అధిష్టానం ఖండించకుండా ఉండటం, ఈ రోజుకి కూడా ప్రసన్నకుమార్‌రెడ్డి తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని నిస్సిగ్గుగా ప్రకటించటం చూస్తే వీరు ఎంత బరితెగించి ఉన్నారో అర్థం అవుతోంది. ఇటువంటి వ్యక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో సింహాద్రి కనకాచారి, వడ్లమూడి వెంకటేశ్వరరావు, బెజవాడ రమ్య, ఈశ్వరాచారి, రఫీ, నరసింహారావు, కృష్ణారెడ్డి, దుడికి సాంబయ్య, శోభారాణి, ములక సత్యవాణి, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

రూ.2కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన

నియోజకవర్గంలోని 25, 31వ డివిజన్లలో సుమారు రూ.2కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ఆమె బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 25వ డివిజన్లో సాయినగర్ క్రాస్ రోడ్డులో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్లు, మహాత్మాగాంధీనగర్ మెయిన్ రోడ్డు సమీపంలో రూ.50 లక్షలతో సీసీ డ్రైన్లు, ఆర్సీసీ కల్వర్టులు, ఆదర్శనగర్ 2వ లైన్ మెయిన్ రోడ్డులో రూ.16 లక్షలతో సీసీ డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణం, సుబ్బారెడ్డి నగర్ మెయిన్ రోడ్డులో 2, 5వ లైన్లో రూ.49 లక్షలతో సీసీ రోడ్లు, 31వ డివిజన్ ఏటి అగ్రహారం 1, 2 క్రాస్ రోడ్లలో 35 లక్షలతో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు.

మద్దు రామకృష్ణయ్య ట్రస్ట్ సేవలు అభినందనీయం

గుంటూరు(తూర్పు), జూలై 9(ఆంధ్రజ్యోతి): పేద వర్గాలకు ఆర్థిక చేయూతను అందిస్తున్న మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే మాధవి అన్నారు. స్థానిక కాకాని రోడ్డు, ఏఎస్ కన్వెన్షన్ సెంటర్లో రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన వృద్ధులకు పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ 300 మంది పేద వృద్ధులకు రూ.400 చొప్పున మూడు నెలల పింఛన్ అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు రామకృష్ణయ్య మాట్లాడుతూ పింఛన్లతోపాటు వైద్యశిబిరాలు, పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్లు మద్దు జయలక్ష్మి, భావన్నారాయణ, డాక్టర్ దేవి వైష్ణవి, శ్రీమన్నారాయణ హర్షిత పాల్గొన్నారు

నేడు జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపికలు

గుంటూరు(తూర్పు), జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పేరేచర్ల మైదానంలో సబ్ జూనియర్ బాలుర విభాగంలో గురువారం జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుమ్మర క్రాంతి కుమార్, దుర్గామోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ఎంపికైన వారు నల్లమల్ల జోన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన వారు ఈ నెల 12నుంచి రాజమండ్రిలో జరిగే స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల్గిన క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకుని ఉదయం 8 గంటలకు మైదానం వద్ద రిపోర్టు చేయాలని కోరారు. వివరాలకు 73375 85790 సంప్రదించాలని సూచించారు.

దశావతార సన్నిధిలో పూజలు

పెదకాకాని, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న శ్రీ దశావతార వెంకన్న సన్నిధిలో ప్రత్యేక పూజలను బుధవారం నిర్వహించారు. ఆషాడమాసం సందర్భంగా అవదూత దత్త పీఠం, పటమట వాస్తవ్యులు వేంకటేశ్వర స్వామి వారికి అషాడ పట్టి సమర్పించారు.

సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో శస్త్ర చికిత్సలు ఎక్కువ

అప్రమత్తం చేసిన కుటుంబ ఆరోగ్య సర్వే



అమ్మకు ఆపద

సత్తెనపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే అత్యధిక సిజేరియన్‌లు మన రాష్ట్రంలో జరుగుతున్నాయి. సిజేరియన్లు 42.2 శాతంగా ఉన్నట్టు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే గణాంకాలు చెపుతున్నాయి. ఈ తీవ్రతను తగ్గించేలా సహజ ప్రసవాలను ప్రోత్సహించాలని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు వైద్యులకు సూచిస్తున్నారు. సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, బెల్లంకొండ, అచ్చంపేట, క్రోసూరు మండలాల నుంచి నిత్యం గర్భిణీలు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు వచ్చి చికిత్సలు పొందుతుంటారు. నెలకు 120కి పైగా ప్రసవాలు ఆస్పత్రిలో జరుగుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ నిబంధనల ప్రకారం ఆ ప్రసవాలలో సీజేరియన్‌ల శాతం 25కు మించ కూడదు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే 50 వరకు సిజేరియన్‌లు ఉంటున్నాయి. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో జనవరి నెలలో 52 సాధారణ ప్రసవాలు, 57 సిజేరియన్‌లు జరిగాయి. ఫిబ్రవరిలో 42 సాధారణ ప్రసవాలు, 51 సిజేరియన్‌లు జరిగాయి. మార్చిలో 57 సాధారణ ప్రసవాలు, 44 సిజేరియన్‌లు జరిగాయి. ఏప్రిల్‌లో 49 సాధారణ ప్రసవాలు, 45 సిజేరియన్‌లు జరిగాయి. మే నెలలో 56 సాధారణ, 49 సిజేరియన్‌లు జరిగాయి. జూన్‌లో నేటి వరకు 71 సాధారణ ప్రసవాలు, 41 సిజేరియన్ జరిగాయి. దీనిని బట్టి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆరు నెలల్లోనే ఇక్కడ మొత్తం కాన్పుల్లో 50 శాతం వరకు సిజేరియన్‌లు జరిగినట్టు తెలుస్తుంది.

తీవ్ర ప్రభావం

సిజేరియన్ కాన్పు తల్లీ బిడ్డలకు తీవ్ర ప్రభావం చూపుతుంది. శిశువు జన్మించిన గంటలోపే తల్లి ముర్రు పాలు తాగించాలని వైద్యులు చెపుతుంటారు. సిజేరియన్ చేసిన తల్లి స్పృహలోకి రావాలంటే సుమారు ఐదు గంటల సమయం పడుతున్న తరుణంలో ఇది సాధ్యం కాదు. ఇతర ఇబ్బందులు తలెత్తుతుంటాయి. బిడ్డను త్వరిత గతిన అన్నీ తానై తల్లి తేలికగా చూసుకోవాలంటే సాధారణ ప్రసవంతోనే సాధ్యమవుతుంది. గర్భిణీలకు చెందిన కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని గమనించాల్సి ఉంది. ఆయా మండల్లోని ఏఎన్ఎంలు, ఆశావర్కర్‌లు సాధారణ ప్రసవాలపై గర్భిణీలకు అవగాహన కల్పిస్తూ ఆరోగ్య అంశాల గురించి పూర్తిస్థాయిలో వివరించాల్సిన అవసరం ఉంది. ఇకనైనా సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

తప్పనిసరి పరిస్థితుల్లోనే...

తప్పనిసరి పరిస్థితుల్లోనే ఏరియా వైద్యశాలకు వచ్చే గర్భిణీలకు సిజేరియన్‌లు చేయాల్సి వస్తుందని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు. సాధారణ ప్రసవాలను కూడా ఎక్కువగా ప్రోత్సహిస్తున్నామన్నారు.

-డాక్టర్ లక్ష్మణరావు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్

సీటీ శాఖలో జోనల్ ఆర్వోకు గ్రీన్ సిగ్నల్



వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం

- మంత్రి పయ్యావుల సూత్రప్రాయ అంగీకారం
- వైసీపీ హయాంలో అడ్డగోలు సంస్కరణలు
- నూతన ఆర్వోతో మేలంటోన్న ఉద్యోగులు

గుంటూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): వాణిజ్యపన్నులశాఖలో జోన్-3లో కొత్తగా రీజనల్ కార్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతోన్నాయి. ఇటీవల కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులతో ఆ శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నూతన ఆర్వో ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు సమాచారం. దీంతో ఆ శాఖ ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో సంస్కరణల పేరుతో అడ్డగోలుగా రీజనల్ కార్యాలయాలను ఏర్పాటు చేసి ఉద్యోగులను సొంత డివిజన్‌లకు దూరంగా బదిలీ చేయటంపై ఉద్యోగుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. సంస్కరణల పేరుతో రాష్ట్రంలో తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో రీజనల్ కార్యాలయాల(ఆర్వో)ను ఏర్పాటు చేశారు. ఆయా నూతన ఆర్వోలకు రాష్టంలోని వేర్వేరు డివిజన్‌ల నుంచి ఉద్యోగులను బదిలీపై సుదూర ప్రాంతాలకు కేటాయించారు. దాంతో గుంటూరు నుంచి తిరుపతి, కడప, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు కూడా వెళ్ళిన ఉద్యోగులున్నారు. రాష్ట్రంలో నాలుగు జోన్‌లు ఉండగా మూడు రీజనల్ కార్యాలయాలను మాత్రమే ఏర్పాటు చేయటంతో అసలు సమస్య వచ్చిందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడలో ఆర్వో పరిధిలోకి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు వస్తాయి. తాజాగా జోన్ 3లో కూడా కొత్తగా రీజనల్ కార్యాలయం ఏర్పాటు చేస్తే నాలుగు జోన్‌లకు నాలుగు రీజనల్ కార్యాలయాలు ఏర్పాటు చేసి సమతుల్యత పాటించినట్లవు తుందని ఉద్యోగ సంఘాల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇటీవల పలు సమస్యలపై ఉద్యోగ సంఘాల నాయకులు మంత్రి పయ్యావుల కేశవ్‌తో భేటీ సందర్భంలో నూతన ఆర్వో ఏర్పాటుకు ఆయన అంగీకారం తెలపటంలో వారంతా హర్షం వ్యక్తం చేశారు. అయితే నూతన ఆర్వో ఎక్కడ ఏర్పాటు చేస్తారో త్వరలో వెల్లడించనున్నట్లు చెబుతున్నారు.

నూతన ఆర్వోతో సొంత డివిజన్‌లకు ఛాన్స్

నూతన రీజనల్ కార్యాలయం ఏర్పాటు చేయనుండటంపై ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. జోన్‌ల వారీగా ఆర్వో ఏర్పాటు చేయటంతో సమతుల్యత పాటించినట్లవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాంతో ఆర్వో ఏర్పాటుతో కొత్తగా అధికారులతో పాటు 25 ఏసీటీవో పోస్టులు, పది డీసీటీవో, కింది స్థాయి సిబ్బంది అవసరమని, ఫలితంగా దూర ప్రాంతాలకు వెళ్ళిన ఉద్యోగులు సొంత డివిజన్‌లకు వచ్చే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నూతన ఆర్వోతో అదనపు రెవెన్యూ కూడా కలిసి వస్తుందని చెబుతున్నారు. నిరంతర తనిఖీలతో పాటు ఆడిట్‌లతో ప్రభుత్వానికి అదనపు ఆదాయం కూడా సమకూరే ఛాన్స్ ఉందని తెలిపారు.

నేటి నుంచి ఏఎన్యూ దూరవిద్య పరీక్షలు

రాష్ట్ర వ్యాప్తంగా 114 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

పెదకాకాని, జూలై 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్యా కేంద్రం నిర్వహిస్తున్న పీజీ, యూజీ, డిప్లమా, సర్టిఫికెట్ ప్రోగ్రాం పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, దూర విద్యా పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య దిట్టకవి రామచంద్రన్ తెలిపారు. పరీక్షలు ఆగస్టు ఏడో తేదీ వరకు కొనసాగుతాయన్నారు. సెమిస్టర్ విధానంతో పాటు, వార్షిక, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:00 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 2 సెషన్లలో పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షల నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా 114 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినా, వర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సజావుగా పరీక్షల నిర్వహణకు ప్రత్యేక పరిశీలకులను నియమించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాలలో పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక స్క్వాడ్ బృందాలను సిద్ధం చేసినట్లు తెలిపారు.

బస్సుల కండీషన్‌లో నిర్లక్ష్యం వద్దు

● మహిళలకు ఉచిత ప్రయాణం సమర్ధవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలి ● ఆర్టీసీ ఈడీ నాగేంద్రప్రసాద్

గుంటూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా బస్సులను కండీషన్‌లో ఉంచుకోవాలని, ఇందులో ఎటువంటి నిర్లక్ష్యం చేయవద్దని నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జీ నాగేంద్రప్రసాద్ సూచించారు. ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని తిక్కన సమావేశమందిరంలో జోనల్ స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆక్యుపెన్సీని పెంచేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. అనవసర ఖర్చుల భారాన్ని తగ్గించుకోవాలని సూచించారు. డిపోల వారీగా సమీక్షించిన ఆయన త్వరలో మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణంపై అధికారులు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. బస్టాండ్‌లలో కూడా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. తాగునీరు, బల్లలు, ఫ్యాన్‌లు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అలానే కమర్షియల్ రెవెన్యూ పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో డీపీటీవోలు సీహెచ్ విమల (గుంటూరు), సామ్రాజ్యం (బాపట్ల), జోన్ డిప్యూటీ సీటీఎం రవికాంత్, డిపో మేనేజర్లు ఇతర అధికారులున్నారు.

ఇసుక క్వారీలకు.. సింగిల్ టెండర్

అన్ని అనుమతుల బాధ్యత ఏపీసీఆర్‌డీఏదే

ఇసుక కమిటీ ద్వారా ఏజెన్సీకి నగదు చెల్లింపు

గుంటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఇసుక క్వారీల్లో ఇసుక తొలగింపునకు ఏ జిల్లాకు ఆ జిల్లా కాకుండా సింగిల్ టెండర్ నిర్వహించి ఏజెన్సీని ఎంపిక చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఇసుక తొలగింపు కోసం రూ. 286.20 కోట్లకు పరిపాలన అనుమతికి కేబినెట్ ఆమోదం తెలిపింది. టెండర్ ప్రక్రియని పర్యవేక్షించేందుకు ఒక కమిటీని నియమిస్తుంది. కృష్ణా డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీర్ ప్రకాశం బ్యారేజ్ ముందుభాగంలోని ఇసుక ప్రదేశాలలో పూడిక తొలగింపునకు ఏపీసీఆర్‌డీఏకు అప్పగిస్తారు. పరిశ్రమలు, వాణిజ్య(ఖనిజాలు) శాఖ ద్వారా జలవనరుల శాఖకు బదులుగా ఏపీసీఆర్‌డీఏకి అన్ని అవసరమైన అనుమతులు, క్లియరెన్స్‌లు పొందడానికి అధికారాలు బదలాయిస్తారు. జాతీయ హరిత ట్రిబ్యునల్. నూతన ఇసుక విధానం మార్గదర్శకాలు, సుప్రీం కోర్టు, ఇతర న్యాయస్థానాల ఆదేశాలు, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు, నది సంరక్షణ చట్టం నిబంధనలకు అనుగుణంగా ఇసుక తొలగింపు ద్వారా పొందిన ఇసుక పరిమాణాన్ని ధ్రువీకరించే బాధ్యతని జిల్లా స్థాయి ఇసుక కమిటీకి కేటాయించారు. ఈ కమిటీ ద్వారానే ఏజెన్సీకి చెల్లింపులు చేస్తారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్‌లు పొందడానికి ఏపీసీఆర్‌డీఏ సమన్వయం చేసుకుంటుంది.

అమరావతి రాజధానిలో నిర్మాణ రంగం ఊపందుకోవడంతో భారీ మోతాదులో ఇసుక అవసరం ఏర్పడింది. ఇసుక కోసం ఆ శాఖ ఇప్పటికే గుంటూరు, కృష్ణా జిల్లాలకు ఇండెంట్ కూడా పంపించింది. అయితే అంత మోతాదులో ఇసుక సరఫరా చేయడానికి నిల్వలు లేవని రెండు జిల్లాలు నివేదించాయి. కృష్ణానదిలో పూడిక తీస్తే తప్ప రాజధాని అవసరాలకు సరిపడా ఇసుక లభ్యమయ్యే అవకాశం లేదు. దీనిని పరిగణనలోకి తీసుకొన్న ప్రభుత్వం ఇసుకకి సంబంధించి కీలక అధికారాలను ఏపీసీఆర్‌డీఏకి బదలాయించడం ద్వారా అమరావతి రాజధానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇసుక లభిస్తుందని చెబుతున్నది. ఇసుక మైనింగ్ ఆపరేషన్స్ మాత్రం యథాతథంగా కొనసాగుతాయి. పర్యవేక్షణ, నిఘా బాధ్యతలు మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల కిందనే ఉంటాయి. ఏజెన్సీ ఏమైనా అక్రమాలకు పాల్పడితే ఇప్పుడున్న నిబంధనల మేరకే చర్యలు తీసుకుంటారు. నదిలో నుంచి ఇసుకని బయటకు తీసి స్టాకు పాయింట్ల వద్దకు చేర్చే బాధ్యత ఏజెన్సీదే. స్టాకు పాయింట్ల వద్ద నుంచి ఇసుక లోడింగ్ ఛార్జీలు వసూలు చేసుకొని ఉచితంగా సరఫరా చేసే వ్యవహారాలు డీఎల్ఎస్‌సీ నిర్ణయం మేరకు తీసుకొంటారు.





ప్రభుత్వాస్పత్రిలో దుస్తులు అందజేస్తున్న భాష్యం రామకృష్ణ, రమణ యశస్వి

జీజీహెచ్‌లో శిశువులకు దుస్తులు పంపిణీ

సే వాట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో..

గుంటూరు మెడికల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి శిశు వైద్య విభాగంలోని చిన్నారులు బుధవారం కొత్త దుస్తులు ధరించి మురిసిపోయారు. ఆసుపత్రిలో వైద్యం పొందేందుకు వచ్చిన నాలుగేళ్లలోపు వయస్సు కలిగిన 350 మంది చిన్నారులకు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న రెడిమేడ్ దుస్తులను ఓ స్వచ్ఛంధ సంస్థ ఉచితంగా అందజేసింది. రంగు రంగుల్లో ఆకర్షణీయంగా ఉన్న దుస్తులను తమ బిడ్డలకు తొడిగిన తల్లులు ఆనందంతో మురిసిపోయారు. గుంటూరు జిల్లా ఉండవల్లికి చెందిన ఎస్ మారుతీ వేణుగోపాల్, ఆయన కుమార్తె నీరజ, తమ సే వాట్ స్వచ్ఛంధ సంస్థ తరపున ఈ దుస్తులను చిన్నారులకు అందజేశారు. ఇవన్నీ విదేశాల నుంచి వచ్చిన నాణ్యమైన దుస్తులు కావడం విశేషం. పిల్లలు దానం తీసుకుంటు న్నారనే భావన రాకుండా ఉండేందుకు...నచ్చిన దుస్తులను పిల్లలే ఎంచుకొని తీసుకొనే విధంగా వినూత్నంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో ఒకటి నుంచి నాలుగేళ్లలోపు వయస్సు గల అనాధ పిల్లలకు, అవసరమైన పేద పిల్లలకు నూతన దుస్తులు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ సే వాట్ సంస్థను గత ఏడాది స్వయంగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించడం విశేషం. వీరి సేవా నిరతిని పవన్ కల్యాణ్ అభినందించారు.

ఏడాదిలో 7350 మంది పిల్లలకు పంపిణీ

గతంలో నీరజ గుంటూరులోని భాష్యం విద్యా సంస్థల్లో విద్యాభ్యాసం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాస్పత్రిలో బుధవారం జరిగిన దుస్తుల పంపిణీ కార్యక్రమానికి తన గురువుభాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణను ఆమె ఆహ్వానించారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వితో కలసి భాష్యం రామకృష్ణ, వేణుగోపాలరావు, నీరజ తదితరులు చిన్నారులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. వేణుగోపాలరావు, నీరజ మాట్లాడుతూ తమ సంస్థ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు పలు ప్రాంతాల్లో 7350 మందికి దుస్తులు అందజేసినట్లు తెలిపారు. భాష్యం రామకృష్ణ, రమణ యశస్వి మాట్లాడుతూ సమాజంలో అనాధ, పేద పిల్లలకు దుస్తులు కొరత ఉందని, దీనిని గుర్తించిన సే వాట్ సంస్థ పిల్లలకు కొత్త బ్రాండెడ్ దుస్తులు అందజేయడం అభినందనీయమన్నారు.

సోలార్.. బాదుడు



మిగులు విద్యుత్ ఇస్తున్నా తప్పని భారం

● ఏడాదిగా చెల్లింపులు నిల్.. వినియోగదారుల ఆగ్రహం ● చార్జీల పేరుతో ప్రతి నెలా రూ.400 నుంచి 500 వసూలు ● పీఎం సూర్యఘర్ రిజిస్ట్రేషన్లు 87,936, పూర్తయినవి 1,640

గుంటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ ప్లాంటు పెట్టించుకుంటే నాణ్యమైన విద్యుత్‌తో పాటు బిల్లుల భారం తగ్గుతుంది.. పైగా మిగులు విద్యుత్ ద్వారా ఆర్థిక లబ్ధి జరుగుతోంది.. అని ట్రాన్స్‌కో అధికారులు ప్రచారం చేస్తున్నారు. అయితే పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఇప్పటికే సోలార్ విద్యుత్ బిగించుకున్న వారు బిల్లుల భారంతో అల్లాడుతున్నారు. ఉచిత విద్యుత్ అని భావించిన పలువురు సోలార్ విద్యుత్ వేలల్లో వెచ్చించి ఏర్పాటు చేసుకున్నారు. ఒకసారి పెట్టుబడి పెడితే ఇక పాతికేళ్ల విద్యుత్ భారం ఉండదని భావించి పలువురు ముందుకు వచ్చారు. కేంద్ర ప్రభుత్వం కూడా పీఎం సూర్యఘర్ పేరుతో భారీగా రాయితీలు ప్రకటించడంతో అప్పులు చేసి సోలార్ ప్లాంట్లు పెట్టించుకున్నారు. తీరా నెల తిరిగేసరికి వచ్చే కరెంటు బిల్లును చూసి మోసపోయామని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఉత్పత్తి అయిన విద్యుత్‌కు ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం మాటేమోగానీ.. ప్రతి నెలా చార్జీల రూపంలో వందల్లో కాజేస్తోందని వాపోతున్నారు. ఈ పరిణామాలతో పీఎం సూర్యఘర్ స్కీము అబాసుపాలవుతోంది. గుంటూరు జిల్లాలో ఈ ఏడాది మే నాటికి 87,936 రిజిస్ట్రేషన్లు జరగ్గా 1,640 మంది మాత్రమే సోలార్ ప్లాంట్లు పెట్టించుకున్నారు. సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు ఒక్కో కిలోవాట్‌కు రూ.75 వేల వరకూ ఖర్చవుతోంది. గత వైసీపీ ప్రభుత్వం వేసిన విద్యుత్ భారాలను మోయలేక కొంతమంది, కేంద్రం ప్రకటించిన భారీ రాయితీలు ఆశాజనకంగా ఉండడంతో మరి కొందరు సోలార్ వైపు మొగ్గు చూపారు. కరెంటు బిల్లుకు కట్టే డబ్బులేవో ప్రతి నెలా బ్యాంకుల్లో ఈఎంఐ కట్టుకోవచ్చని అనేక మంది రుణాలు తీసుకుని సోలార్ ప్లాంట్ ను ఏర్పాటు చేసుకున్నారు. అయితే రుణాలకు ఈఎంఐ తోడు వారికి ఇప్పుడు ప్రతి నెలా రూ.400 నుంచి 500 వరకూ కరెంటు బిల్లు కట్టాల్సి రావడంతో వారంతా లబోదిబోమంటున్నారు.

వినియోగం లేకపోయినా వసూళ్లు..

సోలార్ ప్లాంట్లు పెట్టుకుని ప్రతి రోజూ విద్యుత్‌ను తయారు చేసుకుని తమ విద్యుత్ తామే వాడుకుంటున్న వారిపై ట్రాన్స్‌కో చార్జీల రూపంలో బాదేస్తోంది. ప్రతి నెలా 100 నుంచి 200 యూనిట్ల విద్యుత్‌ను ఇస్తున్న వినియోగదారులపై కస్టమర్, గ్రిడ్ చార్జీల రూపంలో రూ.300 నుంచి 350 వరకు బిల్లులు కట్టాల్సి వస్తోంది. అదే ట్రాన్స్‌కో విద్యుత్ పది యూనిట్లు వాడుకున్నా బిల్లు 400 నుంచి 500 వందలకు పెరిగిపోతోంది. విద్యుత్ వినియోగం సున్నా ఉంటే స్థిర చార్జీలు రూ.30, కస్టమర్ చార్జీలు రూ.30 నుంచి 50, విద్యుత్ సుంకం రూ.1.86, సర్‌చార్జి 25, గ్రిడ్ చార్జీలు కిలోవాట్‌కు రూ.15 చొప్పున, ఒకరకం ఎఫ్‌పీపీసీ చార్జీలు రూ.144, రెండో రకం ఎఫ్‌పీపీసీఏ చార్జిలు రూ.79, కొత్తగా పెట్టించుకున్నవారికి మూడో రకం ఎఫ్‌పీపీసీఏ చార్జీలు మరో రూ.100 అదనంగా కట్టాల్సి వస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వ రాయితీలు శూన్యం..

రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్, సోలార్ విద్యుత్‌పై విస్తృతంగా ప్రచారం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది చివరినాటికి 15 లక్షల కుటుంబాలకు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అందులోభాగంగా కేంద్రం ఇచ్చే రాయితీలకు తోడు అదనంగా రాయితీలు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ పథకం కింద ప్రస్తుతం ఒక కిలో వాట్ సోలార్ ప్లాంటుకు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకైతే రూ.60 వేలు, మూడు కిలోవాట్లకైతే రూ.78వేలు చొప్పున భారీ సబ్సిడీ ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలకు రెండు కిలోవాట్ల సోలార్ ప్లాంటును ఉచితంగా ఏర్పాటు చేస్తానని చెబుతోంది. అదే సమయంలో బీసీలకు మూడు కిలోవాట్లకు కేంద్రం ఇచ్చే రూ.78 వేల రాయితీతోపాటు మరో 20 వేలు అదనంగా ఇస్తానని చెబుతోంది. ఆ ప్రకారం భారీగా పీఎం సూర్యఘర్ కోసం రిజిస్ట్రేషన్లు చేస్తోంది. అయితే ఆచరణలో ఒక్క ప్లాంటుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అదనపు సహాయం అందలేదు. ఈ పరిస్థితుల్లో గుంటూరు జిల్లాలో ఇప్పటి వరకూ 87,936 రిజిస్ట్రేషన్లు జరగ్గా పీఎం సూర్యఘర్ 1,640 మంది మాత్రమే సోలార్ ప్లాంట్లు పెట్టించుకున్నారు. కిందటేడాది జూన్ నాటికి ఈ సంఖ్య 917గా ఉంది. అంటే ఏడాది కాలంలో జిల్లాలో 723 మంది మాత్రమే సోలార్ ప్లాంట్లు పెట్టించుకున్నారు. బాపట్ల, పల్నాడు జిల్లాల్లో సోలార్ ప్లాంట్ల సంఖ్య 1000 కంటే తక్కువగా ఉంది. దీనిని బట్టి సోలార్ విద్యుత్ పట్ల ప్రజల్లో ఎంతటి విముఖత వ్యక్తమవుతోందో ఊహించవచ్చు.

● మిగులు విద్యుత్తుకు చెల్లింపులు ఎక్కడ?

పీఎం సూర్యఘర్ పథకం కింద లబ్ధిదారులు 'ఆన్ గ్రిడ్' పద్ధతిలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలి. ఆన్ గ్రిడ్ అంటే.. సోలార్ ద్వారా తయారైన విద్యుత్ గ్రిడ్‌కు వెళ్లిపోతుంది. గ్రిడ్ ద్వారా వచ్చే విద్యుత్‌ను వినియోగదారుడు వాడుకుంటాడు. ఈ రెండింటినీ లెక్కగట్టి బిల్లు వేస్తారు. వినియోగదారుడు వాడుకున్న విద్యుత్ కంటే, ఉత్పత్తి చేసిన విద్యుత్తు ఎక్కువగా ఉంటే దాన్ని మిగులు విద్యుత్‌గా ప్రకటించి దానికి నగదు చెల్లిస్తారు. గతంలో యూనిట్‌కు రూ.4.17గా ధర నిర్ణయించగా, తాజాగా కూటమి ప్రభుత్వం దాన్ని రూ.2.09 పైసలకు తగ్గించింది. అయితే ఆ డబ్బులు కూడా వినియోగదారులకు చెల్లించడం లేదు. ఏటా జూన్, డిసెంబరులో లెక్కచూసి వినియోగదారుడికి నగదు చెల్లించాలి. అయితే సోలార్ ప్లాంటు పెట్టుకుని ఏడాది పూర్తయినా ఇప్పటి వరకూ మిగులు విద్యుత్ లెక్కలు వేయకుండా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు.

ప్లాస్టిక్ కొంటారు.. పైసలిస్తారు

● స్వచ్ఛ రథం పేరుతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం ● గుంటూరు రూరల్ మండలంలో ప్రయోగం

గుంటూరు సిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఇంట్లో పనికి రాకుండా ఉండే ప్లాస్టిక్ డబ్బాలు.. పేపర్లు కొంటానికి ఎవరు వస్తారా.. అని ఇంక ఎదురు చూసే అవసరం లేదు. వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేసి పైసలు చెల్లించే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, కమిషనర్ కృష్ణ తేజ అత్యంత ప్రీతి పాత్రంగా రూపొందించిన ఈ కార్యక్రమం పేరు స్వచ్ఛ రథం. దాని అమలుకు గుంటూరు రూరల్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. గురువారం గుంటూరు రూరల్ మండలంలోని లాల్‌పురంలో ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, సీఈఓ జ్యోతి బసు, డీపీఓ బీవీఎన్ సాయికుమార్ స్వచ్ఛ రథం కార్యక్రమం ప్రారంభిస్తారు. నూతనంగా ప్రారంభించనున్న స్వచ్ఛ రథం కార్యక్రమంలో ప్లాస్టిక్ బాటిల్లు, న్యూస్ పేపర్లు, ప్లాస్టిక్ కవర్లు, పుస్తకాలు, పాల ప్యాకెట్ల కవర్లు, అట్టలు, ప్యాకింగ్ కవర్లు, నూనె డబ్బాలు, గాజు సీసాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థములు కంప్యూటర్లు, కీబోర్డులు, క్లాప్ మిత్రా ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. అందుకు గాను ఇంట్లోకి అవసరం అయిన నిత్యావసర వస్తువులను అందజేస్తారు. చెత్త నుంచి సంపద సృష్టి అనే కాన్సెప్ట్‌తో ఈ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు సీఈఓ జ్యోతి బసు తెలిపారు.



నూతనంగా ఆరంభించనున్న స్వచ్ఛ రథం

కౌన్సెలింగ్

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ప్రాణాంతకమా?

Q A డాక్టర్ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ గురించి ఎన్నో ఉదంతాలు వింటున్నాం. ఈ క్యాన్సర్‌ను ముందుగానే ఎలా పసిగట్టాలి? ఈ వ్యాధి సోకకుండా ఏదైనా వ్యాక్సీన్ ఉందా?

- ఓ సోదరి, హైదరాబాద్

క్యాన్సర్ అనగానే ఇక చావు దగ్గర పడిందనే నిర్థారణకొస్తాం. కానీ నిజానికి మహిళల్లో ఎక్కువగా కనిపించే రొమ్ము క్యాన్సర్‌తో పోలిస్తే, సర్వైకల్ క్యాన్సర్‌ను కనిపెట్టడం, చికిత్స చేయడం తేలిక. రొమ్ము క్యాన్సర్ పక్కదారి పట్టిస్తుంది. ఆలస్యంగా, చివరి దశలో కనిపెట్టినప్పుడు చికిత్స క్లిష్టమై ప్రాణాంతకంగా మారుతూ ఉంటుంది. కానీ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పూర్తి భిన్నం.



లక్షణాలు

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ తొలి దశలో లక్షణాలేవీ కనిపించకపోవచ్చు. తర్వాతి దశల్లో లక్షణాలు ఎలా ఉంటాయంటే....

- నెలసరి మధ్యలో, నెలసరి తర్వాత, శారీరక కలయిక సందర్భంలో యోని నుంచి రక్తస్రావం కనిపిస్తుంది.
- నీరు, రక్తంతో కూడిన స్రావాలు కనిపిస్తాయి. ఎక్కువగా విడుదలయ్యే ఆ స్రావాల నుంచి దుర్వాసన వెలువడుతుంది.
- నడుము నొప్పి, అసౌకర్యం ఉంటుంది.

కారణాలు

గతంతో పోలిస్తే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు ఈ మధ్య కాలంలో విపరీతంగా పెరుగుతున్నాయి. ఇందుకు పర్యావరణ మార్పులు, ఆహార, జీవనశైలి మార్పులు ప్రధాన కారణాలు. అయితే ఈ రకమైన క్యాన్సర్ సోకడానికి కచ్చితమైన కారణాన్ని కనిపెట్టలేకపోయినా, ఈ క్యాన్సర్ వృద్ధిలో హెచ్‌పివి (హ్యూమన్ పాపిలోమా వైరస్) పాత్ర ప్రధానంగా ఉంటున్నట్టు నిర్థారణ అయింది. అయితే ఈ వైరస్ సోకిన ప్రతి ఒక్కరూ, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు గురి కాకపోయినా, కొందర్లో ఆ వైరల్ ఇన్‌ఫెక్షన్ సర్వైకల్ క్యాన్సర్‌గా వృద్ధి చెందుతోంది. ఇందుకు కారణం పర్యావరణ, జీవనశైలి, ఆహారశైలిల్లో చోటు చేసుకున్న మార్పులు అందుకు తోడవడమే! ఈ కారణాలతో పాటు సర్వైకల్ క్యాన్సర్‌కు మరికొన్ని కారణాలు దోహదపడతాయి. అవేంటంటే...

- **ఒకటికి మించి లైంగిక సంబంధాలు:** ఎన్ని ఎక్కువ లైంగిక సంబంధాలు కలిగి ఉంటే, హెచ్‌పివి ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశాలు అంత ఎక్కువగా ఉంటాయి.
- **లైంగిక వ్యాధులు:** క్లమీడియా, గనేరియా, సిఫిలిస్, హెచ్ఐవి ఇన్‌ఫెక్షన్ హెచ్‌పివి ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశాలను పెంచుతాయి.

పరీక్షలు కీలకం

- **పాప్‌స్మియర్ టెస్ట్:** ఈ పరీక్షతో సర్విక్స్‌లోని కణాలు, వాటిలో చోటు చేసుకుంటున్న మార్పులు, సర్వైకల్ క్యాన్సర్ దారితీసే అవకాశాలను కనిపెట్టవచ్చు. లైంగిక జీవితాన్ని కొనసాగిస్తున్న ప్రతి మహిళా ఈ పరీక్ష చేయించుకోవడం అవసరం. వరుసగా మూడేళ్ల పాటు పరీక్ష ఫలితం నెగటివ్ వస్తే, అప్పటి నుంచి ప్రతి మూడేళ్లకోసారి ఈ పరీక్ష చేయించుకుంటే సరిపోతుంది.
- **హెచ్‌పివి డిఎన్ఎ టెస్ట్:** లైంగిక జీవితాన్ని కొనసాగిస్తున్న ప్రతి మహిళా ఈ పరీక్ష చేయించుకోవడం అవసరం. ఫలితం నెగటివ్ వస్తే, అప్పటి నుంచి ఐదేళ్లకోసారి ఈ పరీక్ష చేయించుకుంటే సరిపోతుంది.

హెచ్‌పివి వ్యాక్సిన్

సర్వైకల్ క్యాన్సర్‌కు ప్రధాన కారణమైన హెచ్‌పివి వైరస్‌కు అడ్డుకట్ట వేసే వ్యాక్సీన్ ఇది. 9 ఏళ్ల మొదలు 45 ఏళ్ల లోపు మహిళలు ఈ వ్యాక్సీన్ వేయించుకోవచ్చు.

- డాక్టర్ సచిన్ మర్ద
ఆంకాలజిస్ట్, హైదరాబాద్

క్రీడలంటే ఇష్టం. వ్యాపార రంగంపై ఆసక్తి. రెండిటిలోనూ రాణించాలనేది ఆమె ఆకాంక్ష. జాతీయ స్థాయి స్విమ్మర్‌గా క్రీడల్లో రాణిస్తూనే.. ఉన్నత విద్యాభ్యాసం కోసం లండన్ వెళ్లింది. అక్కడ చదువుకొంటూనే ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్ కోసం సన్నద్ధమయింది. ఇప్పుడు మాస్టర్స్ పూర్తి చేయడంతో పాటు.. అక్టోబరులో జరిగే ప్రపంచ ఐరన్‌మ్యాన్ చాంపియన్‌షిప్‌కు అర్హత పొందింది. ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళగా చరిత్ర సృష్టించిన బొమ్మినేని సంజనారెడ్డిని 'నవ్య' పలుకరించింది.



ఉక్కు మహిళ

విభిన్నం

"ఐరన్‌మ్యాన్ వరల్డ్ చాంపియన్‌షిప్'నకు అర్హత సాధించిన తొలి భారత మహిళగా గుర్తింపు పొందడం సంతోషంగా అనిపిస్తోంది. నాకు క్రీడలంటే ఇష్టం. వ్యాపార రంగంపై ఆసక్తి. ఇప్పుడు ఈ రెండిటినీ బ్యాలెన్స్ చేస్తూ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునే పనిలో ఉన్నా. నేను పుట్టి.. పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. నాన్న వెంకట్‌రెడ్డి ఇంజినీర్. ప్రస్తుతం ఒక ఇన్‌ఫ్రా కంపెనీ నడుపుతున్నారు. అమ్మ స్వప్న అందులో డైరెక్టర్. నేను ఇంటర్మీడియేట్ వరకు హైదరాబాద్‌లోనే చదువుకున్నా. 2020లో గ్రాడ్యుయేషన్ కోసం లండన్ వెళ్లా. 'యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్'లో బీఎస్సీ ఎకనామిక్స్, తాజాగా ఎమ్మెస్సీ అర్బన్ ఎకనామిక్ డెవలప్‌మెంట్‌లో మాస్టర్స్ పూర్తి చేశా. నా చదువు, విదేశాల్లో నేను గడించిన అనుభవం స్వదేశానికి ఉపయోగపడాలనే లక్ష్యంతో తిరిగి భారత్‌కు వచ్చేశా.

ప్రొఫెషనల్ స్విమ్మర్‌గా..

సైక్లింగ్, స్విమ్మింగ్, స్కేటింగ్, తైక్వాండో, భరతనాట్యం ఇలా నేను ఏది నేర్చుకుంటానని అడిగినా ఇంట్లో అడ్డు చెప్పేవారు కాదు. ప్రతి శిక్షణకూ అమ్మ నన్ను వెంటబెట్టుకుని తీసుకెళ్లేది. నా ఇష్టాన్ని తెలుసుకొని ప్రోత్సహించేది. ఇవన్నీ ప్రయత్నించాక నాకు స్విమ్మింగ్‌పై మక్కువ కలిగింది. గచ్చిబౌలి స్టేడియంలో ప్రొఫెషనల్ స్విమ్మింగ్ నేర్చుకోవడం ప్రారంభించా. ఫ్రీస్టయిల్ 800, 1500 మీటర్ల ఈవెంట్లలో 2018, 2019ల్లో రాష్ట్ర చాంపియన్‌గా నిలిచా. జాతీయ పోటీల్లో పాల్గొన్నాను కానీ పతకాలు గెలవలేకపోయా. ఆ దశలో క్రీడలు, చదువు రెండింట్లో ఏది ఎంచుకోవాలనే ప్రశ్న ఉదయించినప్పుడు నా ముందు ఉన్న రెండు దారుల గురించి ఒకసారి ఆలోచించా. క్రీడాకారుల కెరీర్ ఎనిమిది నుంచి పదేళ్లే. ఆసియా క్రీడలు, ఒలింపిక్స్ ఆ తర్వాత ఏంటి? అంత దూరం వెళ్లడానికి అప్పట్లో క్రీడా రంగానికి ప్రభుత్వాల సహకారం పెద్దగా ఉండేది కాదు. మన దగ్గర క్రీడా మౌలిక సదుపాయాలు అంతంతమాత్రమే. ఇక చదువు... వ్యాపార రంగంపై ఆసక్తి ఉండడంతో దానికి సంబంధించిన కోర్సులు చేస్తే భవిష్యత్తుకు భరోసా ఉంటుందని భావించాను. మన దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది. కొత్త ఆలోచనలతో స్టార్టప్స్ ప్రారంభిస్తే వ్యాపార రంగంలో రాణించవచ్చు అనిపించి ఉన్నత చదువులు కోసం యూకే వెళ్లా.

అలా మొదలైంది...

నేను పదో తరగతి చదువుతున్నప్పుడు యూట్యూబ్‌లో ఐరన్‌మ్యాన్ చాంపియన్‌షిప్ గురించి తొలిసారి తెలుసుకున్నా. తర్వాత దాని గురించి ఇంటర్నెట్‌లో శోధించా. కానీ ఐరన్‌మ్యాన్‌లో పాల్గొనేందుకు అవసరమైన శిక్షణ, సదుపాయాలు మన దగ్గర అందుబాటులో లేవని తెలిసి అప్పటికి ఆ ఆలోచనను పక్కన పెట్టా. అయితే లండన్ వెళ్లాక అక్కడున్న క్రీడా మౌలిక సదుపాయాలు చూశాక నాలోని క్రీడాకారిణి మేల్కొంది. ఐరన్‌మ్యాన్‌కు సన్నద్ధమైతే బాగుంటుందని అనిపించింది. అలా 2023లో సాధన మొదలుపెట్టా. చదువును నిర్లక్ష్యం చేయలేదు. తరగతులకూ హాజరవుతూనే ఉదయం మూడు గంటలు, రాత్రి మూడు గంటలు సాధన చేసేదాన్ని. అండర్ గ్రాడ్యుయేషన్, మాస్టర్స్ రెండూ డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించా. మరోవైపు ఐరన్‌మ్యాన్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు బ్రిటన్ కోచ్ థామస్ హంట్ దగ్గర శిక్షణ ప్రారంభించా.

ఇష్టపడి చేస్తే...

ఒకరి బలవంతం లేకుండా మనకు నచ్చి చేస్తే ఏ పనీ కష్టంగా అనిపించదు. యూనివర్సిటీకి ఒక్క రోజు కూడా సెలవు పెట్టకుండానే సాధన చేసేదాన్ని. ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్ చాంపియన్‌షిప్‌లో మూడు ఈవెంట్లు ఉంటాయి. స్విమ్మింగ్, సైక్లింగ్, మారథాన్. ఇవన్నీ ఒక్క రోజులోనే పూర్తి చేయాలి. నేను స్వతహాగా స్విమ్మర్‌ను కావడంతో చిన్నప్పటి నుంచీ రోజూ లేవగానే వ్యాయామాలు చేసే అలవాటు ఉండడంతో నాకు ఈ పోటీలో పాల్గొనడం కాస్త సులువు అయింది.

> **ఆడపిల్లలకు స్వేచ్ఛ ఇవ్వాలి...**
> మా స్కూల్‌లో నాలుగో తరగతి వరకు అబ్బాయిలతో అమ్మాయిలు అన్ని క్రీడల్లో పోటీపడేవారు. పై తరగతులకు వెళ్లేకొద్దీ నా స్నేహితులు చాలామందిని వాళ్ల తల్లిదండ్రులు 'ఆటలెందుకు. బాగా చదువుకో' అని కట్టడి చేసేవారు. కొందరినేమో ఆటలా.. చదువా? ఏదో ఒకటి తేల్చుకో' అనేవారు. దీనివల్ల చాలామంది అమ్మాయిలు తప్పనిసరి పరిస్థితుల్లో చదువునే కెరీర్‌గా ఎంచుకుంటున్నారు. ఈ ధోరణి మారాలి. ఆడపిల్లల ఆశయాలకు కుటుంబం అండగా ఉండాలి.

వెనక్కి తగ్గలేదు...

ఆస్ట్రేలియాలో గత నెల 15న జరిగిన 'ఐరన్‌మ్యాన్' అర్హత పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచాను. తద్వారా వచ్చే అక్టోబరులో హవాయిలో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించా. ఆస్ట్రేలియాలో జరిగిన ఈ అర్హత పోటీల్లో సముద్రంలో ఈదాల్సి వచ్చింది. ఇండోర్ స్విమ్మింగ్ పూల్స్‌లో సాధన చేసి.. ఒక్కసారిగా సముద్రపు ఉప్పు నీటిలో ఈత కొట్టడం కష్టంగా అనిపించింది. దీనికి తోడు నాకు కంటి చూపు సమస్య ఉండడంతో 'ఐ లెన్స్' వాడతాను. కాంటాక్ట్ లెన్స్ నీళ్లలో పెట్టుకోకూడదు. అలాగని అవి లేకపోతే నాకు సరిగ్గా కనిపించదు. అందుకే లెన్స్ తడవకుండా స్విమ్మింగ్ గాగుల్స్ పెట్టుకున్నా. కొంచెం దూరం ఈదిన తర్వాత గాగుల్స్ నుంచి కళ్లలోకి ఉప్పు నీరు వెళ్లిపోయాయి. కానీ వెనక్కి తగ్గలేదు. గంట 47 నిమిషాల్లో 3.8 కిలోమీటర్లు ఈదాను.

చూడలేకపోయా...

నీళ్లల్లో నుంచి బయటికి వచ్చాక కుడి కన్నుతో అసలు చూడలేకపోయా. రెండు కళ్లల్లో నుంచి అదే పనిగా నీళ్లు కారుతూనే ఉన్నాయి. ఇక్కడితో ఆపేద్దామా? అని మధ్యలో అనుకున్నాను. కానీ మధ్యలో వదిలేస్తే రెండేళ్ల శిక్షణ వృథా అవుతుందని.. నాకు నేను ధైర్యం చెప్పుకొని ముందడుగు వేశా. మూడు ఈవెంట్ల మధ్య ఉండే స్వల్ప విరామంలో ఏదో ఒకటి తినకపోతే శరీరంలో శక్తి ఉండదు. అయితే, ఈదుతున్నప్పుడు నోట్లికి ఉప్పు నీళ్లు వెళ్లిపోవడంతో సైక్లింగ్ చేస్తున్నంత సేపూ వాంతులు అవుతూనే ఉన్నాయి. దీంతో ఏమీ తినకుండానే మిగిలిన రెండు ఈవెంట్లు పూర్తి చేశా. స్విమ్మింగ్ తర్వాత జరిగిన 180 కిలోమీటర్ల సైక్లింగ్ ఈవెంట్‌ను 7.42 గంటల్లో, చివరగా 42.2 కిలోమీటర్ల మారథాన్‌ను 5.52 గంటల్లో ముగించా. మూడు ఈవెంట్లను కలిపి 15 గంటల 45 నిమిషాల 49 సెకన్లలో విజయవంతంగా పూర్తి చేశాను.

అడుగులు అటువైపు...

ఇక ఐరన్‌మ్యాన్ వరల్డ్ చాంపియన్‌షిప్ అవ్వగానే వ్యాపార రంగంలోకి ప్రవేశించాలనేది నా లక్ష్యం. టోక్యో ఒలింపిక్స్ తర్వాత జపాన్‌లో, ఫిఫా సాకర్ వరల్డ్‌కప్ తర్వాత ఖతార్‌లో విదేశీ పెట్టుబడులు బాగా పెరిగాయి. మన దేశంలో ఒలింపిక్స్ జరిగితే క్రీడా వ్యాపార రంగానికి ప్రాముఖ్యత పెరుగుతుంది. కనుక ఆ దిశగా క్రీడా మౌలిక సదుపాయాల కల్పన, క్రీడా ఆర్థిక విధానాల రంగంలో పని చేసేందుకు ప్రయత్నిస్తున్నా."

● ఎస్.ఎస్.బి.సంజయ్

> **ఐరన్‌మ్యాన్ వరల్డ్ చాంపియన్‌షిప్...**
> ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్ కాన్సెస్ట్ 1970వ దశకంలో పుట్టింది. 1974 నుంచి ఈ పోటీలను నిర్వహిస్తుండగా, 1978 నుంచి ఐరన్‌మ్యాన్ వరల్డ్ చాంపియన్‌షిప్‌ఎను అధికారికంగా ప్రారంభించారు. 3.8 కిలోమీటర్ల స్విమ్మింగ్, 180 కి.మి సైక్లింగ్, మరథాన్ (42.2 కి.మి)ను కలిపి ఒక్క రోజులో.. అంటే 24 గంటల్లో పూర్తి చేయాలి.





సిద్ధూ తయారు చేసిన సైకిల్‌పై అతడిని ఎక్కించుకుని తొక్కుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, సిద్ధూకు రూ.లక్ష చెక్ అందజేస్తున్న పవన్

భలే ఈ-సైకిల్.. భళా సిద్ధూ!

- ఇంటర్ విద్యార్థికి పవన్ అభినందనలు
- ప్రోత్సాహకం కింద రూ.లక్ష అందజేత

అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో, బ్యాటరీతో నడిచే ఈ-సైకిల్‌ను రూపొందించిన విజయనగరం జిల్లా తెర్లాం మండలం జాడవారి కొత్తవలస గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి రాజాపు సిద్ధూను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనలతో ముంచెత్తారు. వినూత్న ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణకు రూపం ఇచ్చిన సిద్ధూ గురించి సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న పవన్, అతడిని మంగళగిరి క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని ప్రత్యేకంగా మాట్లాడారు. సిద్ధూ తయారు చేసిన ఈ-సైకిల్ మూడు గంటలు చార్జింగ్ చేస్తే 80 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదు. సిద్ధూ తయారుచేసిన సైకిల్‌ను పవన్ కల్యాణ్ స్వయంగా నడిపారు. అతడి ఆలోచనలకు అబ్బురపడ్డారు. సిద్ధూ రూపొందించిన 'గ్రాసరీ గురూ వాట్సాప్ సర్వీస్' బ్రోచర్‌ను కూడా చూసి ప్రత్యేకంగా అభినందించారు. వినూత్న ఆలోచనలకు మరింత పదునుపెట్టాలని ఆకాంక్షిస్తూ సిద్ధూకు రూ.లక్ష ప్రోత్సాహకం అందించారు. ఆ సైకిల్‌పై సిద్ధూను కూర్చోబెట్టుకొని పవన్ స్వయంగా నడిపారు.

లిక్కర్ స్కాంలో రజత్ భార్గవ!

(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకున్న దర్యాప్తు అధికారులు వామ్మో అంటూ నోరెళ్లబెట్టారు. ఆయనెవరో కాదు జగన్ పాలనలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన రజత్ భార్గవ. కొన్ని నెలల క్రితం పదవీ విరమణ చేసిన రజత్ భార్గవకు సిట్ నోటీసులు ఇచ్చింది. ఈ నెల 11న విజయవాడలోని సిట్ కార్యాలయానికి విచారణకు రావాలని పేర్కొంది. లిక్కర్ పాలసీ రూపకల్పన ఎలా జరిగింది? డిస్టిలరీస్ కూడా లేని వారికి మద్యం సరఫరా ఆర్డర్లు ఎలా ఇచ్చారు? రాజ్ కసిరెడ్డి అబ్కారీ శాఖను శాసిస్తుంటే ఎందుకు మౌనం వహించాల్సి వచ్చింది? ధరల నియంత్రణ లేకపోవడానికి కారణమేంటి? కొత్త మద్యం బ్రాండ్లకు అనుమతి ఇవ్వడంలో నిబంధనల ఉల్లంఘనను ఎందుకు పట్టించుకోలేదు? సత్య ప్రసాద్ అనే ఒక ఎక్సైజ్ అధికారికి అన్నీ అప్పగించమని చెప్పిందెవరు? ఏ కొత్త బ్రాండ్ మార్కెట్లోకి వచ్చినా మొదటి నెలలో పదివేల బాక్సులకు మించి ఆర్డర్ ఇవ్వరాదన్న నిబంధనను ఆదాన్‌కు ఎందుకు వర్తింప చేయలేదు? మొదటి నెలలోనే 1.80లక్షల కేసుల మద్యం ఆర్డర్లు ఇవ్వడం వెనుక గల కారణాలేంటి? రిటైల్ అవుట్‌లెట్ల నుంచి పెట్టాల్సిన ఆర్డర్లు రాజ్ కసిరెడ్డి ఆదేశాలతో సత్య ప్రసాద్ ద్వారా డిపో మేనేజర్లు పెడుతుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు? ఎవరి సిఫారసు మేరకు అనూషను ఎంఐఎస్ విభాగంలో నియమించారు? అవుట్ సోర్సింగ్ ఉద్యోగి కోసం స్పెషల్ మెమో ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆమె సైఫ్ అహ్మద్‌కు పంపితే రాజ్ కసిరెడ్డికి వివరాలు పంపి ముడుపులు సేకరించిన వైనం.. తదితరాలను సిట్ అధికారులు రజత్ భార్గవ ద్వారా వెలికి తీయబోతున్నారు. మద్యం ఉత్పత్తి, సరఫరాదారులు ఇచ్చిన ముడుపులు ఎవరెవరికి ఇచ్చారు? ఎవరు ఎంత తీసుకున్నారు? అనే విషయాలపై ప్రశ్నించబోతున్నట్లు తెలిసింది. వీటితో పాటు విధాన పరమైన నిర్ణయాలపై ప్రశ్నించి ఆయన ఇచ్చే సమాధానాల తర్వాత చట్టపరమైన చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉంది.

హెల్మెట్ ధరించక గతేడాది 4,276 మంది మృతి!

- ద్విచక్రవాహన ప్రమాదాలపై హైకోర్టు ఆందోళన
- బెజవాడలో హెల్మెట్ ధారణ పెరిగిందని పోలీసులకు ప్రశంస
- అవగాహన కార్యక్రమాలు కొనసాగించాలని నిర్దేశం

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): గతేడాది ద్విచక్ర వాహన ప్రమాదాలలో 4,276 మంది మరణించడంపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీసింది. హెల్మెట్ ధరించే విషయంలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమాలను కొనసాగించాలని పోలీసులకు స్పష్టం చేసింది. విజయవాడలో హెల్మెట్ ధరించేవారి సంఖ్య పెరిగిందంటూ పోలీసుల చర్యలను అభినందించింది. నిబంధనలు అతిక్రమించడం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే దుష్ప్రభావాలపై పత్రికలు, టీవీలలో ప్రకటనలు ఇచ్చేందుకు అవసరమైన నిధుల విడుదలకు సంబంధించి పోలీసుల ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని ఆదేశించింది. ట్రాఫిక్ విధుల్లో ఉన్న పోలీసు అధికారులు బాడీ కెమెరా ధరించడం తప్పనిసరి చేయాలని తాము గతంలో ఇచ్చిన ఉత్తర్వుల అమలుపై స్థాయి నివేదిక సమర్పించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులను ఆటోమేటిక్‌గా గుర్తించేందుకు రాష్ట్రంలోని సీసీ కెమెరాలను ఏపీఫైబర్‌నెట్‌కు అనుసంధానం చేస్తున్నామని, సాఫ్ట్‌వేర్‌ను అప్‌గ్రేడ్ చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో ఏపీ ఫైబర్‌నెట్ ఎండీని వ్యాజ్యంలో ప్రతివాదిగా చేరుస్తున్నట్లు ప్రకటించింది. సీసీకెమెరాల అనుసంధానం, సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ ప్రాజెక్ట్ పురోగతిపై తదుపరి విచారణలోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఫైబర్‌నెట్ ఎండీని ఆదేశించింది. విచారణను ఆగస్టు 20కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. కేంద్ర మోటార్ వాహన సవరణ చట్టం నిబంధనలు అమలు చేయకపోవడంతో పెద్ద ఎత్తున రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, నిబంధనలు ఉల్లంఘించినవారికి జరిమానా విధించడంలేదంటూ న్యాయవాది తాండవ యోగేష్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం మరోసారి విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పోలీసుల తనిఖీలు విజయవాడకే పరిమితమయ్యాయన్నారు. ఇతర జిల్లాల్లో ఎక్కడా ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడం లేదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో హెల్మెట్ పెట్టుకున్నవారిని గ్రహాంతరవాసిగా చూస్తున్నారని వివరించారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి స్పందిస్తూ.. మోటార్ వాహన చట్టాలపై ప్రభుత్వం నిరంతరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు.

'ఆ సర్క్యులర్' మేజిస్ట్రేట్‌లను బెదిరించేలా ఉంది!

- అలాంటి సర్క్యులర్ జారీ సరికాదు
- హైకోర్టుకు సీనియర్ న్యాయవాది

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనుచిత, అభ్యంతరకర పోస్టులు, వ్యాఖ్యలకు సంబంధించి నమోదైన కేసులలో నిందితులకు రిమాండ్ విధించే సమయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచిస్తూ మేజిస్ట్రేట్‌లకు హైకోర్టు ఇటీవల సర్క్యులర్ జారీ చేసింది. అయితే, ఈ సర్క్యులర్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. న్యాయవాది జయంతి ఎస్‌సీ శేఖర్ పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం హైకోర్టు విధులు ప్రారంభమైన వెంటనే న్యాయవాది చాపర్ల సీతారామ్ సర్క్యులర్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభిస్తామని మేజిస్ట్రేట్‌లను బెదిరించేలా సర్క్యులర్ జారీ చేయడం సరికాదన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగానే ఆ సర్క్యులర్ జారీ చేశారని పేర్కొంది. న్యాయవాది సీతారామ్ బదులిస్తూ.. సుప్రీంకోర్టు తీర్పులో మేజిస్ట్రేట్లపై శాఖపరమైన చర్యల గురించే ప్రస్తావించారు తప్ప కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని చెప్పలేదన్నారు. వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని అభ్యర్థించారు. దీంతో ధర్మాసనం ఈ పిటిషన్‌ను లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎన్. సుబ్బారావు వాదనలు వినిపించారు. "హైకోర్టు సర్క్యులర్ సుప్రీం మార్గదర్శకాలకు విరుద్ధం. ఏడేళ్లలోపు జైలుశిక్షకు వీలున్న కేసులలో అర్నేష్ కుమార్ కేసులో ఇచ్చిన మార్గదర్శకాలు వర్తిస్తా యి. సోషల్ మీడియా కేసులలో ఫలానా విధంగానే వ్యవహరించాలని మేజిస్ట్రేట్లను ఆదేశించడం వల్ల తప్పుడు సంకేతాలు వెళ్తాయి' అన్నారు.

నిషేధిత భూముల జాబితాలోకి
సివిల్ కోర్టు ఎటాచ్‌మెంట్లు

- దొంగ రిజిస్ట్రేషన్ల రద్దుకు కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీలు
- ఫ్రాంచైజీ అగ్రిమెంట్ల చార్జీలు పెంపు.. జీవోలు జారీ

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): భూవివాదాలకు సంబంధించి సివిల్ కోర్టులు ఇచ్చే ఎటాచ్‌మెంట్లను నిషేధిత భూముల జాబితాలోని 22సీ విభాగంలో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే కోర్టు ఉత్తర్వుల ద్వారా అటాచ్ చేసిన భూములు రిజిస్ట్రేషన్ చేయరు. కోర్టు ఇచ్చే ఈ ఉత్తర్వు ద్వారా ఒక భూమి లేదా భవనం వంటివి కోర్టు నియంత్రణలోకి వెళ్తాయి. ఇక నుంచి ఈ అటాచ్‌మెంట్ కారణంగా ఆ ఆస్తిని విక్రయించడానికి లేదా బదిలీ చేయడానికి వీలులేకుండా 22సీ విభాగంలో ఉంచుతున్నారు. కాగా, కేఎఫ్‌సీ, డోమినోస్, లెన్స్‌కార్ట్ లాంటి కంపెనీలు ఫ్రాంచైజీలు ఇస్తుంటాయి. ఈ ఫ్రాంచైజీ అగ్రిమెంటు చార్జీలు గతంలో రూ.100 మాత్రమే ఉండేవి. కానీ, ఇప్పుడు ఈ చార్జీలను సవరించారు. లైసెన్సు సమయం ఏడాది లోపు ఉంటే చార్జీలు రూ.1000, ఏడాది నుంచి పదేళ్లలోపు ఉంటే ఏడాదికి రూ.1000 చొప్పున, పదేళ్లకు పైగా ఉంటే రూ.25,000గా నిర్ణయించారు.

బ్రిక్స్ ప్లస్ వర్కింగ్ గ్రూపులో 'విఫ్'

విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన బ్రిక్స్ ప్లస్ మాన్యుఫాక్చరింగ్ గ్రూపునకు విశాఖపట్నం మెడ్‌టెక్ జోన్‌లోని 'వరల్డ్ హెల్త్ ఇన్నోవేషన్ ఫోరం (విఫ్)' ఎంపికైంది. ఈ మేరకు మెడ్‌టెక్ జోన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. బ్రిక్స్ దేశాల మధ్య వైద్య పరికరాల తయారీలో సహకారం, పారిశ్రామిక విధానాలు రూపొందించడానికి ఉపయోగపడుతుందని పేర్కొంది. 2026లో బ్రిక్స్ కార్యకలాపాలకు భారత్ అధ్యక్షత వహించనున్న సమయంలో ఈ అవకాశం రావడం విశేషమని మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్రశర్మ హర్షం వ్యక్తంచేశారు. ప్రపంచ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్న దేశంగానే కాకుండా ఆరోగ్య సంరక్షణకు పరిష్కారాలు సూచించే కేంద్రంగాను గుర్తింపు లభించిందన్నారు.

విశాఖలో ఇసాయ్ ఫార్మా జీసీసీ

- రాష్ట్రప్రభుత్వం సహకరిస్తోంది
- గీతంతో కలిసి పనిచేస్తాం: గ్లోబల్ సీఈవో

విశాఖపట్నం, జూలై 9(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ కేపబులిటీ సెంటర్ (జీసీసీ)ను విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్నామని, దీనికి రాష్ట్రప్రభుత్వం సహకరిస్తోందని ప్రముఖ ఫార్మా కంపెనీ ఇసాయ్ గ్లోబల్ సీఈవో మకోటో హోకెట్స్ ప్రకటించారు. తమ సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన బుధవారం గీతం విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. విశాఖ ఎంపీ, గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్, గీతం కార్యదర్శి భరద్వాజ, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా, ప్రొ-వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హోకెట్స్ మాట్లాడుతూ.. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఔషధాల తయారీని విస్తృతం చేయడానికే విశాఖలో జీసీసీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి అవసరమైన పరిశోధనలు, మానవ వనరుల సహకారానికి గీతం వర్సిటీతో కలిసి పనిచేస్తామని చెప్పారు. శ్రీభరత్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కృషి వల్ల విశాఖలో టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ వంటి సంస్థలు త్వరలో కార్యకలాపాలు ప్రారంభించనున్నాయని.. ఇసాయ్ జీసీసీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. విశాఖలో ఫైజర్, దివీస్, లారస్ ల్యాబ్స్ వంటి సంస్థలకు అవసరమైన కోర్సులను తాము ఇప్పటివరకూ రూపకల్పన చేశామని వీసీ తెలిపారు. సమావేశంలో గీతం సీనియర్ ప్రొఫెసర్లు అరుణ్‌కుమార్, శాంతి, భరణి చంద్రకుమార్, ఐటీ విభాగం డైరెక్టర్ సాయిరామ్, ఇసాయ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, విశాఖ యూనిట్ అధిపతి గిరీశ్ దీక్షిత్ పాల్గొన్నారు.

రైతులను సంతృప్తి పరిచాకే 'ఇండోసోల్'కు భూసేకరణ!

- కరేడు గ్రామ ప్రజలందరి సహకారంతోనే ముందుకెళ్తాం
- 'ఆంధ్రజ్యోతి'తో కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ



(కందుకూరు-ఆంధ్రజ్యోతి)

ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటు కోసం నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో భూసేకరణ ప్రక్రియను అక్కడి రైతులకు అర్థమయ్యేలా వారి సందేహాలు నివృత్తిచేసి, ప్రజల సహకారంతోనే ముందుకు వెళతామని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమాణి శ్రీపూజ చెప్పారు. కొందరిలో భూములకు సరైన ధర రాదన్న ఆందోళన, మత్స్యకారుల్లో చేపల వేటకు అవకాశం ఉండదేమోనన్న భయాందోళన, కొన్ని కాలనీలు ఖాళీ చేయాల్సి ఉన్నందున వారికి ఎక్కడ పునరావాసం చూపిస్తారోనన్న సందేహం నెలకొన్నాయని తెలిపారు. వీటన్నిటికీ స్పష్టమైన హామీలు ఇవ్వడం, వారిలో నమ్మకం కల్పించి, వారి ఆమోదంతోనే భూసేకరణ ప్రక్రియను కొనసాగించనున్నట్లు చెప్పారు. రైతుల ఆందోళనలు, వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదించామని, ఈ సమస్యపై ఉన్నతస్థాయిలోనూ చర్చ జరుగుతోందని వివరించారు. కరేడులో భూసేకరణను గ్రామం యావత్తూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ ఆందోళన బాటపట్టడం, భూములు ఇచ్చేదిలేదని గ్రామసభల్లోనూ ఏకగ్రీవ తీర్మానం చేసిన నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' అడిగిన పలు ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలు ఆమె మాటల్లోనే...

కరేడులో భూసేకరణ ప్రక్రియపై తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది కదా!

ప్రస్తుతానికి భూసేకరణ ప్రక్రియ యథావిధిగా నడుస్తోంది. రైతులకు సంతృప్తికరమైన సమాధానాలు ఇచ్చి వారి సహకారంతోనే భూసేకరణ ప్రక్రియను కొనసాగిస్తాం.

భూములు ఇచ్చేదిలేదని గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు కదా!

ఈ సమస్యపై ఉన్నతస్థాయిలో కూడా చర్చ జరుగుతోంది.

రైతులంతా వ్యక్తిగతంగా మీకు అర్జీలు అందజేశారా?

573 మంది రైతులు అర్జీలు ఇచ్చారు. ప్రతిఒక్కరికీ వ్యక్తిగతంగా వారు తెలిపిన అభ్యంతరానికి భూసేకరణ అధికారి సమాధానం పంపిస్తాం.

భూముల ధర ఎలా నిర్ణయించారు?

మెట్ట, మాగాణి భూమికి రూ.15 లక్షలు, తోటలకు రూ.17 లక్షలు, జాతీయ రహదారి పక్కనుండే భూములకు రూ.60 లక్షలు పరిహారం అందే అవకాశం ఉంది. అయితే మూడేళ్లలో జరిగిన రిజిస్ట్రేషన్ల ఆధారంగా సేల్‌వాల్యూలను చూసి సరాసరి చేసి రైతుల అభీష్టంమేరకు కొంత నెగోషియేట్ చేసి ధర నిర్ణయించే అవకాశం ఉంటుంది.

అమెరికాలో ధరలు పెంచేస్తాం

టారిఫ్‌ల పెంపునకు ఫార్మా కంపెనీల ప్రతిస్పందన




న్యూఢిల్లీ: ట్రంప్ యంత్రాంగం ఔషధ దిగుమతులపై 200% సుంకాలు విధించినట్టయితే అమెరికన్ మార్కెట్లో తమ ఉత్పత్తుల ధరలు పెంచక తప్పదని ఫార్మా పరిశ్రమ హెచ్చరించింది. అయితే ప్రస్తుతానికి అది హెచ్చరిక మాత్రమేనని, టారిఫ్‌ల పెంపు ఆ స్థాయిలో ఉండకపోవచ్చునని పేర్కొంటూ అలాంటి నిర్ణయం గనుక తీసుకున్నట్టయితే తాము ధరలు పెంచుతామని, అది అమెరికన్ వినియోగదారులకు భారం కాక తప్పదని పరిశ్రమ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఒకరన్నారు. సుంకాలు పెంచితే అమెరికాలో హెల్త్‌కేర్ సంబంధిత ద్రవ్యోల్బణం గణనీయంగా పెరుగుతుందంటున్నారు.

మార్జిన్ల ఒత్తిడి తప్పదు: చిన్న ఫార్మా కంపెనీలు అతి తక్కువ మార్జిన్‌తో అమెరికాకు ఔషధాలు సరఫరా చేస్తున్నాయని, వాటిపై మార్జిన్ల ఒత్తిడి విపరీతంగా పెరుగుతుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం అమెరికా నుంచి దిగుమతి అయ్యే ఔషధాలపై భారత్ 10% సుంకాలు వసూలు చేస్తుండగా అమెరికా ఎలాంటి సుంకాలు విధించడంలేదు. భారత ఫార్మా కంపెనీలకు అమెరికా కీలక మార్కెట్ అని, వాటి మొత్తం ఆదాయంలో 30-40% అమెరికన్ మార్కెట్ నుంచే వస్తుందని ఇక్రా వైస్ ప్రెసిడెంట్, ఫార్మా హెడ్ దీపక్ జోత్వానీ అన్నారు. భారత ఫార్మా కంపెనీలు ప్రధానంగా జెనరిక్ ఔషధాలు అమెరికన్ మార్కెట్‌కు సరఫరా చేస్తాయని, ఆ విభాగంలో తీవ్రమైన పోటీని ఎదుర్కొంటున్నాయని ఆయన చెప్పారు. అధిక టారిఫ్‌ల వల్ల ఫార్మా రంగంలో ఎగుమతుల వృద్ధి, లాభదాయకత రెండూ ప్రభావితం అవుతాయన్నారు. భారత కంపెనీలు సరఫరా చేసిన ఔషధాల వల్ల 2022 సంవత్సరంలో అమెరికన్ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు 21,900 కోట్ల డాలర్లు (రూ.18.83 లక్షల కోట్లు) ఆదా అయినట్టు గణాంకాలు తెలుపుతున్నాయి.

మాపై పెద్ద ప్రభావం ఉండదు

అమెరికా ప్రతిపాదించిన మేరకు రాగిపై 50% సుంకాలు విధించినా ఆ ప్రభావం తమపై పెద్దగా ఉండదని ఇంటర్నేషనల్ కాపర్ అసోసియేషన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మయూర్ కర్మార్కర్ అన్నారు. భారత్ రాగి కొరత దేశమని, అందువల్ల అమెరికాకు తమ ఎగుమతులు కేవలం 10 వేల టన్నులేనని ఆయన చెప్పారు. భారత్ పునరుత్పాదక ఇంధనం, ఈవీలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తున్నందు వల్ల దేశీయంగానే డిమాండు అధికంగా ఉన్నదన్న విషయం ఆయన గుర్తు చేశారు.

సామ్‌సంగ్ నుంచి ఏడో తరం ఫోల్డబుల్ ఫోన్లు

ప్రారంభ ధర రూ.89,999



న్యూయార్క్: దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్ దిగ్గజం సామ్‌సంగ్ తన ఫోల్డబుల్ (మడత పెట్టగలిగే) గెలాక్సీ సిరీస్‌లో ఏడో తరం మోడళ్లను విడుదల చేసింది. గెలాక్సీ జెడ్ ఫోల్డ్7, గెలాక్సీ జెడ్ ఫ్లిప్7 తో పాటు గెలాక్సీ జెడ్ ఫ్లిప్7 ఎఫ్‌ఈ ఫోన్లను అమెరికాలోని బ్రూక్లిన్‌లో ఆవిష్కరించింది. సామ్‌సంగ్ ఇప్పటివరకు మార్కెట్లోకి ప్రవేశపెట్టిన ఫోల్డబుల్ ఫోన్లలో ఫోల్డ్7 అత్యంత సన్నదైన, తేలికపాటి మోడల్. స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ ప్రాసెసర్, 8 అంగుళాల డిస్‌ప్లే, 200 మెగాపిక్సెల్ వైడ్ యాంగిల్ కెమెరాతో కూడిన ఈ ఫోన్ కేవలం 215 గ్రాముల బరువు, మడత పెట్టినప్పుడు 8.9 మిల్లీమీటర్ల మందం కలిగి ఉంటుందని కంపెనీ తెలిపింది. బుధవారం నుంచి ప్రీ-బుకింగ్‌ను ప్రారంభించిన కంపెనీ.. ఈనెల 25 నుంచి విక్రయాలు ప్రారంభించనున్నట్లు తెలిపింది. భారత మార్కెట్లో ఫోల్డ్7 ధర రూ.1,74,999 నుంచి ప్రారంభం కానుండగా.. ఫ్లిప్7 ప్రారంభ ధర రూ.1,09,999గా ఉంది. ఫ్లిప్7 ఎఫ్‌ఈ రేటు రూ.89,999 నుంచి ప్రారంభమవుతుంది.

4 లక్షల కోట్ల డాలర్లకు ఎన్‌విడియా మార్కెట్ క్యాప్

న్యూయార్క్: అమెరికా టెక్ దిగ్గజం ఎన్‌విడియా షేర్లు స్టాక్‌మార్కెట్‌లో రికార్డులు సృష్టిస్తున్నాయి. బుధవారం కంపెనీ షేర్లు 2.5 శాతం లాభంతో 164 డాలర్లకు చేరాయి. దీంతో కంపెనీ షేర్ల మార్కెట్ విలువ రికార్డు స్థాయిలో నాలుగు లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.342.6 లక్షల కోట్లు) చేరింది. ప్రపంచ స్టాక్ మార్కెట్ చరిత్రలో ఇప్పటి వరకు ఏ కంపెనీ షేర్ల మార్కెట్ క్యాప్ ఈ స్థాయికి చేరలేదు. 2023 ప్రారంభంలో 14 డాలర్ల వద్ద ట్రేడైన ఎన్‌విడియా షేర్లు ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏఐ) బూమ్‌తో 164 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి. రెండేళ్లలోనే ఎన్‌విడియా షేర్ల మార్కెట్ క్యాప్ 60,000 కోట్ల డాలర్ల నుంచి నాలుగు లక్షల కోట్ల డాలర్లకు చేరడం విశేషం.

హైదరాబాద్ స్టార్టప్‌లో ఇండిగో వెంచర్స్ పెట్టుబడి

ముంబై: హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ కంపెనీ జే ఏరోస్పేస్‌లో పెట్టుబడి పెట్టినట్టు ఇండిగో విమానయాన సంస్థ అనుబంధ వెంచర్ క్యాపిటల్ విభాగం ఇండిగో వెంచర్స్ ప్రకటించింది. అయితే ఎంత మొత్తం పెట్టుబడి పెట్టిందీ వెల్లడించలేదు. జే ఏరోస్పేస్ కంపెనీ ఈ నిధులను డిజిటల్ ఉత్పత్తి సామర్థ్యాల పెంపుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఏఐ ఆధారిత ఉత్పత్తి విధానాలు, నిపుణులైన ఉద్యోగుల నియామకానికి ఉపయోగించుకుంటుందంటున్నారు. ప్రారంభ దశలో ఉన్న స్టార్టప్స్‌లో పెట్టుబడి పెట్టేందుకు తాము లక్ష్యంగా పెట్టుకున్న రూ.600 కోట్లలో ఇప్పటికే రూ.450 కోట్లు సమీకరించినట్టు ఇండిగో వెంచర్స్ తెలిపింది.

అదానీ ఎన్‌సీడీ సూపర్ హిట్

న్యూఢిల్లీ: అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.1,000 కోట్ల సమీకరణ కోసం బుధవారం జారీ చేసిన నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ (ఎన్‌సీడీ) ఇష్యూ సూపర్ డూపర్ హిట్టయింది. ఇష్యూ ప్రారంభమైన మూడు గంటల్లోనే ఇష్యూ మొత్తం సబ్‌స్క్రైబ్ అయింది. మధ్యాహ్నం 3.30 గంటల కల్లా రూ.1,400 కోట్లకు బిడ్స్ అందాయి. ఏటా 9.3 శాతం వడ్డీతో రెండేళ్లు, మూడేళ్లు, ఐదేళ్ల కాలపరిమితితో ఏఈఎల్ ఈ ఎన్‌సీడీలను జారీ చేసింది.

ఐపీఓ సమాచారం

● అంతెం బయోసైన్సెస్ సంస్థ ఈ నెల 14న జారీ చేస్తున్న ఐపీఓలో షేర్ల ధర శ్రేణిని రూ.540-570గా నిర్ణయించింది.

● గురువారం నుంచి ప్రారంభం కానున్న స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేస్ ఐపీఓలో షేరు ధరను రూ.387-407గా నిర్ణయించారు.

వేదాంత ఓ పేక మేడ!



భరించలేని స్థాయికి అప్పుల భారం.. రుణదాతలకు గండమే..

- అమెరికన్ షార్ట్ సెల్లర్ వైస్రాయ్ రీసెర్చ్ నివేదిక
- ఒకదశలో 8% పతనమైన వేదాంత లిమిటెడ్ షేరు

న్యూఢిల్లీ: రెండున్నరేళ్ల క్రితం అమెరికన్ షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్.. అదానీ గ్రూప్‌పై అకౌంటింగ్ అక్రమాల ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరో అమెరికన్ షార్ట్ సెల్లర్ వైస్రాయ్ రీసెర్చ్.. ప్రవాస భారతీయ పారిశ్రామికవేత్త అనిల్ అగర్వాల్‌కు చెందిన వేదాంత గ్రూప్‌ను లక్ష్యంగా చేసుకుని ఓ నివేదిక విడుదల చేసింది. వేదాంత గ్రూప్ భరించలేని అప్పులు, నిధుల దోపిడీ, అకౌంటింగ్ అవకతవకల పునాదులపై నిర్మించిన ఓ పేక మేడ అని, ఎప్పుడైనా కూలవచ్చని వైస్రాయ్ రీసెర్చ్ అంటోంది. ఆర్థికంగా నిలకడ తప్పిన, వ్యాపార కార్యకలాపాల్లోనూ రాజీపడిన ఈ గ్రూప్‌తో రుణదాతలకు గండమేనని పేర్కొంది. గ్రూప్ కార్యకలాపాలు పోంజీ స్కీమ్‌ను తలపిస్తున్నాయంది. బ్రిటన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న గ్రూప్ హోల్డింగ్ కంపెనీ వేదాంత రిసోర్సెస్‌ను (వీఆర్‌ఎల్) సొంత కార్యకలాపాల్లేని ఓ పరాన్న జీవిగా అభివర్ణించింది. అప్పులు తిరిగి చెల్లించేందుకు ఈ కంపెనీ భారత అనుబంధ విభాగమైన వేదాంత లిమిటెడ్ నిధులను క్రమంగా పీల్చి పిప్పి చేస్తోందంటూ బుధవారం విడుదల చేసిన 85 పేజీల నివేదికలో వైస్రాయ్ రీసెర్చ్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో వీఆర్‌ఎల్‌కు చెందిన బాండ్లు, ఇతర రుణ సాధనాలపై షార్ట్ పొజిషన్లు తీసుకున్నట్లు వెల్లడించింది.

ఆ ఆరోపణలు నిరాధారం: వేదాంత

వేదాంత గ్రూప్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. వైస్రాయ్ రీసెర్చ్‌వి నిరాధార ఆరోపణలని, తమను సంప్రదించకుండానే ఎంపిక చేసిన తప్పుడు సమాచారంతో నివేదికను విడుదల చేసిందని అంటోంది. ఇది తమ గ్రూప్‌ను అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నమేనని పేర్కొంది.

వేదాంత షేరు ఢమాల్

వైస్రాయ్ రీసెర్చ్ ఆరోపణల నేపథ్యంలో వేదాంత లిమిటెడ్ షేరు బీఎస్ఈలో ఒకదశలో 7.71 శాతం పతనమై రూ.421 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. మళ్లీ కాస్త కుదురుకుని చివరికి 3.38 శాతం నష్టంతో రూ.440.80 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.6,022 కోట్ల మేర తగ్గి రూ.1.72 లక్షల కోట్లకు పడిపోయింది.

నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు

● గత 4 ఆర్థిక సంవత్సరాల్లో వేదాంత లిమిటెడ్ రూ.75,800 కోట్ల డివిడెండ్ చెల్లించగా.. గ్రూప్‌నకు చెందిన మరో కంపెనీ హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జెడ్‌ఎల్) రూ.57,300 కోట్ల డివిడెండ్ చెల్లింపులు జరిపింది. కాగా, వేదాంత లిమిటెడ్ జరిపిన డివిడెండ్ చెల్లింపుల్లో ఈక్విటీ వాటాకు అనుగుణంగా 56.38 శాతం నిధులు మాతృసంస్థ వేదాంత రిసోర్సెస్ లిమిటెడ్‌కు (వీఆర్‌ఎల్) లభించాయి. హెచ్‌జెడ్‌ఎల్ డివిడెండ్ చెల్లింపుల్లోనూ 61.62 శాతం వీఆర్‌ఎల్‌కే దక్కాయి.

● గత మూడేళ్లలో డివిడెండ్ చెల్లింపుల కారణంగా వేదాంత లిమిటెడ్ నగదు ప్రవాహ లోటు 560 కోట్ల డాలర్లకు చేరింది. 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి వేదాంత లిమిటెడ్ నికర రుణ భారం దాదాపు 200 శాతం పెరిగి 670 కోట్ల డాలర్లకు చేరుకుంది. నగదు నిల్వలు క్షీణించడంతో కంపెనీ మరిన్ని రుణాలను సేకరించే సామర్థ్యాన్ని, నిర్వహణ మూలధన వస్తువులను నగదీకరించుకునే సామర్థ్యాన్ని కోల్పోయింది.


● అదే సమయంలో వీఆర్‌ఎల్ రుణ వడ్డీ వ్యయాలు ఏటా 20 కోట్ల డాలర్ల చొప్పున పెరిగాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 490 కోట్ల డాలర్ల స్థూల రుణంపై 15.8 శాతం వార్షిక వడ్డీ భారంతో మొత్తం వడ్డీ వ్యయాలు 83.5 కోట్లకు చేరాయని కంపెనీ వెల్లడించింది.

● వేదాంత కీలక అనుబంధ సంస్థల్లో ఆర్థికంగా లాభదాయకం కాని ఆస్తులు, వెల్లడించని అప్పులు, వ్యవస్థాగత మోసం, పాలన వైఫల్యాలున్నట్లు మా ఫోరెన్సిక్ దర్యాప్తులో తేలింది. వేదాంత గణాంకాలన్నీ అభూత కల్పనలే.

అమెరికా నుంచి గ్రాన్యూల్స్ ఔషధం రీకాల్

న్యూఢిల్లీ: గ్రాన్యూల్స్ ఇండియా రక్తపోటును తగ్గించే మెటోప్రోలాల్ సక్సనేట్ ఎక్స్‌టెండెడ్ రిలీజ్ టాబ్లెట్స్ 33,000 బాటిల్స్‌ను అమెరికన్ మార్కెట్ నుంచి రీకాల్ చేసింది. తయారీ లోపాలున్నట్టుగా గుర్తించినందు వల్ల ఈ చర్య తీసుకున్నట్టు అమెరికన్ డ్రగ్ రెగ్యులేటర్ యూఎస్ఎఫ్‌డీఏ ప్రకటించింది. భారత్‌లో తయారైన ఈ టాబ్లెట్లు పూర్తిగా నీటిలో కరగలేదని, ఇది వినియోగదారుల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని ఎఫ్‌డీఏ తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	540
వరంగల్	512	గోదావరి	515
చిత్తూరు	613	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	102
వరంగల్	100	గుంటూరు	107
కరీంనగర్	100	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	105
కర్నూలు	100	నెల్లూరు	110
విశాఖపట్నం	86	అనంతపురం	110
గోదావరి	102		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,180 ▼	90,000 ▼	1,20,000 ▲
విజయవాడ	98,950 ▼	96,000 ▲	1,10,000 ▼
విశాఖపట్నం	99,150 ▼	90,000 ▼	1,20,000 ▼
రాజమండ్రి	98,180 ▼	90,000 ▼	1,11,000 ▲
ప్రొద్దుటూరు	96,700 ▼	88,960 ▼	1,08,500 ▼
ముంబై	96,090 ▼	88,010 ▼	1,07,280 ▼

నీరసించిన స్టాక్ మార్కెట్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ బుధవారం నీరసించింది. సెన్సెక్స్ 176.43 పాయింట్ల నష్టంతో 93,536.08 వద్ద ముగియగా నిఫ్టీ 46.40 పాయింట్ల నష్టంతో 25,476.10 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఒక దశలో 330.23 పాయింట్ల వరకు నష్టపోయి 83,382.28 పాయింట్ల ఇంట్రా డే కనిష్ఠ స్థాయిని తాకింది. ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి, అంతర్జాతీయ సంకేతాలు మిశ్రమంగా ఉండడం బుధవారం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. క్యూ1 ఆర్థిక ఫలితాలు ఎలా ఉంటాయోననే భయాలూ మార్కెట్‌ను వెంటాడాయి.

స్కోడా గ్రూపుతో టాటా ఆటోకాంప్ జేవీ

న్యూఢిల్లీ : రైల్వేలకు అవసరమైన అధునాతన యంత్రపరికరాలు, విడి భాగాల తయారీ కోసం టాటా గ్రూప్ చెక్ రిపబ్లిక్‌కు చెదిన స్కోడా గ్రూప్‌తో చేతులు కలిపింది. ఇందుకోసం ఒక జాయింట్ వెంచర్ (జేవీ) కంపెనీని ఏర్పాటు చేసినట్టు టాటా ఆటోకాంప్ తెలిపింది. ఈ జేవీ ద్వారా రైలు ఇంజిన్లు, కోచ్‌లు, అవసరమైన ఇతర కీలక విడి భాగాలనూ భారత్‌లో తయారు చేయబోతున్నట్టు ప్రకటించింది. ఈ జేవీ కోసం పెద్ద మొత్తంలోనే పెట్టుబడులు పెట్టనున్నట్టు తెలిపింది. భారత్‌లో పెరుగుతున్న రైలు రవాణాను దృష్టిలో ఉంచుకుని స్కోడా గ్రూప్‌తో కలిసి ఈ జేవీ ఏర్పాటు చేసినట్టు టాటా ఆటోకాంప్ తెలిపింది.

ఎవరో 'లార్డ్స్' కింగ్?

నేటి నుంచి మూడో టెస్ట్
మ. 3.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



- పుల్‌జోష్‌లో భారత్
- బుమ్రా ఎంట్రీ ఖరారు
- పుంజుకోవాలని ఇంగ్లండ్
- తుదిజట్టులోకి ఆర్చర్

గిల్

లండన్: తొలి టెస్ట్‌లో ఓటమితో తీవ్ర ఒత్తిడి.. మ్యాచ్‌ను మలుపుతిప్పగల బుమ్రాకు విశ్రాంతి.. ఈ పరిస్థితుల్లో భారత జట్టు పుంజుకోవడం కష్టమేనన్న విమర్శలు..! అయితే, శుభ్‌మన్ గిల్ సేన రెండో టెస్ట్‌లో ఇంగ్లండ్‌ను చిత్తు చేసి.. ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి విజయాన్ని దక్కించుకొంది. గిల్ సూపర్ బ్యాటింగ్.. పేసర్ ఆకాశ్‌దీప్ అద్భుత బౌలింగ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసి ప్రత్యర్థితో ఢీ అంటే ఢీ అనే స్థాయికి చేరింది. ఇదే జోష్‌లో గురువారం నుంచి ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో జరిగే మూడో టెస్ట్‌లో గెలుపే లక్ష్యంగా టీమిండియా బరిలోకి దిగుతోంది. బుమ్రా రీఎంట్రీతో.. తడబడుతున్న ఇంగ్లండ్‌కు కఠిన పరీక్ష ఎదురయ్యే అవకాశం ఉంది. నయా కెప్టెన్ గిల్ సారథ్యంలోని యువ భారత్.. లీడ్స్‌లోనూ పైచేయి సాధించినా కీలక సమయంలో క్యాచ్‌లు చేజార్చడం జట్టుకు శాపంగా మారింది. కానీ, దీని నుంచి వేగంగా పాఠాలు నేర్చిన భారత్.. రెండో టెస్ట్‌లో ప్రతి సెషన్‌లోనూ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. బ్యాట్‌తో చెలరేగిన గిల్ అండ్ కో కొండంత స్కోర్లు చేయడంతో.. ప్రత్యర్థి కెప్టెన్ బెన్ స్టోక్స్ జీవమున్న పిచ్ కోసం డిమాండ్ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో లార్డ్స్‌లో సీమ్ బౌలర్లకు అనుకూలించే పిచ్‌ను రూపొందించే విధంగా ఒత్తిడి చేశారని సమాచారం. మరోవైపు బుమ్రా రాకతో ఇంగ్లండ్ బ్యాటర్ల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. కరుణ్ నాయర్ వైఫల్యం మినహా భారత బ్యాటింగ్‌లో చెప్పుకోదగ్గ ఆందోళనకర పరిస్థితులు లేవు. గిల్ సూపర్ ఫామ్ జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. జైస్వాల్, రాహుల్, పంత్, జడేజా రాణిస్తుండడం శుభపరిణామం. గత మ్యాచ్‌లో పేసర్లు ఆకాశ్‌దీప్, సిరాజ్ రాణించగా.. ధారాళంగా పరుగులిచ్చిన ప్రసిద్ధ్ కృష్ణను బుమ్రా కోసం పక్కనపెట్టే అవకాశం ఉంది. ఆల్‌రౌండర్లుగా జడేజా, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్‌ను కొనసాగించే చాన్సులున్నాయి.

ఆర్చర్ రాక..: మరోవైపు రెండో టెస్టులో భారీ ఓటమితో ఇంగ్లండ్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓపెనర్లు క్రాలే, డకెట్ వైఫల్యం జట్టుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రూట్ కూడా ఆశించిన స్థాయి ప్రదర్శన చేయలేక పోతున్నాడు. ఆల్‌రౌండర్ స్టోక్స్ బంతితో ఫర్వాలేదనిపిస్తున్నా.. బ్యాట్‌తో తేలిపోతున్నాడు. అయితే, బ్రూక్, జేమీ స్మిత్ టచ్‌తో ఉండడం కొంత ఊరటనిచ్చే అంశం. నాలుగేళ్ల తర్వాత జోఫ్రా ఆర్చర్ టీమ్‌లోకి రావడంతో బౌలింగ్ కొంత మెరుగుపడే అవకాశం ఉంది.

నేటినుంచి సోనీ స్పోర్ట్స్ తెలుగు చానెల్ అందుబాటులోకి రానుంది. భారత్-ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్ ఈ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది.



కోచ్ మెకల్లమ్‌తో ఆర్చర్

జట్లు

ఇంగ్లండ్ (తుది జట్టు): బెన్ స్టోక్స్ (కెప్టెన్), జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్ (వికెట్ కీపర్), క్రిస్ వోక్స్, కార్స్, ఆర్చర్, బషీర్.

భారత్ (అంచనా): యశస్వీ జైస్వాల్, రాహుల్, కరుణ్ నాయర్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్, జడేజా, నితీశ్, సుందర్, బుమ్రా, సిరాజ్, ఆకాశ్‌దీప్.

పిచ్/వాతావరణం

వికెట్‌పై పచ్చిక ఉండడంతో పేసర్లకు కొంత అనుకూలించనుంది. ఇటీవలే జరిగిన డబ్ల్యూటీసీ ఫైనల్లో బౌలర్ల ఆధిపత్యమే కనిపించింది. ఈ మ్యాచ్‌లో కూడా అలాగే జరిగే పరిస్థితులున్నాయి. మ్యాచ్ సాగే కొద్దీ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారే చాన్సులున్నాయి. వాతావరణం సాధారణంగా పొడిగా ఉండనుంది. టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకొనే అవకాశం ఉంది.

3 లార్డ్స్‌లో ఇరు జట్లు 19 సార్లు తలపడితే.. భారత్ 3 మ్యాచ్‌లు మాత్రమే గెలిచింది. ఇంగ్లండ్ 12 టెస్ట్‌లు నెగ్గగా.. 4 మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి.

18 ఇంగ్లండ్‌పై ఓ సిరీస్‌లో అత్యధిక పరుగులు సాధించిన భారత బ్యాటర్ రాహుల్ ద్రవిడ్ (602) రికార్డును అధిగమించడానికి గిల్ (585)కు కావాల్సిన పరుగులు.

మా వ్యూహాలు మాకున్నాయి: స్టోక్స్

అద్భుతంగా ఆడుతున్న గిల్‌తోపాటు భారత బ్యాటర్లను కట్టడి చేయగల వ్యూహాలు మాకున్నాయి. ఆర్చర్ రాకతో బౌలింగ్ మెరుగుపడనుంది. ప్రత్యర్థులను అతడు ఇబ్బందులకు గురి చేయగలడు.

టాప్-10లో తొలిసారి..

గిల్‌కు ఆరో ర్యాంక్
ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్

దుబాయ్: ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ర్యాంకింగ్స్‌లోనూ దూసుకెళ్లాడు. బుధవారం ప్రకటించిన ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ బ్యాటర్ల విభాగంలో గిల్ తొలిసారి టాప్-10లోకి దూసుకొచ్చాడు. తాజా ర్యాంకింగ్స్‌లో గిల్ ఏకంగా 15 స్థానాలు ఎగబాకాడు. ఫలితంగా 6వ ర్యాంక్‌లో నిలిచి కెరీర్ బెస్ట్ అందుకున్నాడు. అంతకుముందు టెస్టుల్లో గిల్ అత్యుత్తమ ర్యాంక్ 14 (2023 సెప్టెంబరులో) మాత్రమే. యశస్వీ జైస్వాల్ 4వ ర్యాంక్‌తో భారత్ నుంచి టాప్‌లో ఉన్నాడు. ఇంగ్లండ్ స్టార్ హ్యారీ బ్రూక్ నెంబర్‌వన్ బ్యాటర్‌గా కొనసాగుతుండగా.. జో రూట్ (ఇంగ్లండ్), కేన్ విలియమ్సన్ (న్యూజి లాండ్) వరుసగా 2, 3 స్థానాల్లో ఉన్నారు. బౌలర్లలో బుమ్రా టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకోగా, సిరాజ్ 22వ స్థానానికి ఎగబాకాడు. ఆల్‌రౌండర్లలో జడేజా అగ్రస్థానంలో మార్పు లేదు.

జ్యోతి సురేఖ జోడీ ప్రపంచ రికార్డు




మాడ్రిడ్: తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ/రిషభ్ యాదవ్ ద్వయం కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ప్రపంచ రికార్డు తిరగరాసింది. వరల్డ్ కప్ ఆర్చరీ నాలుగో దశలో భాగంగా బుధవారం జరిగిన మిక్స్‌డ్ టీమ్ విభాగం క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత జోడీ సంయుక్తంగా 1431 పాయింట్లు సాధించారు. వీటిలో జ్యోతి సురేఖ 715, రిషభ్ 716 పాయింట్లతో నిలిచారు. దాంతో డెన్మార్క్ ద్వయం గెలెంతియన్/ఫుల్లెర్టన్ పేరిట 1429 పాయింట్లతో 2023 నుంచి ఉన్న గత వరల్డ్ రికార్డు తుడిచి పెట్టుకుపోయింది. ఇక..కాంపౌండ్ మహిళల జట్టు ఫైనల్‌కు దూసుకుపోవడంతో భారత్‌కు ఒక పతకం ఖరారైంది. మరోవైపు పురుషుల జట్టు క్వార్టర్‌ఫైనల్లో పరాజయం చవిచూసింది. జ్యోతి సురేఖ, ప్రణీత్ కౌర్, ప్రతీకతో కూడిన భారత త్రయం సెమీఫైనల్లో 230-226తో ఇండోనేసియాను ఓడించింది. స్వర్ణం కోసం శనివారం జరిగే పోరులో 10వ సీడ్ చైనీస్ తైపీ జట్టుతో జ్యోతి త్రయం తలపడనుంది.

స్వియటెక్ అదుర్స్

- తొలిసారి సెమీస్‌లో ప్రవేశం
- బెన్సిక్‌తో అమీతుమీ
- పురుషుల సెమీస్‌లో సినర్, జొకోవిచ్



బెన్సిక్



స్వియటెక్

లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్‌లో ఎనిమిదో సీడ్ ఇగా స్వియటెక్ మొదటిసారి సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. ఫైనల్లో చోటు కోసం అన్‌సీడెడ్ బెలిండా బెన్సిక్‌తో ఈ పోలెండ్ భామ గురువారం అమీతుమీ తేల్చుకోనుంది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో స్వియటెక్ 6-2, 7-5తో వరుస సెట్లలో 19వ సీడ్ లుడ్మిలా సంసనోవా (రష్యా)పై విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన మరో క్వార్టర్‌ఫైనల్లో బెలిండా బెన్సిక్ (స్విట్జర్లాండ్) 7-6 (3), 7-6 (2)తో ఏడో సీడ్, టీనేజర్ ఆండ్రీవా (రష్యా)కు షాకిచ్చింది. మహిళల మరో సెమీఫైనల్లో టాప్ సీడ్ సబలెంక (బెలారస్)-13వ సీడ్ అమండా అనిసిమోవా (అమెరికా) తలపడనున్నారు. స్వియటెక్ ఐదు గ్రాండ్‌స్లామ్‌లు సొంతం చేసుకున్నా... అందులో నాలుగు టైటిళ్లు మట్టి కోర్టు అయిన ఫ్రెంచ్ ఓపెన్‌లో సాధించినవే. మరొకటి హార్డ్‌కోర్ట్ అయిన యూఎస్ ఓపెన్‌లో గెలిచింది. అలాగే హార్డ్ కోర్టులపై సాగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆమె రెండుసార్లు సెమీస్‌కు చేరింది. కానీ పచ్చికపై ఆడే వింబుల్డన్‌లో స్వియటెక్ గతంలో ఐదుసార్లు తలపడినా..ఒక్కసారే క్వార్టర్‌ఫైనల్ వరకు రాగలిగింది.

సినర్‌తో జొకో ఢీ

పురుషుల టాప్ సీడ్ యానిక్ సినర్, ఆరో సీడ్ నొవాక్ జొకోవిచ్ సెమీఫైనల్లో అడుగుపెట్టారు. క్వార్టర్‌ఫైనల్లో సినర్ (ఇటలీ) 7-6 (2), 6-4 6-4తో 10వ సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా)ను చిత్తు చేశాడు. గాయంతో బాధపడుతూ కూడా మ్యాచ్‌ను సినర్ వరుస సెట్లలో ముగించడం విశేషం. మరో క్వార్టర్‌ఫైనల్లో జొకోవిచ్ 6-7(8), 6-2, 7-5, 6-4తో 22వ సీడ్ ఫ్లావియో కొబొల్లి (ఇటలీ)పై గెలిచి వరుసగా ఏడోసారి సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో సినర్‌తో జొకోవిచ్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. మరో సెమీస్‌లో డిఫెండింగ్ చాంప్ అల్కారజ్, ఐదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ పోటీపడనున్నారు.

హంపి, హారిక గెలుపు

మహిళల చెస్ ప్రపంచ కప్



బతుమి (జార్జియా): భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక మహిళల వరల్డ్ కప్ రెండో రౌండ్ తొలి గేమ్‌లో విజయం సాధించారు. బుధవారం జరిగిన మొదటి గేమ్‌లో అఫ్రూజ (ఉజ్బెకిస్థాన్)పై హంపి గెలుపొందింది. ఇక, భారత్‌కే చెందిన నందిదాను హారిక ఓడించింది. మరో గ్రాండ్‌మాస్టర్ వంతిక అగర్వాల్-అనా ఉషీనినా (ఉక్రెయిన్)పై నెగ్గగా, క్విలెట్ మెయిలీ (కెనడా)పై వైశాలి, కేసరియా (జార్జియా)పై దివ్యా దేశ్‌ముఖ్ గెలిచారు.

గడ్డం నెరిసింది.. అందుకే రిటైర్మెంట్!



లండన్: వయస్సు మీరడంతోనే టెస్ట్‌ల నుంచి తాను రిటైర్మెంట్ తీసుకున్నానని విరాట్ కోహ్లీ వెల్లడించాడు. టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ స్వచ్ఛంద సంస్థ 'యు విక్యాన్' నిధుల సేకరణకోసం ఇక్కడ నిర్వహించిన కార్యక్రమంలో విరాట్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన నిర్ణయం గురించి సరదాగా చెప్పుకొచ్చాడు. 'రెండు రోజుల కిందటే నా గడ్డానికి రంగు వేసుకున్నా. ప్రతి నాలుగు రోజులకోసారి రంగు వేసుకోవాల్సిన సమయమొచ్చేసిందని కూడా నాకు తెలుసు' అని వయస్సు పెరిగిందన్న విషయాన్ని పరోక్షంగా వెల్లడించాడు.

షాట్‌పుటర్ జాస్మిన్‌పై సస్పెన్షన్

న్యూఢిల్లీ: భారత షాట్‌పుటర్ జాస్మిన్ కౌర్ డోప్ పరీక్షల్లో విఫలమైంది. పంజాబ్‌కు చెందిన 22 ఏళ్ల జాస్మిన్ నిషేధిత ఉత్ప్రేరకం టెర్బుటలైన్ తీసుకున్నట్టు రుజువైంది. దీంతో ఆమెపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) తాత్కాలిక సస్పెన్షన్ విధించింది. ఇక, ఇప్పటికే డోపీగా తేలిన రెజ్లర్ నితికపై నాలుగేళ్ల నిషేధం విధిస్తున్నట్టు నాడా బుధవారం ప్రకటించింది.

ఆగస్టు 29 నుంచి ప్రొ కబడ్డీ

ముంబై: కబడ్డీ అభిమానులను ఉర్రూతలూగించేందుకు ప్రొ కబడ్డీ సీజన్-12 సిద్ధమవుతోంది. ఆగస్టు 29వ తేదీ నుంచి ఈ లీగ్‌ను నిర్వహించనున్నారు. ఎప్పటిలానే 12 జట్లు లీగ్‌లో తలపడబోతున్నాయి. వేదికలు, పోటీలు జరిగే తేదీలను త్వరలో ప్రకటించనున్నారు.

ఐరోపా పర్యటనలో యువ భారత్ బోణీ

ఈన్‌ధోవెన్ (నెదర్లాండ్స్): భారత-ఏ హాకీ జట్టు ఐరోపా పర్యటనను విజయంతో ప్రారంభించింది. మంగళవారం రాత్రి ఇక్కడ జరిగిన తమ తొలి మ్యాచ్‌లో భారత్ 6-1తో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్ల పనులు భేష్

▸ భవన సముదాయాలను పరిశీలించిన స్పీకర్ అయ్యన్న


ఎమ్మెల్యే క్వార్టర్లను పరిశీలిస్తున్న అయ్యన్న

గుంటూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్ నిర్మాణ పనుల ప్రగతి సంతృప్తికరంగా ఉందని శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఆయా భవన సముదాయాలను బుధవారం ఆయన పరిశీలించారు. భవనాల్లో ఏర్పాటు చేసిన సదుపాయాలు, ఇంటీరియర్ గురించి సీఆర్డీఏ హౌసింగ్, బిల్డింగ్స్(హౌసింగ్ ప్రాజెక్ట్) విభాగ చీఫ్ ఇంజినీర్ ఎన్.శ్రీనివాసులు, ఇతర అధికారులు స్పీకర్‌కు వివరించారు.

తిరుపతిలో మహిళా ప్రజాప్రతినిధుల జాతీయ సదస్సు

▸ సెప్టెంబరు 14, 15ల్లో నిర్వహణ..ఆగస్టు మొదటి వారంలో అసెంబ్లీ

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన మహిళా ప్రజాప్రతినిధులతో తిరుపతిలో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. అసెంబ్లీలోని తన చాంబర్‌లో బుధవారం మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సూచన మేరకు సెప్టెంబరు 14, 15 తేదీల్లో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆగస్టు మొదటి వారంలో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ డిసెంబరు నాటికి రాజధాని ప్రాంతంలోని ప్రజాప్రతినిధుల క్వార్టర్లు పూర్తవుతాయని చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే ప్రసన్నపై కేసు

▸ 4 సెక్షన్లపై కోవూరులో స్టేషన్‌లో నమోదు

▸ ప్రశాంతిరెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యలు



కోవూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై కోవూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. మంగళవారం ఆమె ఏఎస్పీ సౌజన్యను కలిసి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఆయన మాట్లాడిన వీడియోలను పరిశీలించిన సీఐ సుధాకరరెడ్డి, ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి ఆయనపై కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద 74, 75, 79 సెక్షన్లతోపాటు సెక్షన్ 296 వర్తించేలా కేసు నమోదు చేశారు. ఇంకోవైపు.. ప్రసన్న ఇంటిపై జరిగిన దాడిలో టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కోవూరు జడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత బుధవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అనుచరులు వంద మంది... చంపాలన్న ఉద్దేశంతోనే ప్రసన్న ఇంట్లోకి ప్రవేశించి దాడి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

వైసీపీకి ద్వేషం: భువనేశ్వరి

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల వైసీపీ నేతల ద్వేషాన్ని, వ్యతిరేక మనస్తత్వాన్ని ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలు బహిర్గతం చేస్తున్నాయని సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ భువనేశ్వరి పేర్కొన్నారు. వైసీపీ నేతల తీరు సిగ్గుచేటని, సమాజంలో ఇలాంటి వ్యాఖ్యలకు స్థానం లేదని ఆమె ట్వీట్ చేశారు. పురుష అహంకారంతో చేసే వ్యాఖ్యలు మహిళల గౌరవాన్ని, విలువను తగ్గించలేవన్నారు. ప్రశాంతిరెడ్డికి సంఘీభావం ప్రకటించారు.

జగన్ సార్.. మహిళలపై ఎందుకింత చిన్నచూపు

▸ మీవాళ్లను ఎందుకు ప్రోత్సహిస్తున్నారు: ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 9(ఆంధ్రజ్యోతి): 'జగన్ సార్.. ఏం చేశామని మహిళల పట్ల మీనాయకులకు ఇంత చిన్నచూపు. మీరు మీవాళ్ల దుర్మార్గాలను మందలించకుండా ఎందుకు ప్రోత్సహిస్తున్నారు' అని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నెల్లూరు జిల్లా బుచ్చి నగర పంచాయతీలో ఆమె మీడియాతో మాట్లాడారు. అచ్చోసిన ఆంబోతులను ఊరి మీదకు వదిలి వాళ్ల చేసింది, మాట్లాడింది నిజమని అనిపిస్తారా అంటూ జగన్‌ను నిలదీశారు. ఇలాంటి నాయకులకు మహిళలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

మళ్లీ సబ్‌ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)

బుక్ అడ్జెస్ట్‌మెంట్ చేసుకున్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క పైసా కూడా వెచ్చించకపోవడంతో దళిత, గిరిజన కాలనీల్లో ఎక్కడా మౌలిక వసతులకు నోచుకోలేదు. గత టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో వేసిన రోడ్లు, డ్రెయిన్లు తప్ప గత ఐదేళ్లలో ఎక్కడా పనులు జరగలేదు. చట్ట ప్రకారం అమలు చేయాల్సిన సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేయలేదు. కూటమి సర్కారు ఏర్పడిన తర్వాత కూడా మొదటి ఏడాది సబ్‌ప్లాన్ అమలు నామమాత్రంగానే జరిగింది. ఇక సబ్‌ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు నోడల్ ఏజెన్సీగా ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ చర్యలు తీసుకుంటోంది. ఆ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి నోడల్ ఏజెన్సీ సమావేశం ద్వారా అన్ని శాఖల నుంచి సబ్‌ప్లాన్ అమలును సమీక్షించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2014-19 కాలంలో టీడీపీ ప్రభుత్వంలో సబ్‌ప్లాన్‌కు సంబంధించి గ్రామాల్లో సిమెంట్ రోడ్లకు ప్రణాళికలు వేసి మరీ అభివృద్ధి చేసింది. 40 శాతం జనాభా ఉన్న ప్రతి దళిత, గిరిజన కాలనీల్లో సబ్‌ప్లాన్ నిధులతో సీసీ రోడ్లు నిర్మించింది. మౌలిక వసతులకు సంబంధించి అనేక కార్యక్రమాలు చేపట్టింది. ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు, వారికి పలు సౌకర్యాలను కల్పించేందుకు నిధులు వాడింది. 2014-15 నుంచి 2018-19 వరకు ఐదేళ్లలో మొత్తం రూ.7,08,623 కోట్ల బడ్జెట్‌కు గాను ఎస్సీలకు రూ.33,625 కోట్లు అంటే.. 4.75 శాతం ఖర్చు చేసింది. ఎస్టీ సబ్‌ప్లాన్‌కు సంబంధించి రూ.12,530 కోట్లు ఖర్చు చేసింది. వైసీపీ హయాంలో 2019-20 నుంచి 2024-25 మధ్యకాలంలో రూ.12,19,078 కోట్ల బడ్జెట్‌కు గాను ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.46,323 కోట్లు అంటే.. 3.80 శాతమే ఖర్చు చేశారు. ఎస్టీ సబ్‌ప్లాన్‌లో రూ.15,636 కోట్లు అంటే.. 1.28 శాతమే ఖర్చు చేసినట్లు చూపించారు.

చిత్రజ్యోతి
SINCE 1965

యోధుడు.. ధీరుడు



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా జ్యోతి కృష్ణ తెరకెక్కించిన చిత్రం 'హరిహర వీరమల్లు'. ఏ.ఎం.రత్నం నిర్మించారు. నిధి అగర్వాల్ కథానాయిక. ఈ నెల 24న చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. బాబీ డియోల్ ప్రతినాయకుడి పాత్రను పోషించారు. పవన్ తొలిసారి చారిత్రక యోధుడి పాత్రను పోషించడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు ఆకట్టుకున్నాయి. తాజాగా, ఈ సినిమా నుంచి 'ఎవరది ఎవరది.. అతగాడో పొడుపు కథ.. దొరకనే దొరకడే అతగాడో మెరుపుకథ.. సూర్యుడికే కన్నుగప్పి సంచరించే యోధుడు.. చంద్రుడ్నే సంచికెత్తి తస్కరించే ధీరుడు' అంటూ సాగే పాటను విడుదల చేసింది చిత్రబృందం. రామజోగయ్య శాస్త్రి రచించిన ఈ గీతాన్ని సాయిచరణ్, హైమత్, లోకేశ్వర్ ఆలపించారు. ఎం.ఎం.కీరవాణి సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: ప్రవీణ్.కె.ఎల్, సినిమాటోగ్రఫీ: మనోజ్ పరమహంస.

మీ ఊహలకు అందడు



సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా రవికాంత్ పేరేపు ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, సితార ఎంటర్టైన్‌మెంట్స్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. బుధవారం 'బ్యాడాస్' అనే టైటిల్‌తో ఈ చిత్రాన్ని ప్రకటించారు మేకర్స్ "మీరు ఇప్పటివరకూ హీరోలను, విలన్‌లను చూసి ఉంటారు. కానీ ఇందులో చూడబోయే కథానాయకుడు మీ ఊహలకు అందడు. ఈసారి కనికరం లేకుండా తెరపై నిప్పు రాజేస్తాడు" అని పేర్కొన్నారు. కాగా, సిద్ధు, రవికాంత్ కలయికలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కృష్ణ అండ్ హిస్ లీల' (ఇట్స్ కాంప్లికేటెడ్) చిత్రం మంచి ఆదరణను దక్కించుకుంది.

నటి ముచ్చెర్ల అరుణ ఇంట్లో ఈడీ సోదాలు



ప్రముఖ నటి 'సీతాకోక చిలుక' ఫేమ్ ముచ్చెర్ల అరుణ ఇంట్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు బుధవారం సోదాలు చేపట్టారు. అరుణ భర్త మోహన్ గుప్తా పారిశ్రామికవేత్త. గృహసముదాయ అలంకరణల సేవలందించే (ఇంటీరియర్ డిజైనింగ్) సంస్థను నడుపుతున్నారు. మోహన్ గుప్తా నడుపుతున్న సంస్థలో ఇటీవల అక్రమ నగదు బట్వాడాలు అధికస్థాయిలో జరిగాయని ఫిర్యాదులు రావటంతో ఈడీ అధికారులు బుధవారం ఉదయం చెన్నై నీలాంగరైలోని వారి ఇంట్లో, కార్యాలయాల్లో ఒకేసారి సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ప్రతి పోలీస్ గర్వించేలా ఉంటుంది

- ఆర్‌కే సాగర్



'వాణిజ్య హంగులతో పాటు మంచి సందేశంతో రూపొందిన చిత్రం 'ది 100'. సమాజానికి ఏదైనా మంచి సందేశం ఇవ్వాలనే ఆలోచనతో పెట్టిన టైటిల్ ఇది. ఈ సినిమాకు సీక్వెల్ చేసే ఆలోచన కూడా ఉంది' అని ఆర్‌కే సాగర్ అన్నారు. ఆయన హీరోగా రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వం వహించిన చిత్రమిది. రమేశ్ కే, వెంకీ పీ నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆర్‌కే సాగర్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'ఈ చిత్రంలో నాది పోలీస్ పాత్ర. ప్రతి పోలీస్ గర్వించేలా ఉంటుంది. మొగలి రేకులు సీరియల్‌లో చేసిన ఆర్‌కే నాయుడు పాత్ర బాగా గుర్తింపు తెచ్చింది. కానీ సినిమాల్లో మాత్రం దానికి భిన్నమైన పాత్రలు చేస్తూ వచ్చాను. మళ్లీ ఇన్నాళ్లకు బలమైన కథ కుదరడంతో 'ది 100' సినిమాలో పోలీస్ పాత్ర చేశాను. నిజజీవిత సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న కథ ఇది. కుటుంబం అంతా కలసి చూసేలా మా సినిమా ఉంటుంది' అని చెప్పారు.

నాలుగు భాషల్లో గేమ్ ఆఫ్ ఛేంజ్



నలంద విశ్వవిద్యాలయం నేపథ్యంలో భారతదేశంలో జరిగిన కొన్ని సంఘటనల సమాహారంగా తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఆఫ్ ఛేంజ్'. మలయాళ దర్శకుడు సిధిన్ తెరకెక్కించారు. సిద్ధార్థ్ రాజశేఖర్ హీరోగా నటిస్తూ, మీనా చాబ్రియాతో కలసి నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం చిత్రబృందం హైదరాబాద్‌లో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా సిద్ధార్థ్ రాజశేఖర్ మాట్లాడుతూ 'కొందరు అసాధారణ వ్యక్తుల జీవితాల్లో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. నాలుగు భాషల్లో విడుదల చేస్తున్నాం' అన్నారు. ఈ సినిమాకు సీక్వెల్ కూడా ఉంటుందని దర్శకుడు చెప్పారు.

డెట్రాయెట్‌లో చెట్టాపట్టాల్



హీరోయిన్ సమంత, 'సిటాడెల్' వెబ్‌సిరీస్ దర్శకుడు రాజ్ నిడిమోరు రిలేషన్‌షిప్ స్టేటస్‌పై తరచూ వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా, వీరిద్దరూ డెట్రాయెట్‌లో కలసి తీసుకున్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు సమంత. ఈ పిక్ వారిపై వస్తున్న రూమర్స్‌కు మరింత బలం చేకూర్చేలా ఉంది. ఇదే సమయంలో రాజ్ నిడిమోరు సతీమణి శ్యామలీ పెట్టిన ఇన్‌స్టా స్టోరీ ఒకటి షేర్ చేశారు. వివిధ మతాలలోని కీలకమైన కొటేషన్స్‌ను ఆ స్టోరీలో పేర్కొన్నారు. మతమేదైనా మన చర్యలతో ఇతరులను బాధించడం తప్పనే చెబుతుందనీ.. అదే మనం జీవితంలో పాటించవలసిన సూత్రమనీ వాటి సారాంశం. సమంత, రాజ్ నిడిమోరు కలసి ఉన్న పిక్‌ను చూసి ఆమె బాధపడి ఇలా పోస్ట్ చేసి ఉంటారని పలువురు భావిస్తున్నారు.



భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతారు

- సుహాస్

సుహాస్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. రామ్ గోధల దర్శకత్వంలో హరీశ్ నల్ల నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. చిత్రబృందం ఇటీవలే ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన నటుడు మంచు మనోజ్ మాట్లాడుతూ 'ఎలాంటి సినీ వారసత్వం లేకుండా హీరోగా నిలదొక్కుకున్నాడు సుహాస్. తమిళంలో విజయ్ సేతుపతిలా సుహాస్ కూడా గొప్ప నటుడు. 'ఓ భామ...' చిత్రం ఘన విజయం అందుకోవాలి' అని ఆకాంక్షించాడు. సుహాస్ మాట్లాడుతూ 'ఈ సినిమా చూశాక అందరూ మాళవికతో ప్రేమలో పడిపోతారు. తన నటన, హావభావాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుంది. నేను మరోసారి బలమైన పాత్రని చేశాను. కథలోని భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతారు' అని చెప్పారు. హరీశ్ నల్లా మాట్లాడుతూ 'దర్శకుడు రామ్ మంచి టీమ్‌ను సెలెక్ట్ చేసుకున్నాడు. ఆయనకు మంచి భవిష్యత్ ఉంది. సుహాస్ అందరికీ గుర్తుండిపోయే పాత్రలో కనిపిస్తారు' అన్నారు. రామ్ గోధల మాట్లాడుతూ 'ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించే ఓ విభిన్న కథా చిత్రం ఇది. మనుషుల విలువల్ని, వారి మధ్య ఉండే భావోద్వేగాల్ని తెరపై ఎంతో సహజంగా చూపించాం. సుహాస్ కెరీర్లో మరో వైవిధ్యమైన చిత్రంగా నిలుస్తుంది' అని చెప్పారు.

ఆగస్టులో రాజుగాని సవాల్



అన్నాచెల్లెళ్ల అనుబంధం నేపథ్యంలో మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రం 'రాజుగాని సవాల్'. లెలిజాల రవీందర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. రితికా చక్రవర్తి కథానాయిక. ఇటీవలే చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో నటుడు జగపతి బాబు టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా లెలిజాల రవీందర్ మాట్లాడుతూ 'ఆగస్టు 8న 'రాజుగాని సవాల్'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని మనసుకు హత్తుకునేలా ఆవిష్కరించే చిత్రం ఇది. తెలంగాణ సంస్కృతి నేపథ్యంలో సాగుతుంది. వినోదంతో పాటు పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వోద్యోగం

- జూ.అసిస్టెంట్‌గా నియామకానికి మంత్రి మండలి ఆమోదం



తోట వీరాంజనేయులు

మాచర్ల టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నేత దివంగత తోట చంద్రయ్య కుమారుడు వీరాంజనేయులుకు జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేందుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ మేరకు బుధవారం జరిగిన సమావేశంలో క్యాబినెట్ ఆమోదించింది. జనవరి 13, 2022లో రాజకీయ కారణాలతో ప్రత్యర్థుల చేతిలో చంద్రయ్య హత్యకు గురైన విషయం తెలిసిందే. చంద్రయ్య బీసీ-బీ, పెరిక సామాజిక వర్గానికి చెందిన వారని, భార్య, కుమారుడు, కుమార్తె ఉన్న వారి కుటుంబ ఆదాయం రూ.80 వేలు లోపేనని, కొంత మెట్టు భూమి మాత్రం ఉందని కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. పేద కుటుంబం కావడంతో చంద్రయ్య కుమారునికి ఉద్యోగం, భార్యకు ఆర్థికసాయం చేసేందుకు గురజాల ఆర్డీవో, వెల్దుర్తి తహసీల్దారు సిఫారసు చేశారు. ఈ ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపి, పల్నాడు జిల్లా కలెక్టర్‌కు తగిన ఆదేశాలు జారీ చేసింది.

మీకేమీ పట్టదా?

> గంజాయి నియంత్రణపై మరింతగా ఉక్కుపాదం మోపాలి. ఈగల్ టీంలు ఇంకా సమర్థంగా పనిచేయాలి. పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు ఎక్కువగా నిర్వహించాలి.
> - సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

ప్రశాంతిరెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి అసభ్యకరంగా మాట్లాడడమే కాకుండా వాటిని సమర్థించుకుంటూ వ్యాఖ్యలు చేస్తే వాటిని మంత్రులు, ఎమ్మెల్యేలు సమర్థంగా తిప్పికొట్టలేకపోయారని ఆక్షేపించారు. 'తోతాపురి మామిడికి కిలోకు రూ.4 అదనంగా ఇచ్చి కొనుగోలు చేయించాం. మామిడి కొనుగోళ్లు 80శాతం పూర్తయ్యాక జగన్ బంగారుపాళ్యంలో పర్యటన పేరుతో హడావుడి చేశారు. వైసీపీ రైతుల పొలాల నుంచి తీసుకొచ్చిన మామిడి పండ్లను ఉద్దేశపూర్వకంగా కింద పోయించి అలజడి సృష్టించారు (వాటికి సంబంధించిన విజువల్స్‌ను మంత్రివర్గ సహచరులకు సీఎం చూపించారు). మామిడి రైతుల వద్దకు వెళ్లి.. తలకాయలు రప్పా రప్పా నరుకుతామని హెచ్చరించడం ఏమిటి? అనుమతుల్లేకున్నా రోడ్ షోలు, మందీమార్బలంతో బలప్రదర్శనలు చేయడం వైసీపీ నేతలకు అలవాటుగా మారింది. వారికి చట్టాలపై గౌరవం లేదు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పొగాకును రూ.275 కోట్లు వెచ్చించి కొనుగోలు చేయించాం. నిత్యావసరాల ధరలను ఏడాదిలో గణనీయంగా తగ్గించాం (ఏ వస్తువు ధర ఎంత మేర తగ్గిందో చదివి వినిపించారు). ఇలాంటి మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మంత్రులు, ఎమ్మెల్యేలు విఫలమయ్యారు. ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. చేసిన మంచి చెప్పుకోలేకపోవడం వల్ల.. వాటిని వైసీపీ వాళ్లు తమకు అనువుగా వాడుకుంటూ దుష్ప్రచారం చేస్తున్నారు' అని సీఎం అన్నారు. ఇండోసోల్‌కు భూములు ఇవ్వొద్దని రైతుల్ని రెచ్చగొట్టింది జగనేనని.. అదే జగన్ పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ సొంత మీడియాలో కథనాలు రాయిస్తున్నారని.. ఇలాంటి కుట్రల్ని సమర్థంగా తిప్పికొట్టాలని సీఎం సూచించారు. ప్రభుత్వం సరిచేసుకోవాల్సిన అంశాలు ఉంటే వెంటనే చేద్దామని వ్యాఖ్యానించారు.

ఏం చేశామో చెప్పలేరా?

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అయిన సందర్భంగా మంత్రులందరికీ వారి శాఖల్లో ఏడాదిలో చేసిన అభివృద్ధి పనులను మీడియా ద్వారా ప్రజలకు వివరించాలని సీఎం ఆదేశించారు. మంత్రి సత్యకుమార్ తప్ప మిగిలిన వారెవ్వరూ ఆ పని చేయకపోవడంపై చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మెరుగుపరచుకోవాలని పదేపదే చెబుతున్నా.. ఎందుకు చేయడం లేదని నిలదీశారు.

- సంక్షేమ వసతి గృహాల్లో ఫుడ్‌పాయిజనింగ్, అతిసార వంటివి చోటుచేసుకుంటున్నాయని.. మంత్రులు, ఎమ్మెల్యేలు దృష్టిసారించాలని సీఎం సూచించారు.
- రాజధాని అమరావతిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్ల నిర్మాణం డిసెంబరులోపు పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. బడ్జెట్ సమావేశాల నాటికి ఎమ్మెల్యేలు అక్కడ నివాసం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.

ఈ-మెయిళ్ల కుట్రపై విచారణ: బాబు

ప్రభుత్వ ఇమేజ్‌ను దెబ్బతీసేలా వివిధ సంస్థలకు వైసీపీ వారు ఈ-మెయిళ్లు పెట్టడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడులు అడ్డుకునేలా చేస్తున్న కుట్రలపై విచారణ చేయిస్తామని ప్రకటించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా, పేదలకు తల్లికి వందనం డబ్బులు అందకుండా చేయడమే లక్ష్యంగా ఈ-మెయిళ్ల తంతు నడిపారని వ్యాఖ్యానించారు.

తొలి అడుగుకు స్పందన ఎలా ఉంది?

కేబినెట్ భేటీకి ముందు సీఎం నివాసంలో మంత్రులకు లోకేశ్ అల్పాహారం విందు ఇచ్చారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమానికి స్పందన ఎలా ఉందని మంత్రులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ బిల్లులు ఎక్కువ వస్తున్నాయని, తల్లికి వందనం డబ్బులు పడలేదని.. ఉచిత గ్యాస్ సిలిండర్ డబ్బులు ఇంకా వేయలేదన్న ఫిర్యాదులు వస్తున్నాయని వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మిగిలిన అంశాలపై ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూలత వ్యక్తమవుతోందని తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుకు ఏపీ బెస్ట్

- ఈఐయూ ర్యాంకింగ్స్‌లో రాష్ట్రానికి నాలుగో స్థానం
- తొలి మూడు స్థానాల్లో తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర

అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటుకు, వ్యాపార నిర్వహణకు ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత అనుకూల వాతావరణం ఉందని ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) 2025 ర్యాంకింగ్స్ స్పష్టం చేశాయి. ఈ ర్యాంకింగ్స్‌లో ఏపీ 6.9 స్కోరుతో నాలుగో స్థానంలో నిలిచింది. ఢిల్లీ, కర్ణాటక కూడా ఏపీతో కలిసి నాలుగో స్థానాన్ని పంచుకున్నాయి. తెలంగాణ 6.8 స్కోరుతో ఏడో స్థానంలో నిలిచింది. తమిళనాడు 7.4 స్కోరుతో ప్రథమ స్థానంలో నిలవగా.. గుజరాత్ 7.3 స్కోరుతో రెండో స్థానంలో, మహారాష్ట్ర 7.1 స్కోరుతో మూడో స్థానంలో నిలిచాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పారిశ్రామిక అనుకూల విధానాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం, వ్యాపార సౌలభ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) ఏపీని వ్యాపార అనుకూల రాష్ట్రాల్లో ముందువరుసలో నిలబెట్టాయని ఈఐయూ నివేదిక తెలిపింది. ఈఐయూ నివేదికలోని అంశాలను బుధవారం జరిగిన క్యాబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు మంత్రులకు వివరించారు.

తోతాపురి రైతులకు రూ.260 కోట్లు

ప్రభుత్వపరంగా కిలోకు రూ.4 మద్దతు ధర

- ప్రస్తుత సీజన్‌లో 6.50 లక్షల టన్నుల మామిడి సేకరణ
- రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం
- అమరావతిలో ఎమ్మెల్యేలు, అధికారుల క్వార్టర్స్ పనుల పూర్తికి రూ.524 కోట్లు
- రాజధానిలో క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్
- క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి
- నేటి నుంచి రైతుల ఖాతాల్లో ధాన్యం బకాయిలు

అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి రైతులకు కిలోకు రూ.4 చొప్పున ప్రభుత్వ మద్దతు ధరగా మొత్తం రూ. 260 కోట్లను చెల్లించేందుకు రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షత బుధవారం అమరావతి సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. ప్రస్తుత సీజన్‌లో 6.50 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని సేకరించడానికి ఆమోదం తెలిపింది. కిలోకు రూ.4 చొప్పున ప్రభుత్వ మద్దతు ధరగా మొత్తం రూ.260 కోట్లు మంజూరు చేసింది. అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ (ఏక్యూసీసీ) పేరిట ప్రభుత్వ కంపెనీని ఏర్పాటు చేసే ప్రతిపాదనకు కూడా ఆమోదం తెలిపినట్లు రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. క్యాబినెట్ నిర్ణయాలను ఆయన విలేకరులకు వెల్లడించారు. రైతులకు ధాన్యం సేకరణ బకాయిలు రూ.670 కోట్లను గురువారం నుంచి వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. రాజధాని అమరావతిలో రెండో విడత భూసమీకరణపై మంత్రుల కమిటీ రైతులను సంప్రదించాలని.. వారి సమస్యలు, ఆలోచనలు ఏమిటో తెలుసుకోవాలని సీఎం సూచించారని చెప్పారు.



రాష్ట్రాభివృద్ధికి భూసమీకరణ అవసరాన్ని వారికి వివరించాలని.. రైతులు, ఆయా గ్రామాల ప్రజల అభిప్రాయాలు తీసుకుని వారం, పది రోజుల్లో ప్రతిపాదనలు చేయాలని తెలిపారని వెల్లడించారు. రాష్ట్రాన్ని జగన్ అన్‌పాపులర్ చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే చూస్తున్నారని, రాష్ట్రాన్ని విధ్వంసం చేయడానికి, పెట్టుబడిదారులు రాకుండా చేయాలని వైసీపీ చూస్తోందని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందకుండా ప్రతిపక్షం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని సీఎం స్పష్టంగా ఆదేశించారని తెలిపారు.

మరిన్ని నిర్ణయాలు ఇవే..

- అమరావతిలోని నేలపాడులో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అఖిల భారత సర్వీసుల అధికారుల కోసం నిర్మాణంలో ఉన్న నివాస సముదాయం పనులు వేగవంతం. ఈ బహుళ అంతస్తుల సముదాయంలో మిగిలిన పనులు పూర్తి చేయడానికి రూ.524.70 కోట్లు మంజూరుకు, టెండర్ల ఖరారు అధికారాన్ని సీఆర్‌డీఏ కమిషనర్ ఇవ్వడానికి ఆమోదం. సీఆర్‌డీఏ ప్రాంతంలో వివిధ సంస్థలకు భూకేటాయింపుల సమీక్షకూ సమ్మతించింది. అమరావతిలో 6 కేంద్ర ప్రభుత్వ సంస్థలకు 33.49 ఎకరాలు కేటాయించిన భూములకు కొన్ని సవరణలు చేశారు. కొత్తగా 7 సంస్థలకు 32.4 ఎకరాల కేటాయింపునకు అంగీకారం.
- ప్రకాశం బ్యారేజీ ముందుభాగంలో వివిధ రీచ్‌ల్లో ఇసుక తొలగింపు పనికి రూ.286.20 కోట్లకు పరిపాలనామోదం.
- జల వనరులశాఖలోని వివిధ చీఫ్ ఇంజనీర్ల అధీనంలో ఉన్న 71 ప్రాజెక్టుల పనులను కొనసాగించేందుకు సమ్మతి.
- వైసీపీ నేతల చేతిలో హత్యకు గురైన తోట చంద్రయ్య కుమారుడు తోట వీరాంజనేయులుకు జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు ఆమోదం.
- అమరావతిలో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఏపీ సెంటర్ ఫర్ ఎనర్జీ అండ్ సైబర్ రెసిలియన్స్ స్థాపనకు ఆమోదం.
- జల్ జీవన్ మిషన్ కింద రాష్ట్ర మ్యాచింగ్ షేర్ కోసం రూ.10 వేల కోట్లను ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణాల ద్వారా సమీకరించడానికి 'ఆంధ్రప్రదేశ్ జల్ జీవన్ వాటర్ సప్లై కార్పొరేషన్' స్థాపనకు ఆమోదం.
- సరుకు రవాణా, వాణిజ్య వాహనాలపై గ్రీన్ ట్యాక్సును తగ్గిస్తూ ఆర్డినెన్స్ జారీచేసేందుకు సమ్మతి.
- అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి ప్రాంతంలో ప్రతిపాదిత బల్క్ డ్రగ్ పార్క్ సరిహద్దుల మార్పు.. ఏఎంఎన్ఎస్ఐ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ స్థాపనకు కేటాయించిన భూముల తరలింపునకు పరిహారంగా అదనంగా 790 ఎకరాల భూముల సేకరణ.. ఏపీ బల్క్ డ్రగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు మొత్తం 2,001.80 ఎకరాల బదిలీ.. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు.. వీకే-పీసీపీఐఆర్-యూడీఏ ద్వారా లే-అవుట్ ఆమోదం చార్జీలు, భూవినియోగ చార్జీలకు మినహాయింపు.. ఏపీఐఐసీ, ఏపీబీడీఐసీ ద్వారా భూమి లీజు అద్దె, ఇతర యుటిలిటీ చార్జీల అమలు.. బల్క్ డ్రగ్ పార్కులో స్థాపించే యూనిట్లకు ప్రస్తుత విధానాల ప్రకారం ప్రోత్సాహకాల విస్తరణ ప్రతిపాదనలకు ఆమోదం.
- 2025-30 కాలానికి 'ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0'కు సమ్మతి.
- బీపీసీఎల్ పెట్రోలియం రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్, ఇండోసోల్ సోలార్, ఇంటిగ్రేటెడ్ సోలార్ సెల్ మాన్యుఫాక్చరింగ్ ప్రాజెక్టు, రామాయపట్నం పోర్ట్ రెండో దశ, సంబంధిత లాజిస్టిక్స్, పారిశ్రామిక టౌన్‌షిప్ ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రక్రియ పూర్తికి కందుకూరు, కావలిలో ఒక స్పెషల్ కలెక్టర్ యూనిట్, 4 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల యూనిట్ల ఏర్పాటుకు సమ్మతి.
- రాజధాని కోసం చేపట్టిన భూసమీకరణ కారణంగా జీవనోపాధి కోల్పోయిన మరో 1,575 నిరుపేద కుటుంబాలకు పెన్షన్ మంజూరు.
- మార్క్‌ఫెడ్ ఇప్పటికే పొందిన రూ.6,700 కోట్ల రుణంతో పాటు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ నుంచి ఇంకో వెయ్యి కోట్ల అదనపు రుణానికి ప్రభుత్వ గ్యారెంటీ పొడిగింపు.
- కోకో రైతులకు సరసమైన ప్రోత్సాహక ధరలు అందించడానికి ప్రభుత్వ మద్దతు ధరగా కిలోకు రూ.50 చొప్పున రూ.14.88 కోట్లు మంజూరు. ప్రస్తుత సీజన్‌లో అమ్ముడుపోని 2,976.76 మెట్రిక్ టన్నుల కోకో గింజల సేకరణకు ఆమోదం.

లోకేశ్‌తో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ భేటీ



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను సత్కరిస్తున్న మంత్రి లోకేశ్

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన మాధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లి నివాసంలో బుధవారం జరిగిన ఈ భేటీ సందర్భంగా మాధవ్‌తో కలిసి శాసనమండలిలో పనిచేసిన విషయాన్ని లోకేశ్ గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉండగా ప్రజాసమస్యలపై శాసనమండలి వేదికగా కలిసి పోరాడిన సందర్భాలు చాలా ఉన్నాయని ఇద్దరు నేతలు గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం కలసి పనిచేద్దామని లోకేశ్ పేర్కొన్నారు.

ఆ నాలుగు విమానాశ్రయాలకు హడ్కో రుణం

- ఒంగోలు, సాగర్‌లలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం, దగదర్తి, అమరావతి, కుప్పం విమానాశ్రయాల నిర్మాణానికి రూ.1,000 కోట్లు కావాలని హడ్కోను రాష్ట్ర విమానాశ్రయాభివృద్ధి సంస్థ కోరింది. ప్రాథమిక సమాలోచనల అనంతరం ఆ మొత్తాన్ని రుణంగా అందించేందుకు హడ్కో సూత్రప్రాయంగా ఆమోదించింది. ఈ రుణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చేందుకు బుధవారం మంత్రిమండలి సమావేశం ఆమోదం తెలిపింది. దీంతో ఈ నాలుగు విమానాశ్రయాల నిర్మాణాలకు విమానాశ్రయాభివృద్ధి సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కాగా.. ఒంగోలు, నాగార్జునసాగర్‌లలోనూ కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు నిర్మించాలని సంస్థ భావించింది. అందుకోసం టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్టు (టీఈఎఫ్ఆర్) నివేదికను తయారు చేసేందుకు ఆసక్తి గల సంస్థల కోసం మంగళవారం ప్రకటన జారీ చేసింది. 29లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరింది. కాగా, రాష్ట్రంలో విమాన తయారీ సంస్థను ఏర్పాటు చేస్తామంటూ సరళ ఏవియేషన్ మంత్రి బీసీ జనార్దనరెడ్డికి ప్రతిపాదనలు అందజేసింది. ఆ సంస్థ ప్రతినిధులు బుధవారం వెలగపూడి సచివాలయంలో ఆయనతో సమావేశమయ్యారు. పైలట్ శిక్షణలో ప్రతిష్ఠాత్మక సంస్థ గోల్డెన్ ఎప్యూలెట్స్ ఏవియేషన్ అకాడమీ ప్రతినిధులు కూడా సచివాలయంలో మంత్రి జనార్దనరెడ్డిని కలిశారు.రాష్ట్రంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు.

ఏపీలో 1,800 కోట్ల పెట్టుబడితో పీసీబీ యూనిట్!

- నాయుడుపేటలో ఏర్పాటుకు 'సిర్మా ఎస్‌జీఎస్' సన్నాహాలు

దేశంలోనే అతిపెద్ద మల్టీ లేయర్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ (పీసీబీ), కాపర్ క్లాడ్ లామినేట్ (సీసీఎల్) తయారీ యూనిట్ ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు కానుంది. చెన్నైకి చెందిన సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీస్ సంస్థ రూ.1,800 కోట్ల పెట్టుబడితో ఈ తయారీ కేంద్రాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. తిరుపతి జిల్లా నాయుడుపేటలో దీన్ని ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపిస్తోంది. వచ్చే ఏడాదికల్లా ఇక్కడ యూనిట్‌ను ప్రారంభించాలనే లక్ష్యంతో సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే మూలధన రాయితీ, విద్యుత్తు సుంకంపై రాయితీ.. తదితర ప్రోత్సాహకాలు పొందేందుకు ఆ సంస్థ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. 'సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీస్.. దక్షిణ కొరియాకు చెందిన షిన్హ్వా ఎలక్ట్రానిక్స్‌తో భాగస్వామ్యం కోసం చూస్తోంది' అని ఆ వర్గాలు వివరించాయి.

మాపై కేసు కొట్టేయండి

- జగన్ అక్రమాస్తుల కేసులో దాల్మియా సిమెంట్స్ పిటిషన్

హైదరాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో తమపై సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టేయాలని దాల్మియా సిమెంట్స్ భారత్ లిమిటెడ్ హైకోర్టులో మరోసారి క్వాష్ పిటిషన్ దాఖలు చేసింది. గతంలోని క్వాష్ పిటిషన్‌ను 2022లో ఉపసంహరించుకుంది. తాజా పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. తదుపరి విచారణను ధర్మాసనం ఈనెల 23కు వాయిదా వేసింది.

ప్రజాసేవకే టెక్నాలజీ

- వారికి ఉపయోగపడినప్పుడే సార్థకత
- 'బిల్‌గేట్స్'తో కలిసి చేపడుతున్న పనులపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తాను టెక్నాలజీ గురించి పదే పదే మాట్లాడేది ప్రజల కోసమేనని, మెరుగైన సేవలు వారికి అందాలని అప్పుడు... ఇప్పుడు ఎప్పుడైనా సరే కోరుకుంటానని సీఎం చంద్రబాబు అన్నారు. పేదలకు, మధ్యతరగతికి, రైతాంగానికి ఉపయోగపడినప్పుడే సాంకేతికతకు సార్థకత అని అభిప్రాయపడ్డారు. వివిధ శాఖల్లో బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై బుధవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, పర్యావరణం, సమాచారం, ఆర్టీజీఎస్, స్వర్ణాంధ్ర విజన్-2047, ప్రభుత్వ పాలనలో ఉద్యోగుల సామర్థ్య పెంపు తదితర అంశాల్లో బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. ఆయా రంగాల్లో టెక్నాలజీని వినియోగించుకుని ప్రజలకు సేవలను మరింత దగ్గరచేసే విషయంలో ఫౌండేషన్ సహకారం తీసుకుంటోంది. ఈ సందర్భంగా ఆయా శాఖల్లో బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి చేపడుతున్న కార్యక్రమాల ప్రగతి, పురోగతిపై సీఎం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రస్తుత యుగంలో టెక్నాలజీ పెద్దఎత్తున అందుబాటులో ఉందని, దానివల్ల చాలా వరకు పనులు త్వరితగతిన పూర్తి చేయగలుగుతున్నామని తెలిపారు. ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు సేవలందిస్తోందని, ఆగస్టు 15 నాటికి 95 నుంచి 97 శాతం ప్రభుత్వ సేవలు ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి వచ్చేస్తాయని తెలిపారు. "బిల్‌గేట్స్ ఫౌండేషన్ వద్ద ప్రపంచ వ్యాప్తంగా ఆయా రంగాల్లో అనుసరించే విధానాలకు సంబంధించిన సమాచారముంది. టెక్నాలజీ పరంగా ఎలా ముందుకెళ్లాలనే విషయంలోనూ వారికి నైపుణ్యం ఉంది. అందుకే వారితో కలిసి పనిచేస్తున్నాం." అని వివరించారు.

విద్య, వైద్యం ప్రజలకు భారం కాకూడదు...

వైద్యం, విద్య, వ్యవసాయం వంటి రంగాల్లో టెక్నాలజీని వినియోగించడానికి ప్రత్యేక కారణం ఉందని చంద్రబాబు అన్నారు. "రాను రాను వైద్యమనేది సామాన్యునికి భారంగా మారింది. కొన్ని రోగాలకు రూ.కోట్లు మేర డబ్బులు అవసరమవుతోంది. ప్రజలపై వైద్యఖర్చుల భారం తగ్గాలి. దీనికోసమే ఆరోగ్య రంగాన్ని టెక్నాలజీతో అనుసంధానించే అంశంపై దృష్టి పెట్టాం." అని తెలిపారు. పుట్టే పిల్లల్లో వైకల్యం మొదలుకొని పోషకాహారలోపాల వరకు గుర్తించడానికి కేర్ అండ్ గ్రో విధానాన్ని అనుసరిస్తున్నామన్నారు. నాణ్యమైన విద్యను, తక్కువ ఖర్చుతో పేదలకు, మధ్య తరగతి ప్రజలకు అందించడం టెక్నాలజీతో సులువు అవుతుందన్నారు. పంటలు వేయడం మొదలుకుని పంట అమ్ముకునేంతవరకు రైతులు ఎలాంటి మెళకువలు అనుసరించాలనే అంశంపై పక్కా సమాచారం అవసరమని, డేటా అందుబాటులో ఉంటే... దానికి అనుగుణంగా సాగు చేస్తారన్నారు. ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్‌లో రాష్ట్రం దేశంలో నాలుగో స్థానంలో ఉందన్నారు. ప్రతిదీ ఆన్‌లైన్‌లో ఉందని, ఫైళ్ల క్లియరెన్స్ కూడా ఆన్‌లైన్‌లో చేస్తున్నామన్నారు. మెడికల్ ఎక్విప్‌మెంట్ తయారీ చేసే మెడ్‌టెక్‌జోన్ ఏపీలోనే ఉందన్నారు. అమరావతిలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని, దీనికి బిల్‌గేట్స్ ఫౌండేషన్ సహకారం తీసుకుంటామని చెప్పారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి ఇలాంటి సమావేశం ఏర్పాటు చేసుకుందామని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, బిల్‌గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

71 సాగునీటి ప్రాజెక్టులకు ఊపిరి!

- పనుల పూర్తికి రూ.27,941.34 కోట్లు
- ఇవ్వాలని కేబినెట్ తీర్మానం.. పనులు 25 శాతం దాటలేదంటూ ఈ పథకాల ఉసురు తీసిన జగన్
- పలువురు ఎమ్మెల్యేలు తన దృష్టికి తేవడంతో వాటికి సీఎం ఆమోదం

అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో అర్థాంతరంగా పనులు ఆపేసి ఉసురు తీసిన సాగునీటి ప్రాజెక్టులకు ఊపిరి పోయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. రూ.27,941.34 కోట్ల విలువైన ఆయా ప్రాజెక్టుల పనులు పునఃప్రారంభించాలని బుధవారం కేబినెట్ సమావేశం తీర్మానించింది. ఇందులో గోదావరి-పెన్నా అనుసంధాన పథకానికి రూ.6,020.15 కోట్లు కేటాయించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే.. 25 శాతం లోపు పనులు జరిగిన ప్రాజెక్టుల టెండర్లను ఆయన రద్దుచేసిన సంగతి తెలిసిందే. చాలా పథకాలకు తిరిగి టెండర్లు పిలవలేదు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక పలువురు ఎమ్మెల్యేలు స్థానిక ప్రాధాన్యం ఉన్న ఆయా ప్రాజెక్టులు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల సమీక్షించిన ఆయన.. రాష్ట్ర వ్యాప్తంగా అవసరమైన చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులను గుర్తించాలని జలవనరుల శాఖకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. వాటి పనులను తిరిగి చేపట్టాలనీ నిర్దేశించారు.

ఊపిరి పోసుకున్న ప్రాజెక్టుల్లో ముఖ్యమైనవి..

- గోదావరి-పెన్నా అనుసంధాన పథకం-రూ.6,020.15 కోట్లు
- నాగార్జునసాగర్ కుడికాలువ గేట్ల మరమ్మతు-రూ.39.54 కోట్లు
- గాలేరు-నగరి పరిధిలో మల్లెమడుగు రిజర్వాయర్ పనులు-రూ.292.66 కోట్లు
- హంద్రీ-నీవా పరిధిలో పుంగనూరు బ్రాంచ్ కెనాల్ వెడల్పు-రూ.1,925 కోట్లు
- ఉమ్మడి కర్నూలు జిల్లా వేదవతి ఎత్తిపోతలు-రూ.1,942 కోట్లు
- రాయలసీమ ఎత్తిపోతలు-రూ.3,825 కోట్లు
- హంద్రీ-నీవా కాలువలో మిగిలిన పనులు-రూ.6,182.20 కోట్లు
- గండికోట రిజర్వాయర్ అభివృద్ధి-రూ.3,556.76 కోట్లు
- తెలుగుగంగ ప్రాజెక్టులో మిగిలిన పనులు-రూ.564.60 కోట్లు.
- ముక్త్యాల ఎత్తిపోతల-రూ.489.28 కోట్లు
- అనకాపల్లి జిల్లాలో పెద్దేరు రిజర్వాయరు-రూ.84.40 కోట్లు
- పశ్చిమగోదావరి జిల్లా ఖాజా, తూర్పుకొక్కిలేరు, ముసకపాలెం, ఎలమంచిలి, నరసాపురంలో రెగ్యులేటర్ పునర్నిర్మాణం-రూ.8.8 కోట్లు
- కృష్ణా జిల్లా ఉప్పుటేరుపై వేర్వేరు చోట్ల మూడు రెగ్యులేటర్ల నిర్మాణం. ఇందులో ఒక రెగ్యులేటర్‌కు రూ.136.6 కోట్లు.. రెగ్యులేటర్ కమ్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.188.4 కోట్లు.. దుంపగెడ్డ వద్ద రెగ్యులేటర్‌కు రూ.87 కోట్లు.
- తూర్పుగోదావరిలో వశిష్ఠ నదిపై రెగ్యులేటర్ నిర్మాణం-రూ.25.1 కోట్లు
- నరసాపురంలో నల్లి క్రీక్ కాలువ-రూ.17.66 కోట్లు
- పల్నాడు జిల్లా వరికెలపూడిశెల ఎత్తిపోతలు-రూ.340.26 కోట్లు
- ఉమ్మడి విజయనగరం రాజాంలో తాగునీటి సరఫరా స్కీం-రూ.63.63 కోట్లు

దేవాడలో ఏం జరుగుతోంది?

- మైనింగ్‌పై డిప్యూటీ సీఎం పవన్ ఆరా
- సమగ్ర నివేదిక ఇవ్వాలని విజయనగరం అధికారులకు ఆదేశం

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా విజయనగరం జిల్లా, గరివిడి మండలం దేవాడ మైనింగ్ బ్లాక్‌లో మాంగనీసు తవ్వకాలు సాగిస్తుండటంపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరా తీశారు. అక్కడ అనుమతించిన దానికంటే ఎక్కువగా తవ్వకాలు సాగిస్తున్నారని డిప్యూటీ సీఎం కార్యాలయానికి పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో చర్యలు తీసుకున్నారు. ఫిర్యాదులను పరిశీలించిన ఆయన.. అక్కడ జరుగుతున్న తవ్వకాలపై సమగ్ర నివేదిక అందించాలని తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. ఫిర్యాదులపై విజయనగరం జిల్లా యంత్రాంగంతో ఉప ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులు చర్చించారు. ఆయన కోరిన వివరాలతో సమగ్ర నివేదిక అందించాలని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోనే గనులను వేలం వేశారని, ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభ్యంతరాలను ఆనాడు పరిగణనలోకి తీసుకోలేదని ఫిర్యాదుదారులు తెలిపారు.

జనసేనలోకి వైసీపీ జెడ్పీటీసీలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వైసీపీకి చెందిన నలుగురు జెడ్పీటీసీ సభ్యులు జనసేన పార్టీలో చేరారు. చింతలపూడి జెడ్పీటీసీ పొల్నాటి శ్రీనివాసరావు, తాడేపల్లిగూడెం జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, అత్తిలి జెడ్పీటీసీ అడ్డాల జానకి, పెరవలి జెడ్పీటీసీ కొమ్మిశెట్టి రజనీ.. పవన్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షుడు పెనుగొండ సబ్బారాయుడు, వైశ్యసత్ర సముదాయాల అధ్యక్షుడు దేవకీ వెంకటేశ్వర్లుతో పాటు మరికొంత మంది జనసేన కండువా కప్పుకొన్నారు.



మర్యాదపూర్వకంగా తనను కలిసిన బీజేపీ అధ్యక్షుడు మాధవ్‌ను సత్కరిస్తున్న జనసేనాని పవన్ కల్యాణ్

పవన్‌తో మాధవ్ భేటీ..

మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న మాధవ్‌కు ఈ సందర్భంగా పవన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాధవ్‌కు శాలువా కప్పి సత్కరించారు. ఈ భేటీలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడంపై సుదీర్ఘంగా చర్చించారు.

నేడు మెగా పీటీఎం 2.0

(మొదటి పేజీ తరువాయి)

కాలేజీల్లో మెగా పీటీఎం నిర్వహిస్తున్నారు. ఇందులో 74,96,228మంది విద్యార్థులు, 3,32,770 మంది ఉపాధ్యాయులు, 1,49,92,456 మంది తల్లిదండ్రులు, దాతలు, ఇతరులు పాల్గొనే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. మొత్తంగా 2.28 కోట్ల మంది మెగా పీటీఎంలలో భాగస్వాములు కానున్నారు. ఒకేరోజు ఇంతమంది పాల్గొనే ఈ కార్యక్రమంతో గిన్నిస్ రికార్డు నెలకొల్పే దిశగా ఏర్పాట్లు చేశారు. ఇకపై ప్రతి సంవత్సరం పండుగ వాతావరణంలో మెగా పీటీఎంలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పిల్లల అభ్యసన సామర్థ్యాలు, వారి ప్రవర్తన తదితర అంశాలపై తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తారు. తల్లిదండ్రులు తమ అభిప్రాయాలు, సూచనలను ఈ వేదికగా ప్రభుత్వంతో పంచుకుంటారు. కాగా, శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం కొత్తచెరువులోని జడ్పీ పాఠశాలలో, శ్రీసత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే పీటీఎంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పాల్గొంటారు. గన్నవరం విమానాశ్రయం నుంచి సీఎం ప్రత్యేక విమానంలో ఉదయం పుట్టపర్తి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. రోడ్డు మార్గాన కొత్తచెరువులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ముఖాముఖి నిర్వహిస్తారు. అక్కడి నుంచి పక్కనే ఉన్న జడ్పీ హైస్కూల్‌కు వెళ్తారు. అక్కడ మెగా పీటీఎం అనంతరం చంద్రబాబు పుట్టపర్తి చేరుకుని సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటారు. అక్కడి నుంచి విమానాశ్రయం చేరుకుని విజయవాడకు బయలుదేరి వెళ్తారు.

ఇదేనా నిరసన?



ధరలు దక్కడంలేదంటూ రైతులు తమ పంటను రోడ్డుపై పారబోసి నిరసన వ్యక్తం చేయడం సహజమే. కానీ... ఇక్కడ... వైసీపీ నేతల తోటలోని మామిడినే వ్యూహం ప్రకారం జగన్ ముందు పారబోశారు. మండీలో అమ్ముకుందామని తెచ్చుకున్న ఒక రైతు మామిడినీ దౌర్జన్యంగా తెచ్చి రోడ్డుపాలు చేశారు.

ఎస్పీపైనా చిందులు...



ముందుగా అనుమతించిన దారిలోనే వెళ్లాలని, బంగారుపాళ్యం గ్రామంలోకి వెళ్లడం కుదరదని చెబుతున్న ఎస్పీతో జగన్ వాగ్వాదం

అంతంత మాత్రం జనం మధ్య... కృత్రిమ నిరసన



జగన్ రోడ్ షోలో అంతంతమాత్రంగా ఉన్న జనం. ఇక... స్థానిక వైసీపీ నేతలు ముందుగానే తమ తోటల్లోని మామిడి కాయలు కోసి, ట్రాక్టర్లలో ఉంచి... సరిగ్గా జగన్ రాగానే ఇలా రోడ్ల మీదికి తెచ్చారు.

బంగారుపాళ్యంలో దండుపాళ్యం

ఏడాది కష్టం నేలపాల్జేశారు



"నేను ఏడాదంతా కష్టపడి సాగుచేసిన మామిడి కాయలను జగన్ వస్తున్నారని చెప్పి రోడ్డుపై పారపోశారు. ఇన్ని రోజులూ పర్మిట్లు లేక కాయలు కోయలేదు. ధరలు ఉండటం వల్ల రెండు ట్రాక్టర్ల కాయల్ని మార్కెట్ యార్డుకు తెచ్చా. వాటిని వైసీపీ నేతలు రోడ్డుపై పోసి నా ట్రాక్టర్‌తోనే తొక్కించారు. ఏడాది కష్టం పోయింది. ప్రభుత్వం ఇస్తానన్న సబ్సిడీ కూడా పోయింది." - దూర్వాసులు నాయుడు, ఈసినేరిపల్లె

(మొదటి పేజీ తరువాయి)

భద్రతలో ఉన్నా.. హుందాతనమే లేకుండా, నిబంధనలను అడ్డగోలుగా ఉల్లంఘించారు. పోలీసులకు ఇచ్చిన రూట్‌మ్యాప్‌కు భిన్నంగా బంగారుపాళ్యంలోకి వెళ్లేందుకు.. వాహనాన్ని అటు తిప్పి.. ఇటు తిప్పి.. నడిరోడ్డుపై డ్రామా లాడారు. నిబంధనలు గుర్తుచేస్తూ... ముందుకు వెళ్లకుండా అడ్డు నిలబడిన ఎస్పీపైకి వాహనాన్ని నడిపించేందుకూ వెనుదీయలేదు. మరి నాయకుడు అడ్డదారి పడితే, కార్యకర్తలు మెయిల్ రోడ్డులో వెళతారా? బంగారుపాళ్యం మార్కెట్ యార్డు వద్ద వైసీపీ శ్రేణులు రచ్చ రచ్చ చేశాయి. భద్రతా విధుల్లోని పోలీసులను కవ్విస్తూ వీరంగం సృష్టించాయి. జగన్ మార్కెట్ యార్డుకు రాకముందే యార్డులోకి వైసీపీ కార్యకర్తలు చొచ్చుకెళ్లి బీభత్సం సృష్టించాయి. అమ్ముకోడానికి ఓ రైతు రెండు ట్రాక్టర్లలో తెచ్చుకున్న మామిడికాయలను రోడ్డుపై పారబోశారు. యార్డులోని మామిడి రైతులను, సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేశాయి. విధి నిర్వహణలోని 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడిచేశాయి. ఇంతాచేసి.. మామిడికాయల మండీలో అరగంటకు మించి జగన్ గడపలేదు.

హెలిప్యాడ్ వద్ద హంగామా..

జగన్ పర్యటనలో హెలిప్యాడ్ వద్ద 30 మంది, మార్కెట్ యార్డులో 500 మందికి మాత్రమే పోలీసులు అనుమతి ఇచ్చారు. వైసీపీ శ్రేణులు వాటిని లెక్క చేయలేదు. హెలిప్యాడ్‌ను 500మంది చుట్టుముట్టారు. బయట మూడు వేల మంది మోహరించారు. అక్కడ దీంతో తోపులాట, తొక్కిసలాట చోటుచేసుకున్నాయి. పోలీసులు స్వల్పంగా లాఠీచార్జి చేయాల్సి వచ్చింది. జగన్ కాన్వాయ్‌తో పాటు నడుస్తున్న చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి, చిత్తూరు డీసీసీబీ మాజీ ఛైర్‌పర్సన్ రెడ్డమ్మ, ఓ డీఎస్పీ సైతం తోపులాట కారణంగా కింద పడిపోయారు.

రూట్ మార్చేందుకు జగన్ ప్రయత్నం: జగన్ పర్యటన రూట్‌మ్యాప్‌ను ముందస్తుగా వైసీపీ విడుదల చేసింది. దాని ప్రకారం బంగారుపాళ్యం సమీపంలోని కొత్తపల్లె వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ నుంచి జగన్ కాన్వాయ్.. హైవే మీదుగా నలగాంపల్లె ఫ్లైఓవర్ నుంచి మార్కెట్‌లోకి చేరుకోవాల్సి ఉంటుంది. దానికి అనుగుణంగానే పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. కానీ జగన్ ముందుగా అనుకున్న రూట్ ప్రకారం కాకుండా బంగారుపాళ్యం పట్టణంలో నుంచి వెళ్లేందుకు ప్రయత్నించారు. హైవే మీదు అనుకున్నంత జనాలు లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు చిత్తూరు ఎస్పీ మణికంఠ అభ్యంతరం తెలిపారు. హెలిప్యాడ్‌కు 200 మీటర్ల దూరంలోని చరణ్ దాబా వద్ద జగన్‌కీ, ఎస్పీకీ మధ్యలో దీనిపై కాసేపు వాదన జరిగింది. జగన్ కారుకు ఎదురుగా ఎస్పీ, మరో ఇద్దరు పోలీసు అధికారులతో అడ్డంగా నిలబడిపోయారు. ముందుగా ప్రకటించిన రూట్‌లోనే వెళ్లాలని కోరారు. కానీ జగన్ ఆగ్రహంతో ఎస్పీ మాట వినకుండా 'ముందుకు పోనివ్వు' అని తన కారు డ్రైవర్‌ను ఆదేశించినట్టు అక్కడున్నవారు చెప్పారు. దీంతో ఎస్పీ మరో 150 మీటర్ల దూరం వెళ్లి ఇంకొంతమంది పోలీసులను, వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టేశారు. ఇక చేసేదేమీలేక జగన్ కాన్వాయ్ ముందుగా అనుకున్న హైవే రూట్ మీదుగానే మార్కెట్ యార్డుకు చేరుకోవాల్సి వచ్చింది.

రప్పా...రప్పా కోస్తాం..

వైసీపీ కార్యకర్తలు మద్యం సేవించి బుధవారం ఉదయం 10 గంటల నుంచే రోడ్లపై హంగామా సృష్టించారు. 'వచ్చేది మా ప్రభుత్వమే.. ఎదురుగా వచ్చేవారిని రప్పా.. రప్పా కోస్తాం' అని అరుస్తూ వీరంగం చేశారు. కొంతమంది బైకులతో వేగంగా జనం మధ్యలోకి దూసుకొచ్చి భయభ్రాంతులకు గురిచేశారు. సమీపంలోనే మద్యంషాపు ఉండడంతో అక్కడ మద్యం సేవించి హంగామా చేశారు. బారికేడ్ల వద్ద ఉన్న పోలీసులను తోసుకుని మరీ ముందుకు వెళ్లారు. 'వచ్చేది మా ప్రభుత్వమే... మీ అంతుచూస్తాం' అంటూ పోలీసులను నేరుగా బెదిరించారు.

రోడ్డు షో 2.30 గంటలు.. రైతులతో అర గంట

హెలిప్యాడ్ నుంచి మార్కెట్ యార్డుకు కేవలం 4.2 కిలోమీటర్ల దూరం ఉంది. జగన్ హెలిప్యాడ్ వద్దకు ఉదయం 11.20 గంటలకు చేరుకున్నా, యార్డుకు చేరుకునే సరికి మధ్యాహ్నం 1.40 అయ్యింది. ఈ కాస్త ప్రయాణానికి ఆయనకు 2.20 గంటలు పట్టింది. కావాలనే జగన్ ఆలస్యం అయ్యేలా చేశారని అంటున్నారు. ఇందులో అరగంట పాటు రూట్ మార్చాలనే వాదనతో గడిపారు. జనాలు లేని హైవే మీద రోడ్ షో చేశారు. ముందుగా ప్లాన్ చేసి రోడ్డు మీద పడేసిన మామిడి కాయల్ని చూసుకుంటూ, నిదానంగా సాగారు. తీరా యార్డులో మాత్రం అరగంట సమయం మాత్రమే ఉన్నారు. అక్కడ కూడా వైసీపీ సానుభూతిపరులు నలుగురిని ముందుగా సిద్ధంగా ఉంచి, వారితో మాట్లాడించారు. ఎప్పుడూ రైతులతో నిండి ఉండే యార్డు వైసీపీ శ్రేణులతో నిండిపోయింది. ఇక్కడ కూడా వైసీపీ బ్యాచ్ నానా బీభత్సం సృష్టించింది. బంగారుపాళ్యం మార్కెట్‌యార్డు ప్రధాన గేటును పోలీసులు మూసేసినా లెక్క చేయలేదు. పోలీసులను, గేట్లను తోసేసి లోపలికి వెళ్లిపోయారు. దాదాపు ఐదు వేల మంది యార్డులోకి జొరబడి గందరగోళం సృష్టించారు.

మూడు కేసుల నమోదు...

జగన్ పర్యటనలో చోటుచేసుకున్న ఉల్లంఘనలపై బంగారుపాళ్యం పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు నమోదయ్యాయి. హెలిప్యాడ్ వద్ద 30 మందికి, యార్డులో 500 మందికి మాత్రమే అనుమతిచ్చినా.. నిబంధనల్ని పాటించలేదంటూ ఓ కేసు పెట్టారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, బంగారుపాళ్యం మండల వైసీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్‌రాజా పేర్లను ప్రస్తుతానికి చేర్చారు. జగన్ వచ్చేటప్పుడు ఆ మార్గంలో రోడ్డు మీద మామిడి కాయల్ని పారబోసిన ఘటనలో అక్బర్, ఉదయ్‌కుమార్ అనే ఇద్దరిపై రెండో కేసును నమోదు చేశారు. 'ఆంధ్రజ్యోతి' చిత్తూరు స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడికి సంబంధించి మూడో కేసు నమోదైంది. శివకుమార్‌పై దాడి చేస్తున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అనుచరుడు ప్రకాశ్ ఆచారి ఈ ఫొటోల్లో ప్రధానంగా కనిపించారు. మిగిలిన వారిని కూడా పోలీసులు గుర్తించే పనిలో ఉన్నారు.

పక్కా ప్లాన్ ప్రకారం..


పక్కా ప్రణాళిక ప్రకారం రోడ్డు షో జరిగింది. జగన్ ప్రయాణించే సర్వీసు రోడ్డు సమీపాన ఉన్న వైసీపీ మాజీ సర్పంచి ప్రకాశ్‌రెడ్డి తోటలో మామిడి కాయలతో ఐదు ట్రాక్టర్లను దాచి ఉంచారు. జగన్ రావడానికి ముందు ఒక్కసారిగా వాటిని బయటికి తీసుకొచ్చారు. రోడ్డు మీద కాయలు పడేశారు. పనిలో పనిగా... అమ్ముకోడానికి దుర్వాసుల నాయుడు అనే రైతు రెండు ట్రాక్టర్లలో తెచ్చుకున్న మామిడికాయలనూ రోడ్డుపై పారబోశారు. దీంతో ఆ రైతు లబోదిబోమన్నాడు. అయినా, ఇవేవీ పట్టించుకోకుండా జగన్ కాన్వాయ్, వైసీపీ శ్రేణులు.. రైతులు శ్రమతో పండించిన ఆ కాయల్ని తొక్కుకుంటూ వెళ్లాయి.

రాజకీయ లబ్ధి కోసమే వచ్చారు

- చిత్తశుద్ధి ఉంటే ఆయన డబ్బిచ్చి ఆదుకోవాలి
- జగన్ పర్యటనపై మామిడి రైతులు

బంగారుపాళ్యం, జూలై 9(ఆంధ్రజ్యోతి): రైతులతో ముఖాముఖి పేరుతో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి బంగారుపాళ్యం రావడాన్ని మామిడి రైతులు తప్పుబట్టారు. ఆయన రాకవల్ల ఏమీ ఉపయోగం ఉండదన్నారు. ఆయన పర్యటన కేవలం రాజకీయ లబ్ధికోసమేనని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు. రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆయన డబ్బిచ్చి ఆదుకోవాలన్నారు. పంట కోత దశలో మామిడి రైతులను, వ్యాపారులను తప్పుదోవ పట్టించేందుకే ఈ పర్యటన అని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

కోతలు లేక 50 టన్నుల మేర నష్టం



నాకున్న రెండు మామిడి కాయల మండీలకు సుమారు 100 టన్నుల మేర తోతాపురి కాయలు వచ్చేవి. జగన్ పర్యటనతో రైతులెవరూ కాయలు తీసుకురాలేదు. దీంతో కాయలను కోయకపోవడంతో బంగారుపాళ్యం మండల రైతులకే సుమారు 50 టన్నుల మేర నష్టం వాటిల్లింది. మార్కెట్ యార్డులో 113 మామిడి మండీలున్నాయి. ఒక్కో మండీకి 4 టన్నులనుకున్నా ఈ రోజు 452 టన్నులు రావాల్సి ఉంది. అయితే జగన్ పర్యటన వలన రైతులు కాయలు కోయకపోవడంతో అవి తోటలోనే మాగి రాలిపోయే పరిస్థితి నెలకొంది. కాయల కోత సమయంలో ఇలా పర్యటనల పేరుతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం జగన్‌కు తగదు.

- చక్రధరరావు, మండీ వ్యాపారి

పర్యటనతో మాకేం లాభం లేదు



జగన్ యాత్ర వల్ల మాకేం లాభం లేదు. రైతులను ఆదుకోవడం కన్నా రాజకీయ లబ్ధికోసమే ఆయన వచ్చినట్లు అన్పిస్తోంది. నాకున్న 15 ఎకరాల మామిడి తోటలో సుమారు 75 టన్నుల తోతాపురి ఈ సంవత్సరం కాపు కాసింది. కాయలను చిత్తూరు, నలగాంపల్లె గుజ్జుపరిశ్రమలకు తరలించగా టన్ను రూ. 6 వేల చొప్పున కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ రూ.4 కోసం సంబంధిత అధికారుల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేశా. ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ మాకు కొంత ఊరటను ఇచ్చింది.

- చంద్రయ్య, బోడబండ్ల

కూలీలు లేక కాయలు కోయలేదు



జగన్ పర్యటన వల్ల కూలీలు, మామిడి రైతులు నష్టపోయారు. కాయలు కోద్దామనుకుంటే కూలీలు దొరకలేదు. నాకు 10 ఎకరాల మామిడి తోపు ఉంది. ఈ ఏడాది సుమారు 100 టన్నుల పంట వచ్చింది. ఇప్పటికే 60 టన్నుల కాయలు కోసి ఫ్యాక్టరీలకు తరలించా. జగన్ పర్యటనతో ఈ రోజు మండీలు లేక కాయలు కోయలేదు. దాని వల్ల కాయలు రాలి పడిపోయాయి.

- గిరి, బేకుమంద

3.58 లక్షల టన్నుల మామిడి సేకరణ: ఉద్యాన డైరెక్టర్

అమరావతి, జూలై9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో ఇప్పటివరకు 3.58 లక్షల టన్నుల తోతాపురి రకం మామిడిని కొనుగోలు చేసినట్లు ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు చెప్పారు. బుధవారం ప్రాసెసింగ్ యూనిట్లు, ర్యాంపులు, మండీల ద్వారా 11వేల టన్నులు సేకరించామన్నారు. ర్యాంపులు, మండీల్లో ప్రస్తుత ధరపై కిలోకి రూపాయి దాకా పెరిగినట్లు ఆయన వివరించారు.

ఈ రోజు ఒక కేసు పెడితే.. రేపు 3 కేసులు పెడతాం

- వైసీపీ నేత కాసు మహేశ్‌రెడ్డి హెచ్చరిక

సత్తెనపల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఈ రోజు ఒక కేసు పెడితే రేపు మూడు కేసులు పెడతామని వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి హెచ్చరించారు. కేసులు పెట్టడం ద్వారా ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. పల్నాడు జిల్లాలో ఇటీవల జగన్ పర్యటన సందర్భంగా సత్తెనపల్లి పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులకు సంబంధించి బుధవారం జరిగిన విచారణకు మాజీ ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, కాసు మహేశ్‌రెడ్డి హాజరయ్యారు. వారిని విచారించిన సీఐ నాగమల్లేశ్వరరావు... ఎప్పుడు పిలిస్తే అప్పుడు విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. అనంతరం మహేశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 113 మంది మీద కేసులు పెట్టారని, 10లక్షల మంది మీద కేసులు పెట్టినా ఏమీకాదని అన్నారు. పల్నాడులో వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని బ్రహ్మనాయుడు ఆరోపించారు.


మళ్లీ మన ప్రభుత్వం వస్తుంది

- టీడీపీ నేతల వీపు విమానం మోతే.. :ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం, జూలై 9(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా మంత్రాలయం వైసీపీ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మంత్రాలయం నియోజకవర్గం రాంపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన వైసీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. 'నన్ను నాలుగుసార్లు గెలిపించారు. మళ్లీ మన ప్రభుత్వం వస్తుంది. ఐదోసారి గెలిచి మంత్రిగా మీ ముందుకు వస్తా. అప్పుడు టీడీపీ కార్యకర్తలు, నాయకుల వీపు విమానం మోత మోగిస్తాం. ఎవరు ఏమేం చేస్తున్నారో అవన్నీ బుక్‌లో నోట్ చేసుకుంటున్నా. టీడీపీ నేతలు పెట్టే కేసులకు ఎవరూ భయపడొద్దు. కేసులకు అయ్యే ఖర్చు నేనే భరిస్తా. ఇప్పుడు ఎవరైతే పోలీసులు కేసు పెట్టారో... ఆ పోలీసులతో నా నియోజకవర్గంలో పని చేయించుకుంటూ టీడీపీ వాళ్లపై కేసులు నమోదు చేయిస్తా' అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. 'వచ్చే ఎన్నికల్లో వైసీపీ అఖండ విజయం సాధిస్తుంది. మూడు రంగుల వైసీపీ కండువాతో ప్రభుత్వ కార్యాలయాలకు మన కార్యకర్తలు వెళ్తే బ్రూ కాఫీ ఇచ్చి కూర్చోబెడతారు' అని వ్యాఖ్యానించారు.

బెజవాడ లెనిన్ సెంటర్ పేరు మార్చాలి

- కవిసామ్రాట్ విశ్వనాథ పేరు పెట్టాలి: మాధవ్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకారం



బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు చేపడుతున్న మాధవ్

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): 'విజయవాడలో లెనిన్ సెంటర్ పేరుమార్చి కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ పేరు పెట్టాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయడానికి ముందు తుమ్మలపల్లిక్షేత్రం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి, లెనిన్ సెంటర్‌లో విశ్వనాథ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు

'లెనిన్' పేరు రద్దు చేయలేరు : వామపక్షాలు

విజయవాడ, జూలై 9(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని లెనిన్ సెంటర్ పేరును తొలగించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ చేసిన వ్యాఖ్యలకు వామపక్షనేతలు కౌంటర్ ఇచ్చారు. లెనిన్ సెంటర్ ఎవరో నిర్ణయించిన పేరు కాదని, కాలక్రమంలో ప్రజలు నిర్ణయించుకున్న పేరని తెలిపారు. దాన్ని రద్దు చేసే అధికారం ఎవరికి లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు స్పష్టం చేశారు

అబద్ధాలు.. అసత్యాలు!

- ఎప్పటిలాగే వల్లెవేసిన జగన్
- కూటమి ప్రభుత్వంపై అక్కసు
- చివరకు పోలీసులపైనా నిందలు
- తన హయాంలో తోతాపురికి సాయం చేయకపోయినా గొప్పలు

చిత్తూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పర్యటనలో వైసీపీ అధ్యక్షుడు జగన్ ఎప్పటిలాగే అబద్ధాలు వల్లె వేశారు. కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేశారు. చివరకు పోలీసులపైనా నిందలు వేశారు. వాస్తవాలను దాచి అబద్ధాలను నమ్మించాలని చూశారు. బంగారుపాళ్యంలో మామిడి రైతుల్ని పరామర్శించేందుకు వచ్చిన ఆయన అక్కడి మార్కెట్ యార్డులో అరగంట మాట్లాడారు. అందులో చాలా వరకు అవాస్తవాలే ఉన్నాయి. ఉదాహరణకు కొన్ని...

జగన్: మామిడి రైతుల్ని ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వాన్ని నిద్ర లేపేందుకే ఇక్కడికి వచ్చా.

వాస్తవం: మామిడి రైతులు డిమాండ్ చేయకముందే సీఎం చంద్రబాబు పరిస్థితిని అర్థం చేసుకుని కిలోకు రూ.4 సబ్సిడీ ప్రకటించారు. ఫ్యాక్టరీలు ధర రూ.6 ఇస్తుండగా, సబ్సిడీతో కలిపి రైతుకు కిలోకు రూ.10 అందుతోంది.

జగన్: నేను వస్తున్నానని తెలిసి 2 వేల మంది పోలీసులతో రైతులు రాకుండా అడ్డుకున్నారు. జిల్లాలో 1200 మంది రైతుల్ని అదుపులోకి తీసుకున్నారు.

వాస్తవం: జగన్ గత పర్యటనల్లో జరిగిన ప్రమాదాలు, మరణాలను దృష్టిలో పెట్టుకుని 500 మందిని అనుమతిస్తూ పోలీసులు ఆంక్షలు విధించారు. అయినా 10 వేల మంది వచ్చారు. 1200 మందిని కాదు కదా.. ఒకర్ని కూడా పోలీసులు అదుపులోకి తీసుకోలేదు.

జగన్: ఇదే మామిడిని మా ప్రభుత్వ హయాంలో రూ.22 నుంచి రూ.29 వరకు అమ్ముకున్నారు.

వాస్తవం: వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్ నయా పైసా సబ్సిడీ కూడా రైతులకు ఇవ్వలేదు. 2021, 2023 సీజన్లలో తోతాపురి ధర ఘోరంగా పతనమైనా పట్టించుకోలేదు. ఈసారి దిగుబడి రెండు రెట్లు అధికంగా రావడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి.

జగన్: ఇక్కడ రూ.12 మద్దతు ధర అమలు కావడం లేదు. అదే కర్ణాటకలో కేంద్ర మంత్రి కుమారస్వామి కేంద్రానికి లేఖ రాస్తే రూ.16 చొప్పున కొంటున్నారు.

వాస్తవం: కర్ణాటకలో రూ.16 చొప్పున కొనడం లేదు. అది మద్దతుధర మాత్రమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి కిలో తోతాపురికి అక్కడ రూ.4 సబ్సిడీ ఇస్తున్నాయి. కర్ణాటకలో ఓ రైతుకు గరిష్ఠంగా రూ.40 వేలు మాత్రమే సాయం అందుతోంది. అదే ఏపీలో మామిడి కొనుగోళ్లపై పరిమితి లేదు. రూ.2 లక్షలు సబ్సిడీ పొందిన రైతులూ ఉన్నారు.

గుర్తు పెట్టుకోండి.. వచ్చేది నాప్రభుత్వమే: జగన్

చిత్తూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మామిడి రైతుల్ని పట్టించుకోని ప్రభుత్వాన్ని నిద్ర లేపేందుకే బంగారుపాళ్యం వచ్చానని వైసీపీ అధినేత జగన్ అన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తాను ముందుంటానని, వచ్చేది తన ప్రభుత్వమేనని, గుర్తుపెట్టుకోండని హెచ్చరించారు. బుధవారం చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో రైతులతో ఆయన మాట్లాడారు. "నేను వస్తున్నానని తెలిసి 2 వేలమంది పోలీసులతో రైతులు రాకుండా అడ్డుకున్నారు. వరి, పెసర, జొన్న.. చివరికి మామిడి రైతులకు కూడా కనీస గిట్టుబాటు ధర రావడం లేదు. ఇదే మామిడి (తోతాపురి)ని మా ప్రభుత్వ హయాంలో రూ.22 నుంచి రూ.29 వరకు అమ్ముకున్నారు. ఈ ఏడాది మే మొదటి వారంలో కాకుండా జూన్ రెండో వారం తర్వాత మామిడి కొనుగోలు చేయడంతో మొత్తం పంట మార్కెట్‌ను ముంచెత్తింది. దీంతో కంపెనీలు ధరల్ని తగ్గించాయి. ఇక్కడ రూ.12 మద్దతు ధర అమలు కావడం లేదు. కుమారస్వామి కేంద్రానికి లేఖ రాస్తే కర్ణాటకలో కిలో రూ.16కుకొంటున్నారు. మా ప్రభుత్వ హయాంలో కిలో మామిడి రూ.29కి కొంటే, ఇప్పుడు రూ.12 కూడా రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వదిలి మొత్తం పంటను స్వయంగా కొని రైతుల్ని ఆదుకోవాలి. లేకుంటే రైతుల పక్షాన నిలబడి పోరాడతాం. ఇదే నా హెచ్చరిక. దాదాపు 1200 మంది రైతుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇక్కడ ఒకరి తల పగులగొట్టారు. అసలు మీరు మనుషులేనా" అని జగన్ అన్నారు.

రైతులకు పరామర్శల పేరుతో ర్యాలీలా?

- డీఎస్పీని రప్పారప్పా నరుకుతామంటారా?
- మీడియాపై దాడి చేయడం హేయం: మంత్రులు

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): రైతుల పరామర్శల పేరుతో మాజీ సీఎం జగన్ విధ్వంసకర ర్యాలీలు నిర్వహిస్తున్నారని మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. డీఎస్పీని రప్పారప్పా నరుకుతామని వైసీపీ నేతలు అనడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. మీడియాపై దాడి చేయడం అత్యంత హేయమని అన్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో మంత్రులు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ, అధిక దిగుబడి కారణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తోతాపురి రకం మామిడి ధర తగ్గిందని చెప్పారు.

మామిడి రైతుల్ని ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు కంపెనీలపై ఒత్తిడి పెంచి, కిలో రూ. 12గా నిర్ణయించి, రూ. 8 కంపెనీలు, రూ. 4 ప్రభుత్వం భరించేలా నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఇప్పటికే 4.5 లక్షల టన్నులు కొన్నామన్నారు. కిలోకి రూ. 4 చొప్పున గురువారం నుంచే నేరుగా రైతుల ఖాతాలకు జమ చేస్తామని వెల్లడించారు. పెళ్లి అయ్యాక మేళం వాయించినట్లు జగన్ పర్యటన ఉందని విమర్శించారు.



వైసీపీ మూకల దాడిలో గాయపడిన 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శివకుమార్

వైసీపీ మూక వీరంగం

- 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి
- జగన్ చిత్తూరు పర్యటనలో ఘటన
- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి సైగ చేయడంతో రెచ్చిపోయిన మూక

బంగారుపాళ్యం, జూలై 9(ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయినా వైసీపీ మార్క్ దాడుల సంస్కృతి ఆగలేదు. వైసీపీ అధినేత జగన్ చిత్తూరు జిల్లా పర్యటనలో ఆ పార్టీ మూకలు రెచ్చిపోయాయి. విధి నిర్వహణలో ఉన్న 'ఆంధ్రజ్యోతి' చిత్తూరు స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై పలువురు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. జగన్ చిత్తూరు జిల్లా పర్యటన కవరేజీకి వెళ్లిన శివకుమార్ ఫొటోలు తీస్తుండగా, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆ ఫొటోగ్రాఫర్ మనోడు కాదని సైగ చేయడంతో వైసీపీ గూండాలు రెచ్చిపోయారు. శివకుమార్‌ను చుట్టుముట్టి తల, ఛాతీపై పిడిగుద్దులు కురిపించారు. ఆయన కెమెరా లాక్కుని, అందులోని మెమొరీ కార్డును తీసేసుకున్నారు. చిత్తూరు అసెంబ్లీ వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి సమక్షంలోనే ఈ దాడి జరిగింది. ఆయన కూడా దాడిని నిలువరించలేదు. బుధవారం చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో జగన్ పర్యటించారు. బంగారుపాళ్యం మార్కెట్‌యార్డులోని 22వ నంబరు మండీలో రైతులతో మాట్లాడేందుకు జగన్, వైసీపీ నాయకులు వెళ్లారు. వారితో పాటు శివకుమార్ వెళ్లి ఫొటోలు తీస్తున్నారు. అక్కడ ఉన్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి సైగ చేయడంతో వైసీపీ మూక శివకుమార్‌పై దాడి చేసింది. పిడిగుద్దులు కురిపించడంతో ఊపిరాడని స్థితిలో ఆయన ఉక్కిరిబిక్కిరి అయిపోయారు. ఆయనకు పాత్రికేయులు మంచి నీళ్లు ఇచ్చి సేదదీర్చి.. బంగారుపాళ్యం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స చేశాక, మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శివకుమార్‌పై దాడిని టీడీపీ నేతలు, పాత్రికేయులు ఖండించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ బంగారుపాళ్యం ఆస్పత్రికి వెళ్లి శివకుమార్‌ను పరామర్శించారు. చిత్తూరు గాంధీ సర్కిల్ ఎదుట ఏపీడబ్ల్యూజేఎఫ్ఆధ్వర్యంలో పాత్రికేయులు నిరసన వ్యక్తం చేశారు. దాడి ఘటనపై బంగారుపాళ్యం పోలీసులకు ఫొటోగ్రాఫర్ శివకుమార్ ఫిర్యాదు చేశారు. దాడి చేసినవారిలో పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అనుచరుడు ప్రకాశ్ ఆచారి ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. కాగా జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఎన్నికల ముందు అనంతపురం జిల్లాలో ఆయన సభలో వైసీపీ మూక ఇలాగే రెచ్చిపోయింది. 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.


SAMSUNG
Galaxy Z Fold7
Galaxy AI
4.2mm
Slimmest Galaxy Z Fold yet
200MP Camera
with ProVisual Engine
Snapdragon 8 Elite
for Galaxy
Pre-order now
Buy 256GB. Get 512GB.
^Free memory upgrade worth ₹ 12000
24 months no-cost EMI*
Zero down payment
BAJAJ FINSERV
HDFC BANK
IDFC FIRST Bank
TVS CREDIT
Samsung Finance+™
samsung.com
Please dispose of e-waste and plastic waste responsibly. Customers can WhatsApp on 180057267664 for information on e-waste/plastic waste.
Image simulated, actual may vary. Actual UX/UI may vary. Color and features as per availability. Samsung account login is required for certain AI features. Samsung does not make any promises, assurances, or guarantees as to the accuracy, completeness or reliability of the output provided by AI features. Samsung promotes responsible use of Artificial Intelligence (AI) features. *T&C apply. 24 months no cost EMI only applicable on NBFC. Eligibility for EMI at the sole discretion of the financiers including those listed on Samsung Finance+ (Financier T&C applies). ^Pre-order customers of Galaxy Z Fold7 256 GB are eligible to benefits of memory upgrade from 256 GB to 512 GB worth ₹ 12000. Offer valid till 24 July 2025. Offer can be revised or withdrawn without prior notice. All third party logos/brands are trademarks/registered trademarks of the respective brand/company. Samsung disclaims any and all liabilities thereof.
Scan and experience Galaxy AI
Or WhatsApp "Hi" to 9870 494949 to pre-order at Samsung Experience Store